Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



**వార్షిక బ్రహ్మోత్సవములు 05-2-2022 నుండి 16-2-2022**

**శ్రీపంచమి పురస్కరించుకొని 5-2-2022నాడు శ్రీమాతా పదార్చన యజ్ఞం**

ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.
State Bank of India, Nallakunta Branch,
A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ
సెల్ : 9704227744, 9347971177
Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma

- మూసీ సాహిత్య ధార
- వచన కవితా పితామహుడు 'కందుర్తి ఆంజనేయులు'
- చినుకు చినుకుల వాన
- తెలంగాణ రైతాంగ పోరాట నవలలు - ఇతివృత్త పరిచయం
- రమణ మహర్షి ప్రబోధ సాహిత్యం - శాస్త్రీయ దృక్పథం
- బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారోత్సవ విశేషాలు
- ఉద్యమంలో పాట - మాట
- వరంగల్ జిల్లా గ్రామనామాలు



# మూసీ
# MUSI

Samputi : 25 • Sanchika : 03 • Pages : 64 • Rs. 20
January 2022

మూసీ 25 వసంతాలు











LEARN
PLAY
EXPLORE
30 YEARS
Glorious Service to Social Progress.
UPGRADED TO
CBSE
Senior Secondary School
Pre-Primary, Primary School
Optimum class strength
Child-friendly teaching by skilled teachers
Safe educational toys to stimulate learning
Activities include vocabulary enrichment, life skills, storytelling and acting.
One-to-one attention
Physical exercises, dance, singing, aerobics & field trips
Regular Parent - Teacher interaction
Middle & High School
Optimum class strength
Well-qualified and trained teachers
State-of-the-art AV hall and labs
Visual and Performing arts
Well stacked Library
Monthly Parent-Teacher interaction
A good ground preparation of competitive & common entrance exams
Yoga and Meditation for Physical & Mental balance
AI School
The latest pedagogy in classroom teaching
We impart education by integrating proven, world-class teaching methods with modern infrastructure and technology.
SISTER NIVEDITA SCHOOL
Estd-1989
CBSE - Senior Secondary School
Class I to XII
THE PLAY SCHOOL®
Kindergarten Wing of SNS
Nursery, LKG & UKG
CBSE Affiliation Code: 36300400
# D.K.Road, AMEERPET, Hyderabad-500 016. Ph.: 040-2373 1518, 4230 1518,
Mobile: +91 80967 38855, E-mail:snschoolamp@gmail.com
For Your Child's Bright Future...
www.snschool.com


ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం
మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?
అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?
మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.
సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.
7416 106 106
www.ferty9.com
IUI
IVF
ICSI
IMSI
HSG
ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...
విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్




వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 3
జనవరి - 2022
'ప్లవ' పుష్య మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**





# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**


## ఈ సంచికలో ...

### వ్యాసాలు


మూసీ సాహిత్య ధార ... 6
వచన కవితా పితామహుడు 'కుందుర్తి ఆంజనేయులు' ... ప్రొఫెసర్ బన్న అయిలయ్య 7
పద్య మనోహరం - 26 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 10
చినుకు చినుకుల వాన (బందారం కథలు-2) ... డా. నందిని సిధారెడ్డి 11
పదవినోదం - 34 ... డా. తాడేపల్లి పతంజలి 14
తెలంగాణ రైతాంగ పోరాట నవలలు - ఇతివృత్త పరిచయం ... మెంతబోయిన సైదులు 15
నా జీవితపు ప్రతి మలుపులోనూ సార్ ఉండు - తగుళ్ళ గోపాల్ తో ముఖాముఖి 19
బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారోత్సవ విశేషాలు .... 22
రమణ మహర్షి ప్రబోధ సాహిత్యం - శాస్త్రీయ దృక్పథం ... పి. రామకృష్ణ 25
స్మృతి కవిత్వంలో శ్రీమతి భారతీరాయన్న ప్రస్థానం ... సుంకరి గంగాధర్ 30
పాలమూరు జిల్లా మౌఖిక సాహిత్యం - వస్తు రూప వైవిధ్యం ... మ్యాతరి ఆనంద్ 32
ఉద్యమంలో పాట - మాట ... బందెరబోయిన శ్రీనివాస్ 35
గ్రంథాంతరంగం 8 - అలంకార తత్త్వ విచారము ... ఘట్టమరాజు 37
వరంగల్ జిల్లా గ్రామనామాలు ... కోర్గు సత్యనారాయణ 42
ఆదర్శ మాతృమూర్తి - మదాలస ... వేల్పుల శ్రీలత 44
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 18 ... టి. లక్ష్మీనారాయణ 47


### కవితలు


సంకురాతిరి ... అవుసల భాను ప్రకాశ్ - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ -6; మరణం నన్ను ఆహ్వానిస్తే ... పులుమద్ది సత్యనారాయణ - 13; నేను వెలివేయ బడ్డాను ... బి. అంజనీ దేవి -18; శ్రమజీవి రైతు ... డా. గన్నోజు శ్రీనివాసా చారి - 18; సిరివెన్నెల ... డా. గుడేలి శీనయ్య - 34; తలపులు - కొమురవెల్లి అంజయ్య ... 41; నాన్నే నా ఆదర్శం ... సాగి తేజశ్రీ - 50; ఎ నైట్ జర్నీ ... కుంచెశ్రీ - 50; మేం భారతీయులం - బతుకు వెతల ప్రేమికులం - 62.


### సమీక్షలు


శతక సంప్రదాయంలో 'దార్ల మాట' శతకం... మమత వేపాడ 51
ఆచార్య నిత్యానంద రావు గారిఅక్షరమాల (వ్యక్తిత్వ, సాహిత్య సౌరభాలు) ... శివప్రియ 55
శ్రమ జీవుల చెమట కావ్యం 'ఆపతి' ... కె. వెంకటేశ్ 57
అన్నవరం దేవేందర్ 'ఊరి దస్తూరి' పద సంపద - ఎన్. మహేందర్ 59
స్వీకృతి ... 61



**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# ఉన్నతం

నతమంటే తల ఎత్తి చూస్తే నడి ఆకాశంలోని భాగం. ఎత్తైనది. జ్యోతిషంలోనూ దశమ భావం (మిడ్ హెవెన్) గణన చేసేటప్పుడు దానిని 'నత సాధన' అంటారు. ఎవరైనా మరణిస్తే జాతీయ జెండాలను అవనతం చేస్తారు. అవ శబ్దానికి క్రిందికి అనీ, ఉత్ శబ్దానికి పైకి అనీ ఉపసర్గార్థం. ఉత్–యోగం = ఉద్యోగం, శ్రేష్ఠమైన కలయిక లేదా స్థితి. ఉత్ – యమం = ఉద్యమం, శ్రేష్ఠమైన ప్రయత్నం. అదేవిధంగా ఉత్– నతం = ఉన్నతం, శ్రేష్ఠమైనది అని అర్థం. భావార్థాలు, శబ్దార్థాలు ఏవైనా ఉన్నతం అంటే గొప్పది, ఎదుగుదల మొదలైన అర్థాల్లో గమనిస్తున్నాం.

ఎన్నో మంచి కార్యాలు చేసిన తర్వాతనే, అత్యంత ఉన్నతమైన మోక్షాదులపైన దృష్టి పెట్టిన తర్వాతనే మనకు ఈ జన్మాదులు ఏర్పడినాయని పెద్దల భావన. అందుకే వ్యక్తి లోక సంబంధమైన, లోకాతీతమైన వ్యవహారాల్లో తన ఉన్నతిపై దృష్టి సారిస్తూ ఉండాలి. తనకు తెలియకుండా తాను పరిమితుడై, తన భావనను ఉన్నతిపై పెట్టలేక పోతున్నాడు. పూర్ణ చైతన్యం తనలో ఉన్నా, ఎంతో బలవంతుడైనా, తనను తాను తక్కువగా చూసుకోవడమే అలవాటుగా మార్చుకున్నాడు. సమాజం కూడా ఆ విధంగా జీవించడానికే విలువ నిచ్చింది.

భావనామయ లోకంలో నిత్యం తనను తాను ఉన్నతునిగా భావించుకునే వాడు కాలక్రమంలో అత్యంత ఉన్నతునిగా మారగలడు. మనకు తెలిసినంతలో మనకు కనిపిస్తున్న వ్యవస్థలో అతి పెద్ద, అత్యున్నతమైనవాడు సూర్యుడే. సూర్యుని నుండి వెలుగు, వేడిమి మనకు లభిస్తూనే ఉన్నాయి. మన లక్ష్యం ఆ విధంగా ఉండాలి. సూర్యుని లాగా లోకానికి నిరంతరం వినియోగపడే జీవితంగా మన జీవితం మార్చుకోవాలంటే ఆ సూర్య తత్త్వంతో తాను అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి. మన సెల్ ఫోన్‌కు ఛార్జింగ్ కావాలంటే మూలశక్తి అయిన 'పవర్'తో అనుసంధానం అయినట్లుగా, మన మనస్సులోని బలహీనతలు పూర్తిగా తొలగుతూ పోవాలంటే నిరంతరం బలంతో అనుసంధానం కావాల్సిందే. మనకు తెలిసినంతలో అతి బలాదులన్నీ గమనించాల్సిందే.

దేహం, స్త్రీ పురుషత్వం, కుటుంబం, ఉద్యోగం, వ్యాపారం, కులం, మతం, ప్రాంతం, వర్గం, వర్ణం మొదలైన అంశాలే కాకుండా వీటికి అనుబంధమైన సమస్యలు, అనారోగ్యాలు, ఆర్థిక వ్యవహారాలు, అవమానాలు మొదలైన వానితో మనం అనుసంధానం అవుతూ ఉండడం తెలిసిందే. గొప్పదైన మన మనస్సును తెలివితో వీనికి అనుసంధానం చేయకుండా నిరంతరం తనకన్నా ఉన్నతమైన శక్తితో అనుసంధానం చేయడం అలవాటు చేయించడమే ధ్యానం. దానితో బలోపేతుడైన మానవుడు పొందగలిగే శక్తి అపురూపం, అపూర్వం. శక్తితో అనుసంధానం కావడమే జీవితం. శక్తి మనను ఎన్నో విధాలుగా కాపాడుతుంది. మన అజ్ఞానం వల్ల శక్తిని దుర్వినియోగం చేసుకుంటున్నాం. జ్ఞానంతో లోక వ్యవహారాలపై దృష్టి తగ్గిస్తే శక్తి అనుసంధానం కూడా ఆనందాత్మకం అవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనులు పూర్తి అయ్యే అవకాశం కలుగుతుంది. జీవనం కళాత్మకం అవుతుంది. ఈ లోకంలో ఉన్న కొద్ది కాలంలోనే జీవితం పరిపూర్ణం అవుతుంది.

ఈ లోకంలోని ధనం, వస్తుజాలం, బంధు వర్గం, ఉద్యోగాదులు అన్నీ తన భావనకు అనుగుణంగా ఉండాలి. ఎంత ఉన్నతమైన భావనలతో నిరంతరం ఉంటారో అంతగా లోకహితాన్ని కోరుకుంటారు, పరమార్థానికి చేరుకుంటారు. ఉన్నతిపై దృష్టి సారించని వాళ్ళు ఉన్న స్థానంలో ఉండడమో, ఇంకా క్రిందికి జారుతూ, స్వార్థంతో ప్రవర్తిస్తుంటారు. ఇబ్బందులు పెడుతుంటారు. అందుకే తామున్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి, ఉత్త స్థాయి నుండి ఉత్తమ స్థాయికి మనిషి దృష్టి సారించాల్సిందే.

# సంకురాతిరి...




ఘల్లు ఘల్లు ఘల్లని గంగిరెద్దుల కాలి,
యందెల రవళులే యందమొలుకు!
పిపిపీపి పీపీపి పేర్మియై నాదమ్ము
సంతోషమై మ్రోగు సంబరమున!
ధింధిమి ధిమిధిమ్మి దేదీప్య శబ్దాల,
వాద్యాలు నినదించు వసుధయందు!
నన్నాన ననవాన నవదీప రాగాలు
హరిదాసు పాడగా హాయిగలుగు!
కరకర కరమను కమ్మని సకినాలు
నోరార నమలగా నూత్న శక్తి!
దివ్య సంగీత నాదాలు దెసల విరియ,
పర్వ శోభలు భువినిండ పరుగులెత్త,
పిండివంటల నింటింట మెండుజేయ,
సంబరమ్ముల సంక్రాంతి సంతసముగ,
రమ్ము రారమ్ము పర్వమా! రామకముగ!!

ఘనతర భోగి భాగ్యముల కాంతులు జీవితమందు నిండి, మీ
రనిశము సర్వసౌఖ్య పదమందున నిల్చి శుభంకరాకృతిన్,
వినుత ప్రకాశ భానుమయ వేదికలై తగతళ్కులీనగన్
మన గృహసీమలన్ని! వర మానిత దీపిత సంకురాతిరిన్!

నింగిచుక్కల పంక్తులన్నియు నేల జారినయట్లుగా
రంగవల్లిక తీర్చిదిద్దిరి రామణీయక శోభతో!
పొంగి పొర్లెడు భావనమ్మున పూర్ణ సుందర శిల్పమై
యంగనల్ ధర నిల్పియుంచిరి యద్భుతమ్మగు ముగ్గులన్!

జారు వెండ్రుకలను చారు కరము దీర్చి
చెమట చుక్క నుదుట చెలువ మొలుక
రమణి రాజసముగ రమణీయ భంగిలో,
చుక్క చుక్క గలుపు! సొంపు లొలుకు!!

పువ్వులు తీవలును పూర్వ తరాద్భుత చిత్రరాజముల్
నవ్వులు జిల్కునట్లు నిడు! నవ్య సుదీప్తులు తళ్కులీన! నా
మువ్వల పంక్తులన్ని రసమోహన రాగము మీటుచుండగా
నవ్వన జాతనేత్రలిల నద్భుత శిల్పులె ముగ్గ దీర్చగన్!

హరివిల్లు ఖండమ్ము లాకాశ మందున
గాలి పటములయి కాంతు లొలికె!
నింద్ర శోభలు ధాత్రి నెన్నెన్నొ వర్ణాల
రంగవల్లుల దీర్చ రమ్య మొలికె!
నవరత్న రాశులౌ నవభోగి పళ్ళన్ని
చిత్రమౌ బాలల శిరము నొలికె!
పాడి పంటల సౌరు పల్లెల తరలెత్తి
చెలువమై యలరారి సిరుల నొలికె!
వరలు సంక్రాంతి లక్ష్మియె వసుధ కేగ,
బంధువర్గము లొకచోట విందుగూర్చి,
స్వాగతించిరి పర్వమా! వేగముగను,
ప్రజకు శ్రేయమై రావమ్మ పౌష్య లక్ష్మి!!




**అవుసుల భాను ప్రకాశ్**
అష్టావధాని, అధ్యక్షులు, పద్య సారస్వత పీఠం.
ఫోన్ : 9603 204 507

# మూసీ సాహిత్య ధార - 39

## 'సమకాలీన సాహిత్యం – అధ్యయనం, ప్రయోజనం'

నిరంతరం పరిశోధన ప్రవంతిగా సాగుతున్న 'మూసీ సాహిత్యధార' ఈ మాసం 39వ సమావేశం నిర్వహించుకున్నాం. ఈ మాసం ప్రధాన వక్తగా డా. ఏ.కె.ప్రభాకర్ గారిని ఆహ్వానించుకున్నాం. వీరు 'సమకాలీన సాహిత్యం – అధ్యయనం, ప్రయోజనం' అనే అంశం మీద ప్రసంగించారు. దీనితో పాటు ప్రస్తుతం వస్తున్న పరిశోధన తీరుతెన్నులను విశ్లేషించారు. విమర్శించారు. కొన్ని పద్ధతులను వ్యతిరేకించారు. అయినప్పటికి పరిశోధకులు పాటించవల్సిన విషయాల్ని, విస్మరించాల్సిన అంశాలను వివరించారు. ఈ వేదిక మీదన ఎప్పటి మాదిరిగానే స్వీయ పరిశోధన అంశాన్ని మ్యాథరి ఆనంద్ మాట్లాడారు. వీరు పరిశోధనకు ఎంచుకున్న 'పాలమూరు జిల్లా – మౌఖికసాహిత్యం' అంశాన్ని తాను పరిశోధిస్తున్న కోణాలను తెలియపరిచారు. గ్రంథ సమీక్షలో భాగంగా బందరబోయిన శ్రీనివాస్ 'ఆఖ్రిదక్క' అనే కామారెడ్డి కవుల తెలంగాణ ఉద్యమ కవితా సంపుటిని పరిచయం చేసారు. తదనంతరం పులుమద్ది సత్యనారాయణ, సాగి తేజశ్రీ కవితాగానం చేసారు. చివరగా ఈ కార్యక్రమ పర్యవేక్షకులైన డా. ఎస్.రఘు గారు సమీక్షించి పాల్గొన్న విద్యార్థులకు విలువైన సూచనలందించారు.




## తుకారాం అభంగం

నువ్వే మా సర్వస్వము
లేదు వేరు దైవము
సంబాళించుమయ్యా దేవా
ఈ నీ పిల్లలను

మనసు మాయాజాలము
చిత్త భ్రమకు కారణము
భ్రమల పడకుండా నీపై
చిత్తముంచ వరము నీయవా

ఆత్మశుద్ధి అనంతు ధ్యానము
ఆది మూల జ్ఞానసారము
చేతుమయ్యా నీ ధ్యానము
ఆత్మరూప దేవా!


తుకా పలికే మేము
హరి పాద దాసులము
పరమాత్మ సాధన మాకు
ప్రథమ మూల ధర్మము




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

# వచన కవితా పితామహుడు "కుందుర్తి ఆంజనేయులు"

**ప్రొఫెసర్ బన్న అయిలయ్య**, ఆచార్యులు, తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9949106968



ఇవ్వాళ వచన కవిత 'ఒక ప్రక్రియ'ని చర్చోపచర్చలు చేయాల్సిన పనిలేదు. వచన కవితకు నిర్వచనం, లక్షణాలు వెదకాల్సిన పనిలేదు. వచన కవిత్వంలో భాష శిష్ట వ్యావహారికంలో ఉండాలా? ప్రామాణికమైన వచనంలో ఉండాలా? అని మీమాంసకు వెళ్ళాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆరుదశాబ్దాల క్రితమే వీటన్నింటి గూర్చి సమగ్రంగా చర్చజరిగింది. నేడు వచన కవిత సామాన్యుడి చెంతకు చేరింది. కుందుర్తి ఎప్పుడైతే కవిత్వాన్ని జాతీయం చేయాలని సంకల్పించాడో ఆ సంకల్పం ఆయన ఆశించిన దానికన్నా వెయ్యిరేట్లు ఫలించింది. **"ప్రజల వద్దకు కవిత్వం కుందుర్తి నినాదం"** సాఫల్యం చెందింది. నేడు వచన కవిత్వం రాసేవాళ్ళకు కుందుర్తి అంటే ఎవరో తెలియకపోవచ్చు. భూమిలో గింజను నాటిన వ్యక్తి ఎవరో తెలియక పోయినా అది అంకురించి మొలకెత్తి శాఖోపశాఖలుగా విస్తరించి ఫలాలిస్తుంటే ఆ గింజ నాటిన వ్యక్తి గూర్చి ఆలోచించే అవసరం వారికి ఉండదు. బహుశా కుందుర్తి కూడా వచనకవిత రాసేవారంతా తనను గుర్తుంచుకోవాలని అనుభవించే అత్యాశకు వెళ్ళిఉంటాడనుకుంటే అది మన అమాయకత్వమే అవుతుంది. కానీ 1935లో ప్రాదుర్భవించిన వచన కవితా ప్రక్రియ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతూనే ఉంది. నాటిలాగా పత్రికల్లోనే, మ్యాగజైన్స్‌లోనే తమ కవిత చూసుకోవాలనే నేటి కవులు అనుకోవడం లేదు. ఈ అత్యాధునిక కాలానికి అందివచ్చిన సోషల్‌మీడియాను సంపూర్ణంగా వినియోగించుకుంటున్నారు వచన కవులు. ఇప్పుడు కవిత్వానికి వస్తువు, దృక్పథం, శిల్పమర్మాల ప్రసక్తి అనవసరం. తనలోని స్పందనలను అద్భుతంగా, అలవోకగా కవిత్వం చేయగలుగుతున్నారు కవులు. కుందుర్తి ఆశించినట్లుగానే ప్రజల వద్దకు కవిత్వం చేరింది. కుందుర్తికి నిండా నూరేళ్ళు నిండాయి. సాహిత్యాభిమానులు కుందుర్తి శతజయంతి ఉత్సవాలను కూడా జరుపుకుంటున్నారు. వచన కవితకు కుందుర్తి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశం.

ఒక కొత్త ప్రక్రియ సాహితీ క్షేత్రంలోకి వస్తే అంత తొందరగా స్వీకరించే గుణం కుందుర్తి నాటి సమకాలీనంలో లేదని చరిత్రను తవ్వితే అర్థమవుతుంది. శిష్ట్లా ప్రారంభించిన ఈ వచన కవితా ప్రక్రియ శ్రీశ్రీలాంటి వాళ్ళ ఒళ్ళోపడి మనగలిగింది. కుందుర్తి ఆంజనేయులు చేతుల్లో వికసించింది. అందుకు వారు పడిన శ్రమ అంతా ఇంతా కాదు. గురజాడ, గిడుగు, వ్యావహారిక భాషను ప్రయోగిస్తే ఎంత ప్రతిఘటన వచ్చిందో కుందుర్తి వచన కవితా ప్రక్రియను ప్రచారం చేస్తుంటే అంతే ప్రతిఘటన వచ్చింది. ఆ ప్రతిఘటనను కుందుర్తి వ్యూహాత్మంగా ఎందుర్కొన్నాడు. వచన కవులెవరూ పద్య కవిత్వానికి వ్యతిరేకులు కాదన్నారు. శ్రీశ్రీ కవితా జడివానలో ఉక్కిరిబిక్కిరవుతున్న వారంతా దృక్పథం, మార్క్సిస్టు భావజాలం అంటూ చర్చిస్తుంటే వచన కవులకు కూడ అది శిరోధార్యమని కుందుర్తి వెల్లడించాడు. ఆనాడు కొత్తగా సాహితీ క్షేత్రంలో అడుగిడిన యువకవులకు అండగా నిలిచి వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించే ధైర్యాన్నిచ్చాడు. వారి అభిప్రాయాలు గాలిలో కలిసిపోకుండా రికార్డు చేయాలనే ఉద్దేశంతో వచన కవితా వివిధ కవుల **"పథాలు-దృక్పథాలు"** అనే వ్యాస సంకలనం వేసాడు. నాడు వచన కవిత్వం రాస్తున్న ప్రముఖులు వ్యాసాలన్నీ ఈ సంకలనంలో ఉన్నాయి. వచన కవిత, వచన గేయం, వచన పద్యం, ముక్తచ్ఛందం, వచన కవిత అని నాడు కవులు, పాఠకులు వివిధ పేర్లతో పిలుచుకుంటుంటే ఏక రూపతలో సాధించడం కోసం కుందుర్తి నానా తంటాలు పడ్డాడు. ఈ వ్యాస సంకలనం రావడంతో భిన్నభిన్న అభిప్రాయాలన్నీ పటాపంచలై "వచన కవిత" అనే ఏకరూపత ఏర్పడింది. వచనం నడ్డి విరిచి నలభై పాదాలుగా పేరిస్తే అది వచన కవిత అవుతుందా? అనే పండితులతో సైతం వచన కవిత రాయించిన ఘనత కుందుర్తిది. కుందుర్తి వెలువరించిన ఈ వ్యాస సంకలనం వచన కవితకు శుభ పరిణామం. వచన కవితా వ్యాప్తికోసమే 1966వ సంవత్సరంలో

ఫ్రీవర్స్ ఫ్రంట్ సంస్థను స్థాపంచాడు. కుందుర్తి ఈ సంస్థకు ఫ్రీవర్స్ (వచనం) అనే పేరు పెట్టడమే, ఆయన ఆశయానికి దర్పణంగా కనిపిస్తుది.

వచన కవిత్వం రాస్తూ ప్రచారం చేస్తూ ఉంటే సమకాలీన కవుల నుండి ఆయన ఎదుర్కొన్న సంఘటనలు ఆయన మాటల్లోనే చెబితే

**సమీక్షకులు నానా చీవాట్లు పెట్టినా**
**రసజ్ఞుల ప్రశంసల వానలు జోరుగా కొట్టినా**
**దూషణ భూషణ తిరస్కారాలకు**
**దూరంగా ఉండగలవారు**
**ఆత్మవిశ్వాసపు కండగలవారు**
**కొందరున్నారు లోకంలో**
**అందులో నేనొక్కణ్ణి (నాలోని నాదాలు-పీఠిక)**

పై మాటలు కుందుర్తి సంకల్ప దీక్షను తెలియజేస్తున్నాయి. వచన కవితా ప్రక్రియ ప్రచారానికి అతను కంకణం కట్టుకున్నాడు. అందుకే తన లక్ష్యంపైనే దృష్టిపెట్టాడు. కానీ, ఎక్కడా అహంకార ప్రదర్శన చేయలేదు. అతిశయోక్తిని వ్యక్తం చేయలేదు. ఆయన వ్యక్తిత్వానికి కవిత్వానికి సమన్వయం కనిపిస్తుందిక్కడ. పొగడ్తలకు తెగడ్తలకు దూరంగా ఉండి, వచన కవితా భవిష్యత్తును స్వప్నిస్తూ దాని ప్రచారానికి నిరంతరం కృషి చేసాడు.

కుందుర్తి తన వచనకవితలో భాషాపటాటోపం పదాల ఫెళార్భాటాలు, పదలాలస, అక్షరలాలస ప్రదర్శించుకోవాలని ప్రయత్నించలేదు. ఎక్కడైనా ఆయన కవిత్వంలో అలా కనిపిస్తే అవి సహజంగా ఒదిగిపోయాయి కానీ, కృత్రిమంగా మాత్రం లేవు.

**కాలం వలె నిత్యమైన మానవుడా!**
**దారిపక్క పూరి గుడిసె కాలుతుంది**
**వటవృక్షం కూలుతుంది**
**అర్ధరాత్రి పెను తుఫాను ఓడలు ముంచేస్తున్నది**
**పట్టపగలు పచ్చి దగా బ్రతుకులు ముంచేస్తున్నది**
**చీకటి వెన్నెలంతా ముఖాన సున్నం పూసుకుంది**
**నాగరికతా చొక్కా తొడుక్కుంది**
**లేలే, నిరోధించు నీ కర శృంఖల త్రెంచు**

పై కవితను కుందుర్తి సామాన్యుడిని ఉద్దేశించి రాశాడు. కవిత్వానికి ఏలాంటి ఆచ్ఛాదనలు, అస్పష్టతలు లేకుండా సామాన్యుడిలా చేరాలని కుందుర్తి ఆశించాడు. కనకనే అతని కవితలో అర్థక్లిష్టత, సంక్లిష్టత, అలంకార తాపడాలు లేకుండా స్పష్టంగా సుబోధకంగా ఉంటుంది.

వచన కవితలో 'కథాకావ్యం' రావాలని కుందుర్తి ప్రతిపాదించాడు. దీన్నొక సిద్ధాంతంగా ఆయన ప్రచారం చేసాడు. ఈ కథాకావ్యం అనే సిద్ధాంతం మీద చర్చబాగానే జరిగింది. దీనిపై వాదవివాదాలు ఎట్లా ఉన్నా కథాకావ్యం రాసింది ఒక్క కుందుర్తే. కాదంటే శీలావీర్రాజు లాంటి ఒకరిద్దరు కవులు రాస్తే రాయవచ్చు. వాటి మీదికి ఆయన తరం వాళ్ళకి దృష్టి పోలేదు. కథాకావ్యం అనే ప్రతిపాదననే శ్రీశ్రీ, తిలక్ లాంటి వాళ్ళు వ్యతిరేకించారు. కోవెల సుప్రసన్నలాంటి వాళ్ళు కథాకావ్యం సిద్ధాంతాన్ని సమర్థించారు. వ్యతిరేకించిన శ్రీశ్రీ, తిలక్ కవితల్లో చిత్రంగా కథ ఉంది. సుప్రసన్నలాంటి కవితల్లో కథలేదు.

భావకవిత్వం మొదలుకొని వచన కవిత్వం ఉద్యమస్థాయికి వచ్చిన తరువాత కూడా, తెలుగు కవిత్వంలో సంస్కృత భాషా కావ్య మర్యాదలూ నిలిచే ఉన్నాయి. పూర్వకవులు పీల్చిపిప్పి చేసిన శవాకారాలుగా నిలిచి ఉన్న కవి సమయాలు, అలంకారాలు సంస్కృత సంప్రదాయానుసారంగా వచ్చిన పాండిత్య ప్రకర్ష ఇవి వదల్లేదు. వీటితో పాటు పాశ్చాత్య సంప్రదాయాలనుసారంగా వచ్చిన అస్పష్టత అయోమయత్వమూ వచ్చి చేరాయి. వీటి భారం కవిత్వం మీద పడకుండా కుందుర్తి అడ్డుకున్నాడు. ఆ అడ్డుకోవడం కథాకావ్యం ద్వారా జరిగింది. ఇది తిలక్‌లాంటి వాళ్ళకు నచ్చలేదు. ఎందుకంటే తిలక్‌లో అటు సంస్కృత సాహిత్యధార, ఇటు పాశ్చాత్య కవిత్వ వ్యక్తీకరణ జమిలిగా చిత్రంగా ముడిపడ్డాయి. కుందుర్తి దూరదృష్టి తిలక్ లాంటి కవులకు అప్పట్లో అంతుపట్టలేదు. ఇప్పటి కవులకు దీని గురించి పూర్తిగా తెలిసినట్లు లేదేమో! కథాకావ్యం కాన్సెప్ట్ ప్రతిపాదనకు కుందుర్తి ఎందుకు పూనుకున్నాడో.

సాహిత్యంలో మనమెంత కొత్త రూపాల్ని ప్రక్రియల్ని, ప్రవేశపెట్టినా అవి పరిపుష్టం కావాలంటే సాంప్రదాయిక కథన పద్ధతిని దానిలో ఒదిగించాలి. సమాజం ఆధునికమయ్యేకొద్దీ జీవన విధానం సంక్లిష్టమవుతుంది. ఈ సంక్లిష్ట జీవన విధానాన్ని అలవాటైన కథన పద్ధతిలో చెప్పాలి. ఈ అలవాటైన పద్ధతిని వచన కవిత విస్మరిస్తే అది ఎవరి ప్రయోజనం ఆశించి వచ్చిందో అది నెరవేరబోయే ప్రమాదం ఉంది. సామాన్యులకు వచన కవిత అందించాల్సిన సందేశం విఫలమవుతుంది. ఒక ప్రక్రియ ఈ తరహాలో వైఫల్యం చవిచూడడం కుందుర్తి ఇష్టపడలేదు. కథను వినడానికి అలవాటు పడ్డ సమాజానికి కథలేని కవిత్వం చెప్పడం వల్ల చేసేదేమీ లేదని కుందుర్తికి తెలుసు. కుందుర్తి ఆశ కవిత్వాన్ని ప్రజల వద్దకు వీలైనంత చేరువగా తీసుకుపోవడం ఈ లక్ష్యంతో ఆయన ముందుకు సాగాడు. కుందుర్తి ఆశించినంతగా పరిస్థితులు అనుకూలించలేదు. రసపోషణ కథా విహితంగా ఉండదు కనక కవిత్వం కలిగించాల్సిన ప్రయోజనాన్ని కలిగించాలంటే కథాకావ్యమే మార్గం అన్నాడు కుందుర్తి.

కుందుర్తి కవితా దృక్పథం చూస్తే ప్రారంభంలో మార్క్సిస్టు దృక్పథమే. ఆయన భావాలు విశాలమైన కొద్దీ ప్రజా ఉద్యమాలు, చైతన్యం ఏ దృక్పథానికి సంబంధించినవైనా కవిత స్వీకరించడమే కర్తవ్యంగా భావించాడు. గౌరవించాడు. 'గాంధీజీ అహింసా దృష్టితో

చూసి కాదన్నతంత మాత్రాన అల్లూరి సీతారామరాజు మహావీరుడు కాకుండాపోడు. అట్లాగే మార్క్సిస్టులు గాంధీజీని కాదన్నా ఆయన ప్రజల్లో తీసుకువచ్చిన చైతన్యానికి చరిత్రలో గుర్తింపులేకుండా పోదు. ఈ దృష్టితో చూస్తే ఎన్ని లోపాలున్నా ప్రజలలో ఉవ్వెత్తున లేచిన చైతన్యాన్ని కవిగా గుర్తించినవాడు కుందుర్తి. అందుకే గాంధీ, బుద్ధుడు, అల్లూరిల గురించి తెలంగాణ, దండి ఉద్యమాల గురించి కుందుర్తి కవిత్వం రాయగలిగాడు.

**గతం చూచి గర్వించడం మంచిదే**
**కాని, ప్రస్తుతం పఠించడం మరీమంచిది**
**గతం విస్మరించడం తప్పే**
**కాని, పట్టుకు వేళ్ళాడ్డం మరీ తప్పు**
**వాల్మీకి రామాయణం, వ్యాసుడు భారతం రాసినట్లు**
**వర్తమాన కథా వస్తువును వర్ణించడం నామమాత్రం**

అంటూ వర్తమాన చరిత్రను క్లాసిక్‌గా మలిచాడు కుందుర్తి. ప్రజల భాషలో మహాకావ్యం రావాలన్నాడు, రాసి చూసాడు. అందుకు ఉదాహరణగా వారి తెలంగాణ, దండియాత్ర కథాకావ్యాలను చెప్పుకోవచ్చు.

ఏమీ చెప్పాలనేది వస్తువు. ఎలా చెప్పాలి అనేది రూపం, వస్తు రూపాలలో కుందుర్తి దేనికి ప్రాధాన్యమిచ్చాడంటే రూపానికే ప్రాధాన్యమిచ్చాడు. వచన కవితా రూపం వస్తువు ఏదైనా చాలా శక్తివంతంగా ప్రజల్లోకి తీసికెళ్ళుతుంది అంటాడు. కాబట్టి వచన కవిత ఈ యుగపువాహికనీ ఆ రూపంలో ఎంతో శిల్పవైవిధ్యాన్ని తెచ్చే అవకాశాలున్నాయి ఆ అవకాశాలను వినియోగించుకుంటే, ప్రజాకవితగా వచన కవిత ఇంకా సమగ్రమవుతుందని కుందుర్తి వాదం. అందుకే అన్ని వర్గాల వారిని సాత్వికంగా ఒప్పించి వచన కవిత పట్ల అనుకూలతను పెంచాడు. **"యుగేయుగే"** కవితా సంపుటికి రాసిన పీఠికలో **"నియమబద్ధమై నన్నయాదుల చేత తీర్చిదిద్దబడిన పద్యం మాకు తల్లి, దానిని కించబరిచే ఉద్దేశ్యం మాకులేదు. కాని తెలుగు కవిత్వానికి పద్యమే, వృత్తమే తుది స్వరూపమని అంగీకరించం"** అంటాడు.

ఇంకా ఒక కవితలో కూడా ఇదే అభిప్రాయాన్ని వెళ్ళడిస్తాడు. అయితే కుందుర్తి దృష్టిలో.

**సంప్రదాయకులంటే పద్యం రాసేవారనే**
**సంప్రదాయాన్ని మన్నించడమంటే**
**సమస్తం అనుకరించడం కాదు**
**అవసరం లేని అనేక బంధాలను**
**కావాలని కనికరించడంలేదు**
**క్రొత్తను కొందరు ద్వేషించడం కద్దు**
**అయినా పాత మా పునాది**

అని సంప్రదాయవాదులను వచన కవిత్వం వైపుకు తిప్పడంలో ఎంతో మెలకువను పాటించి వచన కవితకు ఉద్యమ స్వరూపాన్ని సంతరించి పెట్టాడు కుందుర్తి.

కవిత్వం ప్రజలను చైతన్యవంతులను చేయాలి. వారిని ముందడుగు వేయించాలి. ఆ చైతన్యం నుంచి వచ్చే పోరాట రూపాలు ప్రజల్లోంచే బహిర్గతం కావాలి అని కుందుర్తి నమ్ముతాడు. ప్రజల్ని ముఖ్యంగా సామాన్య ప్రజల్ని తమ సమస్యలపై మేలుకొని ఉండేటట్లు చేయడమే కుందుర్తి కవిత ప్రధాన ఆశయం. ప్రజల వాడుకలో ఉండే పదాలు, పదబంధాలు, పలుకుబళ్ళు, నుడికారాలు, జాతీయాలు వచన కవిత్వానికి సజీవతను చేకూరుస్తాయని కుందుర్తి గుర్తించాడు.

వ్యావహారిక భాషలో వచ్చే కవిత్వమే స్పష్టంగా స్వచ్ఛందంగా సామాన్య పాఠకుడిని కూడా చేరుతుందని కుందుర్తి ఆశించాడు. అందుకే **"నా ఊహలో వచన కవిత్వమంటే ప్రజల కవిత్వం, నా కవిత్వానికి వ్యాకరణం ప్రజలు అంటే వారు ఉపయోగించడం ద్వారా సాధువులైన శబ్దాలు నేను ప్రయోగిస్తాను గాని, శబ్దాల్లోని, కావ్యభాషలోని అర్థాలతో నాకు పనిలేదు. నాకు అలంకారాలు ప్రజలు అంటే ప్రజల భాషలో వాడే అలంకారాలే కాని, కేవలం అలంకారశాస్త్ర ప్రదర్శన చేయడానికి మనసొప్పదు. ఒక్క మాటలలో చెప్పాలంటే నా ఊహలో కవితకు శరీరం ప్రజల వ్యావహారిక భాష, ఆత్మ వారి అభ్యున్నతి"** అని కుందుర్తి వచనకవిత్వంపై తన దృక్పథాన్ని తెలియజేశాడు.

వచన కవితా ప్రక్రియ వికాసానికి ఇంత కృషిచేసినా కుందుర్తికి తెలుగు కవితాలోకం ఆయనకు వేసిన శిక్షను కుందుర్తి ఇలా చమత్కారంగా చెప్పుకున్నాడు.

**వచన కవితా విచారణలో**
**ఉరిశిక్షపడ్డ మొదటి ముద్దాయిన్నేను**
**అలనాటి కవితా లతాంగిని హత్య చేసాను**
**అలంకార ఆభరణాలను అపహరించాను**
**అన్నీ ఒప్పేసుకున్నాను**
**ఆనాడు బోనులో ఎక్కి**
**కింది కోర్టు వేసిన శిక్షను**
**మానవ కారుణ్య దృక్పథంతో సడలించి**
**జన్మ ఖైదు వేసారు హైకోర్టు న్యాయమూర్తులు**
**ఒక తరంపాటు బతకాలన్నారు బందీగా**
**పాఠకుల గుండెల చెరసాలలో**

వచన కవితా ప్రక్రియ విలసిల్లినంత కాలం కుందుర్తి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతాడు.

(కుందుర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా...)

# పద్యమనోహరం - 26


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448




**"నేలయె మేలు కాగితము, నీ హలమే కల మా హలమ్ము క ట్టే లిఖియించు పాళి, జలమే యల నీలి సిరాయనంగ, బల్ చాలుల నడ్డమున్ నిలువు చాల లిఖించి రచించు వింత గ్రం థాలవియేవొ? సుంత విదితంబొనరింపగవయ్య కర్షకా!"**

మానవ జీవితానికి ప్రధానమైన ఆధారమే ఆహారము. ఆ ఆహారాన్ని ఇచ్చి ఆదుకునే శక్తి ఉన్న ఒకే ఒక వ్యక్తి ఆరుగాలం పండించి కష్టపడే కర్షకుడే నన్నది అందరూ అంగీకరించిన సత్యమే. ఆహారం కాక మిగిలిన ఎన్ని అవసరాల్ని ఎవరు తీర్చినా కర్షకుడు కడుపు నింపితే తప్ప మానవుని మనుగడ సాగదు. ఇది పచ్చినిజం. అందుకే డా. పల్లా దుర్గయ్యగారు తమ "పాలవెల్లి" కావ్యంలో "కర్షకా!" అనే ఒక ప్రత్యేక శీర్షికతో కొన్ని విశిష్టమైన పద్యాలతో కూడిన ఒక ప్రత్యేక ఖండికనే అందించారు. ఆ ఖండికలో నిదే ఈ విశిష్ట పద్యం.

"ఓ కర్షకుడా! నీకు నేలయే కాగితము. నీ నాగలే నీకు కలము, ఆ నాగలి కఱ్ఱే రాసే కలం పాళి, పంటకొఱకు పారించే నీరే నల్లని సిరా, నాగలి దున్నుతూ అడ్డంగా, నిలువుగా నువ్వు దున్నినప్పుడు ఏర్పడే రేఖలే నువ్వు రాసే వింత కావ్యపు రాత కదా! అదేదో ఆ వింతను కొంత తెలుపవయ్యా" అంటూ కర్షకుణ్ణి సృజనకారుడైన ఒక కవితో పోలిక చెప్పడం అద్భుతమైన భావ మాధుర్యం. అక్షరశక్తి కున్న శాశ్వతత్వం, కర్షకశక్తికి కూడా ఉంటుందన్నట్లు ధ్వనింప జేయడం డా. దుర్గయ్యగారికి కవిత్వం మీద ఉన్నంత గౌరవం కర్షకుని శ్రమపై కూడా ఉన్నట్లు స్పష్టపడుతున్నది.

ఈ పద్యం రెండు విశిష్ట శక్తులను గురించి చెబుతున్నాయి. ప్రపంచానికి స్ఫూర్తిని, చైతన్యాన్ని ఇచ్చి మేల్కొలిపే ప్రతిభ సృజనకారులది. ఇది కవిత్వరూపంలో కావచ్చు, కథలరూపంలో కావచ్చు. మరో ప్రక్రియలోనైనా కావచ్చు. కాని అక్షరం నిజంగా అక్షరమే. యావత్ప్రపంచానికి, నాగరికతా విలసనానికి ఎక్కువగా తోడ్పడేది అక్షరమేనన్నది శాశ్వత సత్యం. కాలం ఏదైనా కావచ్చు, సమయం ఏదైనా కావచ్చు, కాని అన్నికాలాల్లో, అన్ని సమాజాల్లో అవసరమైన కదలికను కలిగించేది సృజనకారులే. అదేరీతిలో కర్షకుని శ్రమయే సమాజానికి కావలసిన ఆహారాన్ని అందించేది. దీనికి కూడా అక్షరానికున్నంత శక్తి ఉంది. కాలంతో నిమిత్తం లేకుండా, సమయ సందర్భాలతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థల యందు కావలసింది ఆహారమే. ఇది కూడా కాదనలేని సత్యం. ఆహారం ఏ రూపానికి చెందినదైనా కావచ్చు. ఏ దేశానికి కావలసిన అవసరమైనా కావచ్చు. అన్నింటి మనుగడకు, అందరి మనుగడకు కావలసింది కచ్చితంగా అహమేనన్నది తిరుగులేని నిజం.

ఈ రెండు అంశాలోని సారూప్యాన్ని గుర్తించిన పల్లాదుర్గయ్య గారు ఈ రెండు అంశాలను జోడించి కవితాత్మకమైన రీతిలో ఈ పద్యాన్ని రచించారు. వారి ప్రతిభకు ఇదొక దర్పణం, సమాజాన్ని గురించి ముఖ్యంగా పల్లెలను గురించి, ప్రాకృతికమైన శోభను తన అజ్ఞానం చేత ధ్వంసం చేస్తున్న మానవుని దుశ్చేష్టలకు వేదన చెందిన డా. దుర్గయ్య పలు సందర్భాలలో పల్లె జీవనంలోని మధురిమలను, అక్కడి రైతుల శ్రమ జీవనమును పాఠకునిలోని మానవత్వాన్ని మేల్కొలిపే విధంగా కవితీ్వకరించారు. వారి 'గంగిరెద్దు' కావ్యం పశు సంపద పట్ల, అంగవైకల్యం కలిగిన జీవుల పట్ల మానవ ప్రవర్తన ఎట్లా ఉండాలో కూడా తెలిపే అపురూప కావ్యం. డా. పల్లావారిది నేలవిడిచి సాము చేసే తత్త్వం కాదు. తమ రచనలో ప్రతి అక్షరం మానవుని పట్ల మమకారాన్ని, మానవత్వం పట్ల అమిత గౌరవాన్ని కలిగి ఉన్నదే.

ఈ పద్యంలో కూడా అక్షరం పట్ల ఆత్మీయత, శ్రమశక్తి పట్ల గౌరవం చూపించే క్రమంలో రెండింటినీ అందంగా సమన్వయించి చూపిన అపురూపమైన కవీశ్వరుడు డా. పల్లా దుర్గయ్యగారు.

బందారం కథలు -2

# చినుకు చినుకుల వాన

**డా. నందిని సిధారెడ్డి,** ఫోన్ : 9440 381148

మనుషులు ధర్మం తప్పినట్టే రుతువులు ధర్మం తప్పుతున్నాయి. వర్షరుతువులో రాకపోయినా, వానలు పడకపోయినా మనుషులకు కష్టం. కాలమంటేనే వానకాలం. వానలు కురిస్తేనే చెరువులు నిండేది. చెరువులు నిండితేనే పంటలు పండేది. పంటలు పండితేనే మనుషులు బతికేది. ఏది తప్పినా మనుషులక్కష్టం. మనుషులు తప్పినా మనుషులకే కష్టం. కార్తులు తప్పినా మనుషులకే కష్టం. ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు మనుషులకే కష్టం వచ్చినా దేవునిమీద పడతారు.



మూడేళ్లుగా కాలం కాలేదు. వానలు పడలేదు. కరువు ప్రతాపం చూపుతున్నది. చెరువులు మట్టి తేలి కెర్రెలు పారి దీనంగా కనిపిస్తున్నాయి. పక్షుల దాహం తీరటంలేదు. పశువులకు మేతలేదు. ఎన్ని బావులు గాలించినా చుక్కనీరు లేదు. ఇక మనుషులు సంగతి చెప్పనక్కరలేదు. బోయ సొరికెల్లో నీళ్లూరేదాకా ఆగి చెంబెడు చెంబెడు గీరి బిందెనింపుకొని తెచ్చుకుంటున్నారు. నీళ్లకరువును మించిన కరువు లేదు. నీళ్లగోసను మించిన గోసలేదు. వూరు వూరంతా తౌసు దీస్తున్నది.

ఇయ్యేడన్నా కాలమైతుందని అందరు ఎదురుచూశారు. కష్టాలు కరిగిపోతాయని ఆశపడ్డారు. రోహిణిపోయింది. మృగశిర పోయింది. చుక్కపడలే. మబ్బులొచ్చినట్టే వొస్తున్నాయి. మనుషుల మీద అలిగినట్టే వెళ్ళిపోతున్నాయి. ఆడోళ్లు మొగోళ్లు ఆకాశం దిక్కే చూస్తున్నారు. మబ్బులకు దయలేదు. కాలానికి కనికరం లేదు. వనదేవునికి కోపమొచ్చింది. ఎట్లా? ఎట్లా? వానలు కురవకపోతే ఎట్లా? మనుషులు బతకరు. ఊరు బతుకది. పోయినేడు బతుకమ్మ లేయటానికి చెర్ల కసికెడు నీళ్లులెవ్వు. గుంటతీసి బతుకమ్మేసి నీళ్లు చిలకరించి తడిపినమని తృప్తిపడ్డ ఊరు, పండుగ దాటేసిన ఊరు. ఇయ్యేడెట్ల. బతుకుడెట్ల! పొలగాండ్లెట్ల? గోజలెట్ల? ఎట్ల పొర్లాడేది?

వానలు పడాలె. వాన, వాన. ఒక్క వాన దేవుండ్లకు మొక్కుతున్నారు. ఊరి దేవతలకు బోనాలు చెయ్యాలని చాటింపు వేయించారు. చాలామంది ఇండ్లల్లో చారెడు బియ్యం లెవ్వు. అయినా తప్పదు. బోనాలు చెయ్యాలె. శుక్రవారం మాంకాళమ్మకు, ఆదివారం పోశమ్మకు బోనాలు. ఊరుఊరంతా బోనం దియ్యాలె. దేవతలకు తృప్తి చెయ్యాలె. కట్టుతప్పొద్దు. కట్టు తప్పినందుకే కాలం తప్పింది. ఇంటింటికో బోనం. వాడవాడలకో గుంపు. మూడుబాటల కాడ బోనమెత్తుకొన్న స్త్రీలు. డప్పు చప్పుళ్లు వానదేవున్ని నిదుర లేపుతున్నాయి. ఎవరికో శిగాలు. ఎవరికో దిగులు. ఏ బోనంలో ఏముందో. ఏ దేవత మెచ్చేనో. అలుగు దగ్గరికొచ్చేసరికి ఊదుబత్తుల పొగలాగే ఊరి గుండెల సెగ ఆకాశాన్ని తాకింది. కట్ట పొడుగునా బోనాల వరస. మాంకాళమ్మ గుడిముందు కొలుపులు. ఆదివారం పోశమ్మ గుడిదగ్గర ముడుపులు. ఏండ్ల వయసున్న యాపచెట్టు కొమ్మెలకు ఎన్నెన్నో ముడుపులు. పోశమ్మగుడి ముందు అంత కరువులో కోళ్లు, కొందరైతే గొర్లు బలిచ్చారు. కొలుపులు కొలిశారు. అందరినోటా ఒకటే. కాలం కావాలె. వానలు పడాలె. చేతులెక్కి మొక్కినా, చెంపలేసుకున్నా ఒకటే తప్పు కాయాలె. వానలు పడాలె. ఊరు బాగుపడాలె.

మరుసటిరోజు పిల్లలు పిల్లలు గుమిగూడారు. బదులుకున్నారు. రోకలిబండ తెచ్చారు. కప్పకోసం వెతికారు. కాలమైతే కదా కప్పలు. చెరువుల నీళ్లే లేకపోతే కప్పలెక్కడివి? బాయి బాయీ వెతికారు. బాయి సొరికెలో కునారిల్లుతున్న రెండు కప్పలు దొరకబట్టుకొచ్చారు. కప్పల్ని బట్టలో చుట్టి రోకలిబండకు కట్టారు. అటొక పిలగాడు, ఇటొక పిలగాడు, భుజంమీద పెట్టుకొన్నారు. ముంతెడు ముంతెడు నీళ్లతో తడుపుకొని తడిబట్టలతో ఇంటింటికీ తిరుగుతున్నారు. **"కప్పతల్లి కప్పతల్లి లగ్గమంట కాలమై చెరువు నిండితె భోగమంట"** పాడుతున్నారు. బిందెడు నీళ్లు పోసి మన్నించవలసిన ఇల్లాళ్లు నీళ్లు లేక అతి కష్టంగా చెంబెడు నీళ్లతో సరిపుచ్చుతున్నారు. వానాకాలమైనా ఎండ కాస్తుంది. ఎండలో కాళ్లు కాలుతుంటే నీళ్లలో తడుస్తూ ఎండుతూ ఆడి ఆడి పిల్లలు అలసిపోయారు. కప్పతల్లి ఆడారు.

కప్పల పెళ్లిల్లు చేసి మురిసారు. వానలు పడతాయని చూస్తున్నారు. మబ్బులు కనిపిస్తే తమవల్లనేనని జబ్బలు చరుచుకున్నారు పిల్లలు.

రాత్రికి స్త్రీలు గుమిగూడారు. తమ పని తాము చేయాలని భావించుకున్నారు. కలో గంజో తాగి మూడు బాటల కాడ మూగుతున్నారు. పైకి చూస్తే చుక్కలు వెక్కిరిస్తున్నాయి. వానచుక్కలకు దిక్కులేదు గాని మింటిచుక్కలు. చంద్రునికి సిగ్గు లేదు. చుక్కలకు సిగ్గులేదు అనుకుంటూ చుట్టు గముడు మొదలుపెట్టారు. ఒకరిపక్క ఒకరు. లయబద్ధంగా చప్పట్లు కొడుతూ వలయంగా తిరుగుతున్నారు. వానదేవుని పాట అందుకున్నది పెద్దమ్మ. ఆర్తితో అందరు తిరిగి అందుకొని పాడుతున్నారు. వానదేవుడు వర్యాలదేవి దగ్గర అనుమతి తీసుకొని కలియుగం కష్టసుఖాలు తెలుసుకుందామని బయలు దేరాడు. నరులంతా తమ పనుల్లో తాము మునిగి ఉన్నారు. వానదేవుడు తిరుగుతూ తిరుగుతూ వచ్చి పడమటి పట్టణంలో రాజు కూతురు పాపమ్మను మోహించాడు. వానదేవున్ని పాపమ్మ మోహంతో వానదేవున్ని బంధించింది. వానలు కురిసే విధి మరిచిపోయాడు. ఉయ్యాల పాట ఉద్వేగం సాగుతుంది. వాన జాడ లేక నరులు అవస్థలు పడుతున్నారు. పెద్దమ్మ గొంతులో వేదన సుడులు తిరుగుతుంది. పాట మలుపు తిరిగింది. వానదేవుడు బాధ్యతెరిగి వచ్చి లోకం మీద కరుణతో వానలు కురిపించాడు. కథ కాదది తమ బతుకు. నడిరాత్రి దాకా వాళ్ల ఆట సాగుతూనే ఉంది. వాళ్ల పాట వినిపిస్తూనే వుంది. కథలో వానదేవునికి కరుణ పుట్టినా, నిజంగా నిజజీవితంలో కరుణ పుట్టేనా...

తెల్లవారుజాము. వానవచ్చినట్టే వచ్చింది. తుంపర పడి ఆగిపోయింది. మళ్లీ మబ్బు అల్లుకున్నది. వచ్చె వచ్చె వాన అనుకున్నారు. ముసలోడు ఊంచినట్టు మళ్లీ అదే తుంపర. రైతుల కళ్లలో ఆశ. పవువుల చూపుల్లో చెప్పలేని ఆశ. మనిషికి మనిషి ఎదురైనప్పుడల్లా "పడుతుందంటవా?" వేరే పలకరింపుల్లేవు. వేరే పులకరింపుల్లేవు. చూపులన్నీ చినకు కొరకే.

నాలుగురోజులు గడిచాయి. మబ్బులు మురిపిస్తున్నాయి. ఏడిపిస్తున్నాయి. ఆశ. అంతలోనే అడియాస. ఎండకాస్తుంది. వానకాలం ఎండ. తడిలేని ఎండ. శివునిగుళ్లో నీళ్లు నింపి శివలింగం పూర్ణాభిషేకం జరిగితే వాన కురుస్తుందట. వెనుకట పెద్దమనుషులో, పూర్వీకులట్లా చేస్తే వాన కురిసిందని గాథ. అంతే. ఆలోచన వచ్చిందే తడవు. శివుని గుడి నీటిమయం చెయ్యటానికి నిర్ణయం జరిగింది. ఈసారి చాటింపు వేయకముందే ఊరందరికీ వార్త చేరిపోయింది. తెల్లారింది. పొడి ఎండ కాస్తుంది. పెద్దలు, భక్తులు, యాచకులు ఒకరెనుక ఒకరు శివుని గుడి దగ్గరికి చేరుకున్నారు. కొంచెం ఓ మాదిరి ఉన్న ఇంటినుంచి ఒక్కో బిందె తీసుకొచ్చారు. ముప్పయి బిందెల దాకా కూడాయి. ధోతి యువకులు గోచిపెట్టుకున్నారు. కొందరు లుంగీని గోచిలాగా బిగదీసుకున్నారు.

మా వూరికి అదొక్కటే పెద్ద గుడి. శివుని గుడి. హనుమాండ్లకు రెండుచోట్ల విగ్రహాలున్నా గుళ్లు లేవు. దేవతలకు చెట్లు, చెట్లకింద చిన్నచిన్న గుళ్లు – లోపల పసుపు కుంకుమలతో పుదించిన చిన్న రాతి ప్రతిమలు. శాస్త్రప్రకారం నిర్మాణం చేసిన దేవాలయం ఒక్కటే. శివుని గుడి. గుడిలో గర్భగుడి, శివలింగం, వెలుపల విశాలమైన గది. ఒకపక్క గణపతి మరొకపక్క త్రిమూర్తుల విగ్రహాలు. నడుమ నంది. ఎదురు గర్భగుడి ద్వారం. విశాలమైన గది అవతల ప్రధాన ప్రవేశద్వారం. పక్కన రెండుపాదముద్రలున్న రాయి. కొంచెం సమీపంలో ఎత్తుగా నిలబెట్టిన పొడువాటి రాయి. అది నిర్మాతలు వేయించిన శాసనం.

గుడి ప్రాంగణం ఎదురుగా దిగుడుబావి. దీర్ఘచతురస్రాకారం. ఎప్పుడూ బావిలో నీళ్లుంటాయి. లోపలికి అందంతం మాత్రం తవ్విన మెట్లు. బిందెలు పట్టుకొని ఐదారుగురు యువకులు బావిలో లోపలికి దిగారు. ఇరువైమంది మెట్లమీద తొక్కిపట్టి నిలబడ్డారు. మరో పదిమంది వరుసగా గర్భగుడి దాకా నిలబడ్డారు. 'హరహర మహాదేవ, శంభోశంకర' పిలుపులు, అరుపులు నింగినంటాయి. బావిలోంచి నీళ్లబిందె ఒకరందిస్తే ఒకరికొకరు మరొకరికి అట్లా అందిస్తుంటే మొదటిబిందె నీళ్లు లింగాన్ని అభిషేకిస్తూ పంతులు అట్లా బిందెలకొద్దీ నీళ్లు. ఖాళీ బిందెలు బావిలోకి, నీళ్లబిందెలు గుడిలోకి వరుసగా వస్తున్నాయి. పోతున్నాయి. గుడిలో సగం నీళ్లు చేరేసరికి రాళ్ల నిర్మాణం సందుల్లోంచి కారటం మొదలైంది. ర్యాగడిమట్టి తెచ్చి సందుల్లో గట్టిగా మెత్తారు కొందరు. గర్భగుడిలో శివలింగం మునిగిన తర్వాత బయటిగదిలోకి నీళ్లు రాసాగాయి. గణపతి, నంది విగ్రహాల అడుగు పెట్టి నీళ్లు గుండ్రంగా తిరుగుతున్నాయి. గుడి బయట ప్రధాన ద్వారానికి రాళ్లు పేర్చి మట్టి మెత్తుతూ గోడలాగా కడుతున్నారు కొందరు. నీళ్లు కరువుల అన్ని నీళ్లు. బిందె బిందె. వొచ్చే బిందె, పోయే బిందె. శంభోశంకర సాంబశివా పన్నగభూషణ పరమశివా – శివుడు ఏడ ఉన్నాడో... సాయంత్రానికల్లా శివుని గుడి నిండింది. ద్వారం పూర్తిగా మూసేశారు. అట్లా గుడినిండి మూడురోజులుండాలి.

శివుని గుడినిండా నీళ్లు నింపినందుకు ఊరు ఊరంతా సంబురంలో మునిగింది. ఆగలేని యువకులు ఈలలు వేశారు. పిల్లలు కేరింతలు కొడుతున్నారు. వానల్లు కురవాలి వానదేవుడా, వరిచేలు పండాలి వానదేవుడా... వానపడుతుంది. తప్పక వాన పడుతుంది. శివుడు గంగను వదలక తప్పదు. చెరువునిండక తప్పదు. వాళ్ల విశ్వాసం వాళ్లది. వాళ్ల పట్టుదల వాళ్లది. ఊరు బతుకాలె. బిందెలు కడిగి ఎవరి బిందెలు వాళ్ళకు ముట్టచెప్పారు. ఊరు ఊపిరి పీల్చుకున్నది.

తెల్లారింది. వానలేదు. వాన పడుతుందన్న వాతావరణం కూడా లేదు. వానకోసం ఎదురుచూస్తున్నవాళ్లకు వార్త ఎదురొచ్చింది. అందరి బిందెలు సరిగానే అందజేయగలిగినా రెండు బిందెలు తారుమారై

నాయి. నడిమంటి మల్లమ్మ మంచిబిందెకు బదులు సొట్టబడ్డ బిందె వచ్చింది. అది తమది కాదని, తమ బిందె తమకు ఇవ్వాలని ఫిర్యాదు చేసింది. సొట్టబిందె ఎవరిదో తెలువదు. మంచి బందె ఎవరికి వెళ్లిందో తెలుస్తలేదు అందరి దగ్గరికి వెళ్లి అడిగి చూశారు. మాకే బిందె రాలేదన్నారు. ఎవల బిందె మాకుందుకు? ఒకల బిందె తీసుకున్నోల్లు గత్తరొచ్చి సావాలె అని శాపనార్థాలు కూడ పెట్టారు. బిందె ఎట్ల తీస్కపోయింగ్రో అట్ల తెచ్చియ్యాల్సిందేనని, పెండ్లప్పుడు అమ్మగారోల్లు పెట్టిన బిందె. అదే బిందె కావాలని పట్టుబట్టింది మల్లమ్మ.

మెల్లమెల్లగా అదొక పంచాయితి కిందికి మారింది. పుణ్యానికి పోతే పాపమెదురైనట్టు మంచికి పోతె బిందె మెడకు చుట్టుకున్నది. బిందె అడుక్కొచ్చిన రాయమల్లయ్యకు అదే గుటగుట.

ఊరిపెద్దలు సర్దిచెప్పి ఎవల బిందె వాళ్లకు చేర్చాలని తీర్పు చెప్పాడు. సరైన రుజువుల్లేవు. గుర్తుల్లేవు. ఎట్లా పరిష్కరించాలో ఎవరికీ తోస్తలేదు. దినమంతా ఆలోచనలు. ఆలోచనలకు పదునుపెట్టి ఒక నిర్ణయానికొచ్చారు.

**“శివుని గుళ్లె నీళ్లున్నయి. కనుక శివుని పాదముద్ర దగ్గర మంత్రించిన బియ్యం ఉంటయి. ఎవలు తప్పుతుంగ్రో తెలుస్తలేదు. గనుక బిందెలిచ్చిన ఆడోల్లందరు పొద్దుగాలనే గుడికి రావాలె. తడిబట్టల తోటి శివుని మీద ప్రమాణం జేసి పాదాల ప్రతిమ మీద మంత్రించిన బియ్యం పెట్టాలె. ధర్మం తప్పి బిందె దక్కించుకోవాలని చూసినోల్ల సంగతి శంకరుడే చూసుకుంటడు. దుర్గమ్మ వెంట బడితె ఇల్లిడువది. జాగ్రత్త. ఎవల దగ్గర ఉండిపోయినా తెల్లారెవరకు బిందె శివుని పాదాల దగ్గర ఉండాలె. ఎవలకు తెలువకుంటనే బిందె చేరితో లొల్లి ఉండది. బద్ది లేదు. బద్నాం లేదు. పగ ఉండది. శివుని శిక్ష ఉండది”.**

చాటింపు అయింది. ఒకరినుంచి ఒకరికి ఊరంతా ప్రచారమైంది. రాత్రి ఊరు పట్టీపట్టని నిద్రతో ఎదురు చూసింది.

మబ్బులు కమ్ముకుంటూ విడిపోతున్న వేళ – పక్షులు తెల్లారుతున్నదని ప్రకటిస్తున్న వేళ – కోడిపుంజు అదేపనిగ కూస్తున్నవేళ...

రామమల్లయ్య, ఇద్దరు దోస్తులు గుడికి వెళ్లారు. పెద్దమస్కూరి వచ్చాడు. శివుని పాదాల ప్రతిమ ఉన్న రాయి దగ్గర బిందె తళతళ మెరుస్తున్నది. ఊరు ఊపిరి పీల్చుకున్నది. శివుడు కరుణించాడు. వానదేవుడు కరిగిపోయాడు.

## మరణం నన్ను ఆహ్వానిస్తే ...

మృత్యువు నా శరీరంపై పాకుతున్నా
దివిటీ పట్టుకొని దీపాన్ని వెలిగిస్తాను
ఆయుధం పట్టుకున్న సవ్యసాచినై
చెదిరిపోని చిరునవ్వును చిందిస్తాను
ధనుర్ధారినై
యుద్ధభూమిలో రణన్నినాదాన్ని మోగిస్తాను

మరణం నుదుటిపై ముద్దాడుతున్నా
వెన్నెలనద్దుకొని వేకువను తొలగిస్తాను
మాయను పసిగట్టిన ఘటోత్కచుడినై
చిరిగిపోని చరిత్రను లిఖిస్తాను
శత్రువు శక్తి ఆయుధాన్ని
నాతోపాటే తీసుకెళతాను

మరణం నా ఎదురుగా నిలబడినా
కురుక్షేత్రాన్ని తాకి యుద్ధ మేఘాల్ని తరలిస్తాను
సమ్మోహన భీష్ముడినై
సైన్యాధిపతిగా నిలబడతాను
మరణశయ్యపై పడుకున్నా
మచ్చరాని రాజనీతిని బోధిస్తాను

మరణం నా పాదానికి గుచ్చుతున్నా
సంధ్యను సృష్టించి అమాసను అలుముకుంటాను
అమాయకత్వాన్ని గెలిచేసే కృష్ణుడినై
భగవద్గీతను బోధిస్తాను
విజయ శత్రుసంహారం చేస్తుంటే
రథసారథినై యుద్ధాన్ని నడిపిస్తాను

మరణం నన్ను ఒంటరిని చేసి వేధిస్తుంటే
అభిమన్యుడినై ఒంటి చేత్తో నిలువరిస్తాను
మరణం నన్ను ఆహ్వానిస్తే
నా తరాన్ని త్యాగం చేసి
మహా ప్రస్థానం వైపు నడుస్తాను
మరణం నా పాదాల కింద ధూళితో సమానం.

**పులుమద్ది సత్యనారాయణ**
**ఫోన్ : 9441000537**

## మూసీ పదవినోదం - 34

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వ | | 2 కి | 4 | | X | 15 | 11 రి |
| | X | 5 | | చ | X | 16 | క్క |
| 3 కి | 7 | కి | | లా | 13 | తూ | X |
| 6 | మ | | గు | X | 14 | పి | 19 |
| ళం | | లా | X | 11 | X | 18 కు | |
| X | 10 సు | | వు | | దే | | త |
| 8 | రో | X | 12 | రా | | X | |
| 9 రా | | ధి | | జు | X | 20 | వు |

**ఆధారాలు (అడ్డం)**

1. వదినను ఏడిపించేటప్పుడు పూర్వకాలంలో పాడుకొనే పటలో వచ్చే పక్షి (5)
3. ఇలా ఏడ్చేవాడిని ప్రసిద్ధ రచయిత చాగంటి సోమయాజులవారి వర్ణన (7)
5. ఆస్వాదింపబడునది, లకుచ వృక్షము (3)
6. నేల ఉసిరికలా కావాలనుకోవటం (4)
8. సున్న, శూన్యములను ఆంగ్లంలో చెప్పండి. (2)
9. రాజులకు రాజు. చక్రవర్తి (5)
10. సరస్వతి (7)
12. ఈ పదంతో కలిసిన హల్వా బాగుంటుంది. (3)
14. లిపిని ఇలా కూడా అనవచ్చు (3)
15. లక్ష్యము (2)
16. సర్కారు జిల్లాల్లో పశువుల కాలిగిట్టను ఇలా అంటారు (2)
18. దర్భ (2)
19. నాలుగవ భాగం (2)

**ఆధారాలు (నిలువు)**

1. గోరటి వెంకన్నకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు తెచ్చిన పుస్తకం (5)
2. కిలకిలమని ధ్వని చేయు (6)
4. నీకు లెంపకాయ కొడితే మీ తాతకు ఇది కావాలి (4)
7. ఖుర్ ఆన్ సూరాలను దైవం అందించిన మాసంగా ముస్లిం మతస్థులు భావించే పవిత్రమాసంలోని ఉపవాసం (6)
8. కవచము అని ఈ పదానికి అర్థమున్నప్పటికీ జీలకర్రగా ప్రసిద్ధి చెందిన ఉర్దూపదం (2)
11. చంద్రుడు (4)
13. ఆడు తాబేలు (2)
15. గుడిలో మూల విగ్రహము ఉండే చోటికి పైన విమానమువలె ఎత్తుగా కట్టిన కట్టడపు పాతర (6)
17. నక్షత్రము (2)
19. కాశ దేశంలోని తగవు (4)

(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)

నిర్వహణ

**డా. తాడేపల్లి పతంజలి**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఫోన్ : 98666 91587



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

(ప్రపంచ పదులు
- డా. సి. నారాయణ రెడ్డి)

# తెలంగాణ రైతాంగ పోరాట నవలలు - ఇతివృత్త పరిచయం

**మెంతబోయిన సైదులు,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9010 910 956

**పరిచయం :** ముదిగంటి సుజాతరెడ్డి గారిది నల్లగొండ జిల్లా ఆకారం గ్రామం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో, ఆ నాటి పరిస్తితులప్రభావంతో వారి కుటుంబ సభ్యులు నైజాం సరిహద్దు అవతలి ప్రాంతాలకు వెళ్లిపోయారు. అప్పటికి రచయిత్రి వయసు ఎనిమిదో, తొమ్మిదో. ఆ లేత వయసులో చూసిన, విన్న సంఘటనలన్నీ మరువలేని జ్ఞాపకాలుగా నిలిచాయి. 1970... నుండి 1990 వరకు జరిగిన పరిణామాలు ఈ నవలలో చోటుచేసుకున్నాయి.

**మలుపు తిరిగిన రథచక్రాలు, నవల ఇతివృత్తం :**

ఈ నవలలో ప్రధానంగా భూస్వామ్య, రజాకార్ల వ్యతిరేక ఉద్యమాలు, పోరాట ఘట్టాలు మనకు కనిపిస్తాయి. బతుకమ్మ పండుగ రోజున ఊరి బయటకు వచ్చే ఆడవారి నగలు దోచుకోవడానికి దాడి చేయాలనుకున్న రజాకార్ల ఆట కట్టించడానికి రమేష్ దళం చేసిన ప్రయత్నంలో రమేష్ తొడలో తూటా దూసుకుపోతుంది. వేరే దారిలో తన ఆడబాప కస్తూరితో పాటు వెళ్తున్న దొర కూతురు సరళ, గాయపడి స్పృహ కోల్పోయిన రమేష్‌ను, తమ గడీలో ఒక గదికి చేర్చి రహస్యంగా చికిత్స చేస్తుంది.

అప్పటికి ప్రభాకర్ నడిపే గ్రంథాలయం నుంచి కస్తూరి తెచ్చి పెట్టే పత్రికలు, పుస్తకాలు చదివి ఒక సామాజిక అవగాహన ఏర్పరచుకున్న సరళ, రమేశ్ ఆశయాలకు ఆకర్షితురాలై అతన్ని ప్రేమిస్తుంది. తండ్రి రామచంద్రరావు దొర కూతురు సరళను 40 ఏళ్ళ అన్నారం దేశ్‌ముఖ్‌కు రెండో భార్యగా కట్టబెట్టాలనుకుంటాడు. సరళ ఈ విషయాన్ని రమేశ్‌కు చెప్తుంది. నిజానికి అన్నారం దేశ్‌ముఖ్ రంగారావు గడీపై దాడిచేసి అతన్ని చంపేయాలని దళం వారు అప్పటికే నిర్ణయించుకుంటారు. అయితే ఈ పెళ్ళి ప్రతిపాదన వచ్చి, వర నిశ్చయం (వివాహముహూర్తం పెట్టుకునే) రోజు ముందే అన్నారం గడీని ముట్టడించి రంగారావును హతమార్చి, ప్రామిసరీ నోట్లు తగలబెట్టి, గడీని కాల్చివేస్తారు. ప్రభాకర్, హైదరాబాద్‌లో ఒక అద్దె ఇంట్లో సరళ, భువనేశ్వరి, కస్తూరిలకు ఆశ్రయం కల్పిస్తాడు. గతంలో వారి ఇందూరు గడీలోని ఆడబాప మాలతికి, రామచంద్రరావు దొర చెల్లెలు భర్త ప్రతాప్ కు పుట్టిన మురళీదాసు హైదరాబాద్ లో వీరిని చూస్తాడు.సరళను పెళ్ళాడాలని దాసు కోరిక. దాసు వేధింపుల నుండి తప్పించుకోవడానికి సరళ వాళ్ళు ఇల్లు మారతారు. భువనేశ్వరి మానసిక వ్యాధితో క్రుంగి కృశించి మరణిస్తుంది. అక్కడ మరలా దాసు హాస్పిటల్‌లో కస్తూరిని చూసి భువనేశ్వరి అంత్యక్రియల అనంతరం స్మశానం నుండే సరళను, కస్తూరిని తన ఇంటికి తీసుకుపోతాడు.

అవినీతి, స్వార్థపరులైన నాయకుల మూలంగా రాజకీయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరకపోవడం, పేదరికం, నిరుద్యోగం, జనాభా పెరుగుదలమొదలగు సమస్యలు దేశంలో ఏవిధంగా చోటు చేసుకున్నాయో రచయిత్రి చిత్రించారు. స్వాతంత్ర్యానికి ముందు సాగినటువంటి సాయుధ పోరాటం స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగుతూనే వచ్చింది. పోరాట నాయకుడు రమేశ్ తన జీవితాన్ని ఉద్యమానికే అర్పితం చేశాడు. ఒక సంఘటనలో దొర కూతురు సరళ పరిచయం అయినా ప్రేమ అనే బీజం వారివురి మనసులో నాటుకున్నా ఉద్యమ బాటలో ఉన్న రమేశ్ ఆ ప్రేమను తిరస్కరిస్తాడు. సరళ మాత్రం దురదృష్టం వెంట పరుగెడుతూ అవినీతి, స్వార్థపరుడైన దాసుని వివాహం చేసుకొని ఎన్నో బాధలు పడుతుంది. తత్ఫలితంగా ఆమెకు ఒక కూతురు పుడుతుంది. కూతురు ఉన్నత విద్యలు చదివి వివాహం చేసుకొని విదేశాలకు వెళ్ళిపోతుంది. సరళకు ఒక మనుమరాలు. ఆ పాపను సరళ వద్దే ఉంచి కూతురు అల్లుడు విదేశాలకు వెళ్ళేటప్పుడు విమాన ప్రమాదంలో మరణిస్తారు. అనారోగ్యంతో ఉన్న సరళ మంచం పడుతుంది. అలాంటి స్థితిలో తన మనుమరాలిని సంరక్షించవలసిన బాధ్యతను తీసుకోవలసిందిగా రమేశ్‌ను కోరుతుంది. అంతవరకు ఉద్యమ మార్గంలో ఉండి, అజ్ఞాతంగా ఉన్న రమేశ్ సరళ ఆహ్వానాన్నందుకొని వస్తాడు. సరళ అభ్యర్థనను అంగీకరించి పాప బాధ్యత స్వీకరిస్తాడు. ఇదే ఉద్యమ రథచక్రాలు మలుపు తిరగడం. రమేశ్ ఉద్యమాన్ని విడిచి, జన జీవితంలోకి రావడమే ఈ నవలకు ముగింపు.

**ప్రజల మనిషి నవల, ఇతివృత్తం :**

'ప్రజల మనిషి' నవలను రచయిత 1952–56లో రచించారు. 1938కి పూర్వం తెలంగాణాలో రాజకీయ, సామాజిక, సాంఘిక వాతావరణం ఈ నవలకు నేపథ్యం. 'ప్రజల మనిషి' నవల స్వాతంత్ర్యానంతరం తెలంగాణాలో వెలువడిన గొప్ప నవల. తెలంగాణాలో రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవన సరళిని, ప్రజల యదార్థ గాథల స్వీయ అనుభవాలను అక్షరబద్ధం చేసాడు. 1955లో అచ్చయిన ఈ నవలలో ప్రతిబింబించిన గ్రంథాలయోద్యమం, భూసమస్య, ఆంధ్రమహాసభ, స్టేటు కాంగ్రెసు, మతపరివర్తన, జాతీయభావము, ఇంకా ఎన్నో విషయాల్నే కాకుండా దొరల ఆగడాల్ని కళ్ళారా చూసి చలించిన వ్యక్తి. దాదాపు తన స్వీయానుభవాలను వ్యూహాత్మకంగా అక్షరబద్ధం చేసి, ప్రజా ఉద్యమాలకు మూలాలను నిక్షిప్తం చేసే కార్యాచరణను చేపట్టినవాడు 'వట్టికోట ఆళ్వారుస్వామి.

ఈ నవలలోని పాత్రలు రఘునాథాచార్యులు, భర్త ఆండాలమ్మ. వీరి కుమారులు పెద్ద కొడుకు వెంకటాచార్యులు, చిన్న కొడుకు ఈ నవలకు కథానాయకుడు కంఠీరవం, వెంకటాచార్యుల భార్య తాయమ్మ, కోటయ్య, భార్య అన్నమ్మ, వీరి కుమారుడు కొమరయ్య, కొమరయ్య భార్య కనకమ్మ, కోమటి శరభయ్య, దొర రాంభూపాల రావు వీళ్ళ చుట్టే కథంతా తిరుగుతుంది.

ఈ నవలకు నిజామాబాదు జిల్లాలోని దిమ్మెగూడెం కేంద్రబిందువు. ఈ గ్రామానికి రామభూపాలరావు దొర. దొర వద్ద 'హైదరాలి' పెద్ద గుమాస్తాగా పనిచేస్తుంటాడు. మత కారణాల వల్ల హైదరాలిపై విశ్వాసం కోల్పోయినప్పుడు దొర వెంకటాద్రిని సంప్రదిస్తాడు. దొర కుటుంబానికి కంఠీరవం కుటుంబం కార్యాల సమయంలో వంటలు, విస్తర్లు కుట్టిస్తూ ఉంటారు. కంఠీరవం సహచరుడు కొమరయ్య. రాంభూపాలరావు తన కూతురు పెళ్ళికి కోటయ్యను పాలిచ్చే ఆవును ఇవ్వమని ఆజ్ఞాపిస్తాడు. కోటయ్య ఆవును ఇవ్వడానికి ఒప్పుకుంటాడు. రాంభూపాలరావు కూతురు పెళ్ళి సమయంలో విజయవాడ నుంచి ఫిడేల్ వాయించడానికి వచ్చిన మోహనాచారితో సహపంక్తి భోజనం చేయడానికి రఘునాథాచార్యుల నాయకత్వంలో ఆచార్యులందరూ నిరాకరిస్తారు.

దొర తనకవమానంగా భావించి తన పూర్వీకులు రఘునాథా చార్యుల కిచ్చిన భూమిని తిరిగి తీసుకుంటాడు. ఆ రోజు నుంచి రఘునాథాచార్యుల కుటుంబం నిరాశ్రయమౌతుంది. రఘునాథా చార్యులు వెంకటాచారిని వెంటబెట్టుకొని ఊరూరా భిక్షాటన చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. కంఠీరవంకు భిక్షాటన చేయడం ఇష్టం ఉండదు. రఘునాథాచార్యుల కుమారుడు వెంకటాచారిని తురక పంతులు కొడుతున్నాడనే నెపంతో చదువు మాన్పిస్తాడు. బడిపంతులు రఘునాథాచార్యులను బడికి పిలిపించుకొని కంఠీరవంను బడికి పంపండని, వాడిని ప్రయోజకుడిని చేస్తానని చెబుతాడు. రఘునాథాచార్యులు బడికి పంపడానికి ఒప్పుకుంటాడు. కాని తురక పంతులు వేరే ఊరికి బదిలీ అవుతాడు. కంఠీరవం నాల్గవ తరగతి వరకు చదువుకుంటాడు. పై చదువు చదవడానికి స్థోమత ఉండదు. కోటయ్య కొమరయ్య పెళ్ళిచేసి మరణిస్తాడు. కొమరయ్యకు కొడుకు పుడతాడు. అతనికి తన తండ్రి పేరు పెడతాడు. కొద్ది రోజుల తర్వాత రాంభూపాలరావు కొమరయ్యను పిలిపించి తోటబావి భూమిని నేను ఇంకొకళ్ళకు కౌలుకు ఇవ్వాలనుకుంటున్నానని చెబుతాడు.

కంఠీరవం తండ్రి మరణించడంతో వెంకటాచారి పైనా ఇంటి బాధ్యతంతా పడుతుంది. ఇంట్లో అన్నతో గొడవపడి నిజామాబాదు వెళ్ళిపోతాడు. కంఠీరవం తన తండ్రి మిత్రుడైన వేదాంతాచార్యుల ఇంట్లో ఉంటాడు. వేదాంతాచార్యుల కొడుకు మోహనాచారి సహాయంతో గ్రంథాలయానికి వెళ్ళి జాతీయోద్యమం, గ్రంథాలయోద్యమాలతో ప్రభావితుడవుతాడు.

కొమరయ్య సాగు చేస్తున్న భూమిపై దొర కన్ను పడుతుంది. ఆ భూమి ఎప్పుడో ఊరు విడిచి వెళ్ళిన ఓ బ్రాహ్మణ కుటుంబం వారిది. ఆ భూమిని కొమురయ్య కౌలుకు చేస్తుంటాడు. ఊరువిడిచి వెళ్ళిన బ్రాహ్మణ కుటుంబం వారి భూమిని నీకే ఇప్పిస్తానని వెంకటాచారితో దొర చెబుతాడు. కచేరీలో నేనే వెంకటేశ్వరరావునని అబద్ధం చెప్పాలని అంటాడు. ఆ భూమిని దొరకు అమ్మినట్లు కాగితం రాయించు కుంటాడు. దొర హైదరాలీ అండతో పది అరకలు కట్టి కొమరయ్య పొలంలోకి పంపిస్తాడు. కొమరయ్య న్యాయం కోసం దొర వద్దకు వెళ్లాడు. కొమరయ్య తల్లి అన్నమ్మ మనమణ్ణి కిందికి దింపి అర్కలకు అడ్డంగా నిలబడుతుంది. హైదరాలీ నిశ్చేష్టుడవుతాడు. హైదరాలీ రాంభూపాలరావుకు జరిగిన విషయం చెబుతాడు. హైదరాలీ తన అల్లునితో కలిసి దిమ్మగూడెంలోని హరిజనులను తురక మతంలోకి బలవంతంగా మార్చుతుంటారు. అప్పుడు కంఠీరవం వెళ్ళి అడ్డుకోవడంతో గొడవ మొదలవుతుంది. హైదరాలీని ప్రశ్నించి నందుకు కొమరయ్యను, కంఠీరవంను దేశద్రోహ నేరం కింద అరెస్టు చేస్తారు. కొమరయ్యను సత్ప్రవర్తన పూచీకత్తు మీద విడుదల చేస్తారు. కంఠీరవానికి మాత్రం రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు.

దిమ్మెగూడెంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. విజయదేవు, పరంధామయ్య, చంద్రయ్య, కొమరయ్యల ప్రోత్సాహంతో దిమ్మగూడెం ప్రజలు అన్యాయాలను, భూస్వామిని, ప్రభుత్వ అధికారుల్ని ప్రశ్నించి ఎదుర్కొనే స్థాయికి చేరుతారు. నిజామాబాదు జైల్లోనే కంఠీరవంకు, 'బషీర్' అనే ముస్లిం యువకునితో పరిచయం ఏర్పడుతుంది. కంఠీరవం విడుదలైన వెంటనే మోహనాచారిని, వకీలు వెంకటేశ్వరరావును, బషీరును వెంటబెట్టుకొని దిమ్మెగూడెం చేరుకుంటారు. కంఠీరవం గ్రంథాలయం చేరి ఇటీవల జరిగిన విషయాల గురించి ఉపన్యసిస్తాడు. బషీరును గ్రామ ప్రజలకు పరిచయం చేస్తాడు. వకీలైన వెంకటేశ్వర్లు ఊరు వదిలి వెళ్ళిన బ్రాహ్మణుని కుమారుడు వెంకటేశ్వర్లు అని తెలుస్తుంది. ఈ భూమిపైనే దొర, వెంకటాచారితో వెంకటేశ్వర్లు నేనేనని దొంగసాక్షిగా సంతకం చేయించి స్వాధీనం చేసుకుంటాడు. ఈ విషయం ఊరంతా తెలుస్తుంది. కంఠీరవం దొరను, వెంకటాచారిని అరెస్టు చేయిస్తాడు. వాళ్ళిద్దరికి మూడు సంవత్సరాలు జైలుశిక్ష పడుతుంది. వెంకటేశ్వరరావు తన భూమిని కొమరయ్యకు ఇచ్చేస్తాడు. కంఠీరవం, వెంకటేశ్వరరావు, బషీరు, పరంధామయ్య, విజయదేవులు కలిసి హైద్రాబాదు వెళ్ళి స్టేటు కాంగ్రెస్‌లో చేరిపోతారు. స్టేటు కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని ప్రారంభిస్తుంది.

ఇటు రాంభూపాల్‌రావు శిక్ష ముగించుకొని దిమ్మెగూడెం చేరుకుంటాడు. అధికారుల అండతో ప్రజలపై అధికారాన్ని చెలాయిస్తాడు. గ్రంథాలయం మూత పడుతుంది. వెంకటేశ్వరరావు ఇంట్లో పోలీసు నాకా పెట్టిస్తాడు. వెంకటేశ్వరరావు డిక్టేటరుగా,

బషీర్, కంఠీరవం, పరంధామయ్య, విజయదేవు అనుచరులుగా ఒక దళంగా సత్యాగ్రహం చేసి నిర్బంధించబడతారు.

**బందూక్ నవల, ఇతివృత్తం :**

తెలంగాణ సాయుధ పోరాటంపై 1990 తర్వాత వచ్చిన నవలల్లో బందూక్ ఒకటి. రచయిత కందిమళ్ళ ప్రతాపరెడ్డిది నల్గొండ జిల్లా జొన్నలగడ్డ గ్రామం. 1947 నాటికి బాలసంఘం కార్యదర్శిగా కొరియర్గా కొంతకాలం కార్యకర్తగా ఉండి ఆయన ప్రత్యక్షంగా చూసిన ఘటనల ఆధారంగా కల్పిత పాత్రలతో పేర్లతో ఈ నవలా రచన సాగినట్టు రచయిత ప్రకటన ద్వారా తెలుస్తోంది. ఈ నవల 1996 జూలై సంచిక "చతుర"లో సంక్షిప్తంగా ప్రచురింపబడింది.

ఈ నవలలోని పాత్రలు దొర భాస్కరరావు, పటేల్ పాపిరెడ్డి, నర్సయ్య, మల్లయ్య, సూరయ్య, వీరయ్య, లచ్చుమమ్మ, నర్సిరెడ్డి, శాంతమ్మ, రవి కథానాయకుడు, గోపాల్ రెడ్డి శకుంతలమ్మ కథానాయిక మొదలగునవి.

నవల ప్రారంభంలో తెలంగాణ లోని 'రామారం' అనే గ్రామంలో పాపిరెడ్డి అనే మంత్రి ఎన్నికల ప్రచారం కోసం వస్తాడు. పాపిరెడ్డి సభలో మాట్లాడుతుండగా శకుంతలమ్మ పెద్దగా అరచి సభను అడ్డుకుంటుంది. లచ్చుమమ్మ శకుంతలను గుర్తుపడుతుంది. ఇద్దరు అక్కడి జనంతో కలిసిపోయి పోలీసుల దౌర్జన్యాన్ని అడ్డుకుంటారు. లచ్చుమమ్మ, శకుంతలమ్మ ఎవరో చెబుతుంది అక్కడి ప్రజలకు. లచ్చుమమ్మ గతంలో జరిగిన విషయాలు చెప్పడంతో నవల ప్రారంభం అవుతుంది. 'బందూక్' నవలకు కేంద్ర బిందువు నల్లగొండ జిల్లాలోని 'ధర్మారం' అనే గ్రామం. ఆ గ్రామానికి దొర భాస్కరరావు. దొరకు ఇద్దరు భార్యలు. జానకమ్మ, సుభద్రమ్మ. నర్సిరెడ్డి ఊరిలో పెద్దరైతు. నర్సిరెడ్డి భార్య శాంతమ్మ. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు రవి, కూతురు సుగుణ. రవి హైదరాబాద్‌లో లా చదువుతుంటాడు. వకీలు గోపాలరెడ్డి కూతురు శకుంతల. శకుంతల బి.ఎ., చదువుతూంటుంది. గోపాలరెడ్డి శాంతమ్మ తమ్ముడు. రవితో శకుంతల పెళ్ళి ఎప్పుడో స్థిరమైపోతుంది. రవి, శకుంతల ఇద్దరు ప్రేమించు కుంటారు. రవి రెడ్డి హాస్టల్ లో ఉంటూ చదువుకుంటాడు. పాపిరెడ్డి, దొర భాస్కరరావుల దౌర్జన్యాలనూ ప్రజలు భరించలేక పోతుంటారు. పాపిరెడ్డి లచ్చుమమ్మపై అఘాయిత్యం చేయబోతాడు. దొరల దౌర్జన్యాలు, గడీలలో వెట్టి చాకిరి మితిమీరుతూంటుంది. ఆ సమయంలో గ్రామాలకు సంఘాలు వస్తాయి. రవి, శకుంతల పెళ్ళి ముహూర్తం పెట్టుకుంటారు. రవి హైదరాబాద్‌లో విద్యార్థుల ఆందోళనల్లో పాల్గొని అరెస్టవుతాడు. రవి, శకుంతలల వివాహం ఆగిపోతుంది. రవి దళంలో చేరిన తర్వాత మొదట కార్యకర్తగా, ఆ తర్వాత దళనాయకుడుగా ఆయా గ్రామాలకు పరిచయం అవుతాడు. రవి నాయకత్వంలో దళంవారు పోలీసు క్యాంపులపై దాడులు చేసి ఆయుధాలను తీసుకెళ్తారు. రవి దళం ధర్మారం దొర భాస్కరరావు గడీని చుట్టుముడతారు. దొరను లచ్చుమమ్మ కొడవలితో నరికి చంపివేస్తుంది. దొర్సానిలిద్దరిని చంపకుండ వదిలేస్తారు. దొర్సానిద్దరు ఊరు విడిచి వెళ్ళిపోతారు.

ఒక ఊరిలోని ప్రజలు దసరా పండుగ చేసుకుంటుంటారు. ఆ ఊరికి దళం వారు వెళతారు. కొందరు స్త్రీలు బతుకమ్మ ఆడుతుంటారు. వాళ్ళతో కలిసి లచ్చుమమ్మ, చంద్రమ్మ బతుకమ్మ ఆడతారు. బతుకమ్మ ఆడిన తర్వాత దళ సభ్యులు ఇంటికొకరు భోజనానికి ఆహ్వానించబడతారు. రవి, ఒక యువకుడితో పాటు ఊరు చివర వున్న బంగళాలోనికి పోతాడు. ఆ ఇంటిని పోలీసులు చుట్టుముడతారు. రవిని బందీగా పట్టుకుంటారు. కోర్టులో హాజరు పరుస్తారు. రవికి ఉరిశిక్ష పడుతుంది. రవి జైలులోనే శకుంతల మెడలో తాళి కడతాడు. శకుంతలమ్మ శాంతమ్మ ఇంటికి కోడలుగా వచ్చేస్తుంది. శకుంతలమ్మ భర్త ఆశయాన్ని నెరవేర్చాలని దళంలో చేరుతుంది. శంకర్, రవిని హైదరాబాద్ సెంట్రల్ జైలుకు తరలిస్తున్నప్పుడు ఇద్దరు తప్పించుకుంటారు.

రవి దళం గడి ప్రాంతాన్ని చుట్టూ మూసేస్తారు. పోలీసులపై దాడులు చేస్తారు. ఆ దాడిలో ముత్తయ్య చనిపోతాడు. ఆ గడిని తగలబెడతారు దళం వారు. ఆ గడిలో రజాకార్లు పోలీసులు కాలి బూడిదవుతారు.

సింగారం రజాకార్ల క్యాంపుపై గెరిల్లా దళం రవి నాయకత్వంలో దాడిచేస్తారు. ఈ దాడిలో రవి, యాదగిరి, సత్తిరెడ్డి చనిపోతారు. మిగిలినవాళ్ళను అరెస్టు చేస్తారు. పాపిరెడ్డి యూనియన్ సైన్యాల రాకతో ప్రజానాయకుడవుతాడు. శకుంతలమ్మ విప్లవం 'వర్ధిల్లాలి' అని బిగ్గరగా అంటుంది. నవల ముగుస్తుంది. సమాజంలో ఉద్భవించిన సమస్యలను నవల రూపంలో తీర్చిదిద్దారు రచయిత.


ఈ విధంగా పై మూడు నవలలు రైతాంగ పోరాటానికి సంబంధించిన నవలలు. అవి ఆనాటి నుండి ఈనాటి వరకూ స్ఫూర్తి దాయకాలే. ఈ ఇతివృత్తం ద్వారా మూల గ్రంథాలను అందరూ అధ్యయనం చేయాలని భావనతో ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. మలుపు తిరిగిన రథచక్రాలు (నవల) – ముదిగంటి సుజాతా రెడ్డి
2. ప్రజల మనిషి (నవల) – వట్టికోట ఆళ్వారుస్వామి.
3. బందూక్ (నవల) – కందిమళ్ళ ప్రతాపరెడ్డి

# నేను వెలివేయబడ్డాను

మనసుల నుండి, మనుషుల నుండి
వెలివేయబడ్డాను నేను
ఏ ప్రాంత మనిషినైనా సరే
ఏ దేశ వాసినైనా సరే
కనీస సామాజిక బాధ్యత లేనందుకు
సహాయం సముద్రం కావలసిన వేళ
కనీసం దోసిల్లు కూడా పనిచేయనందుకు
కట్నం కోస ఆలిని కడతేర్చినప్పుడు
పదేళ్ల బాలిక అత్యాచారానికి గురైనప్పుడు
ఆడపిల్లని తెలిసి కడుపులోనే కడతేర్చినప్పుడు
ప్రశ్నించాల్సినచోట మౌనంగా ఉన్నందుకు
వెలివేయబడ్డాను
ఆస్తులు అమ్మి కొడుకును
అమెరికాకు పంపి
అన్నం పెట్టలేక అమ్మను
అనాథ ఆశ్రమానికి పంపినప్పుడే
తెలిసింది నేను వెలివేయబడ్డానని
నా విలాసం కోసం
విలువలను నాశనం చేసినప్పుడే తెలిసింది
అక్రమ సంపదనంతా
అదృష్టం అనుకున్నప్పుడే తెలిసింది
అందుకే ముసుగేసుకొని తిరుగుతున్నా



**బి. అంజనీదేవి**
హనుమకొండ, ఫోన్ : 9908962730

# శ్రమజీవి రైతు....!

హలము జేతబట్టి హాయిగ రైతుయే
సాలు సాగు జేయు చక్కగాను
కొండిగల్లు విరగ కోపమింతయు లేక
కొత్త కొండి కొరకు కొలిమి జేరు!

హలము భుజము పైన నలవోక మోయుచు
వడ్లవారి చెంతవరకు పోయి
నాగలి కిలకొండి నయముగ బిగియించి
చెమట కారుచుండ చెలుక చేరు !

నీరు పారుచుండ నిక్కముగను చేలు
ఎదిగి ఫలములిచ్చు యెంతగాను
పంటలన్ని కూడ పరికించి జూడగ
పరుల మేలు గోరి పరితపించు!

హాలికలును లేక నవనికి బతుకేది?
సకల జీవతతికి సారమేది?
రైతు బుక్క తినని రాచరికాలేవి?
రైతు పుడమి నేలు రౌతు జూడ!

పంచదాయులంత పరమ రైతుల మేలు
కోరువారు పనులు కోరి పోరి
సస్య పరికరములు సమకూర్చు దేవుళ్ళు
చేతులెత్తి మ్రొక్క చెడునె యశము!!




**డా. గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్‌నగర్, ఫోన్ : 8555899493

# నా జీవితపు ప్రతి మలుపులో మా సార్ ఉండు - తగుళ్ళ గోపాల్

ముఖాముఖి ... డా. అట్టెం దత్తయ్య, మూసీ మాసపత్రిక సహ సంపాదకులు

ఫోన్ : 9494715445

కవిత్వానికి చెమటచుక్కలను అద్ది, బాధల కన్నీటి ధారలు కలిపి స్వచ్ఛంగా తయారుచేసిందే 'దండకడియం'. తాను పడిలేస్తూ వచ్చిన బాల్యాన్ని, ఉండీలేకా గడిపిన జీవితాన్ని, చస్తూ బతుకుతూ సాగించిన బ్రతుకును కథాత్మకంగా కవిత్వం చేసిన కవి తగుళ్ళ గోపాల్. నడిసొచ్చిన ధారివెంటా పోగొట్టుకున్నవారి కొన్ని గుర్తులను, ఆధరించివారి ఉదార గుణాలను, అన్నం పెట్టినవారి దాతృత్వాన్ని, అక్షరం నేర్పినవారి విజ్ఞతని, అమ్మనాన్నల ఋణాలను కవితలుగా మననం చేసుకున్నవారు. తనను కదిలించిన ప్రతి సన్నివేశాన్ని కవిత్వం చేసిన మానవీయ కవి. ఇంటిలో ఆరబెట్టె గంజిబువ్వ, రొడ్డుమీద ఒంటరిగా పడిఉన్న ముసలవ్వ, నిద్రలో చేసే కలవరింత, కన్నీటిబొట్లు సత్యాలపాలపుంతలను కొత్తగదర్శించే వ్యక్తి. ఇంటిముందు ఎగురుతున్న మేకపిల్లలే తనకు పదాలు. నాన్న నెత్తిమేది కట్టెల మోపుల బరువే తనకు వాక్యాలు. ఊరి మట్టి పరిమళమే తన కవితా సౌందర్యం. అన్నింటిని మించి వినయం, మానవత్వం మేళవించుకున్న మనీషి తగుళ్ళ గోపాల్. వీరికవిత్వం చదువుతుంటే బాధలను ఆలింగనం చేసుకున్నట్లు, అల్లాడుతున్న పల్లెబతుకులను మెల్లిగా నిమిరిచూసినట్లు, మరిచిపోతున్న తెలంగాణ మాటలను మననం చేసుకున్నట్లు ఉంటుంది. గొప్పగా అల్లిన ఈతచాపలా, మెత్తగా చుట్టుకున్న దూసరి తీగలా, ఇసకలో పగిలినా శంఖంలా వైవిధ్యంతో ప్రతికవితా పాఠకుడిని ఆలోచింపచేస్తుంది. ఇంతటి 'దండకడియం' కవితా సంపుటికి 'కేంద్ర సాహిత్య అకాడమి యువపురస్కారం' (2021) వరించిన సందర్భంగా 'మూసీ'తో ముచ్చట.

***1. శుభాకాంక్షలు గోపాల్***

జ. చాలా థ్యాంక్స్ అన్నా... సంతోషంగా ఉంది.

***2. కేంద్రసాహిత్య అకాడమి యువపురస్కారానికి మీరు ఎంపిక కావడంపట్ల మీ స్పందన.***

జ. ఈ పురస్కారం నా కవిత్వంలోని సామాన్యుడికి వచ్చింది. శ్రామిక జీవితాలకు దక్కిన గౌరవం. తెలంగాణ గ్రామీణ భాషకు దక్కిన గౌరవం.

**3. మీ జీవితాన్ని కవిత్వంగా ఎందుకు మలచాలనుకున్నారు?**

జ. నిజానికి నేను ఏ ఆంగ్ల సాహిత్యం చదవుకోలేదు. కవిత్వమంటే ఇలాగే ఉండాలని నియమాలేవి పెట్టుకోలేదు. తెలుగు సాహిత్యాన్ని చదువుకుంటున్న క్రమంలో కాశిరాజు అన్న రాసిన 'భూమధ్యరేఖ', నాగిళ్ళ రమేష్ అన్న రాసిన 'ఉద్దరాసి పూల చెట్టు' కవిత్వం చాలా




ఇష్టంగా చదివిన. నేను ఇదివరకు చదివిన కవిత్వం కంటే డిఫరెంట్‌గా ఉన్నది. అట్లాంటి జీవితం నాకూ ఉంది కదా! నేనెందుకు రాయకూడదని అనుకునేది. నా జీవిత అనుభవాలను ఎక్కువగా దండకడియంలో రాసిన.

**4. మీరు కవిత్వం రాయడానికి ప్రారంభ ప్రేరకులు ఎవరు?**

జ. నేను 8వ తరగతి నుంచి 10దాక సాగర్‌లో చదువుకున్న. మాకు నాగార్జున సాగర్‌లో తెలుగు టీచర్లు చాలా అద్భుతంగా తెలుగు చెప్పేది. డి.సి.నరసింహులు, సుజాత, గణపతిరెడ్డి గార్లు, వాళ్ళ బోధన కారణం. నాగర్జున సాగర్‌లో ఉన్నపుడు గ్రంథాలయ వారోత్సవాల కవితల పోటీలో ప్రోత్సాహక బహుమతి లభించింది. వచన కవిత్వానికి బీజం ఇంటర్ చదువుతున్నపుడు కల్వకుర్తిలోనే పడింది. అందుకే ఒకచోట ఇలా రాసుకున్న "బాదం చెట్టు వాకిట్లో /బండల మీద కూసోని రాసిన/ నా తొలి వాక్యానికి నమస్కరిద్దామని".

***5. ఇంత చక్కని వచన కవిత్వం రాయగల మీరు మొదటగా నానీలను ఎందుకు రారాసు.***

జ. నేను వచన కవిత్వం వైపు రావడానికి ప్రేరణ 'నానీలు'. నారాయణశర్మ గారి నానీలు చదివి వాటి ప్రేరణతో చాలా నానీలు రాశాను. 150 నానీలతో **'తీరొక్క పువ్వు'** పుస్తకం వేశాను. ఒక భావాన్ని, ఒక వాక్యాన్ని తక్కువ పదాలలో ఎట్లా చెప్పాలో నానీల ప్రక్రియ ద్వారా తెలుసుకున్న. "ఇంట్లో / దొంగలు పడ్డారు / నా పేదరికాన్ని / దోచుకుపోతే బాగుండు..." అనే నానీ నా నానీల్లో



నాకు చాలా ఇష్టమైనది.

***6. మీ బతుకుపాదానికి ముల్లునాటకుండా అక్షరాన్ని తొడిగిన వారి గురించి కొన్ని మాటలు....***

జ. నేను ఒక వ్యక్తిగా నిలబడానికి కారణం మా రాజవర్ధన్ రెడ్డిసార్. పశువుల కాపరిగా మొదలైన నా జీవితం నుంచి టీచర్ అయ్యేదాక ప్రతి మలుపులో మా సార్ ఉండు. నేను 6వ, 7వ తరగతులు సార్ వాళ్ళ సొంతింట్లో ఉండి చదువుకున్నాను. ఇంటర్ కూడా సార్ వాళ్ళ చిన్నమ్మ విమలమ్మ గారి ఇట్లో ఉంచి చదివించాడు. టి.టి.సి. చేసేటపుడు కూడా ఫీజులు కట్టారు. అయితే నేను 7వ తరగతిలో ఉన్నపుడు నాకు ఒకసారి చెప్పులు కొనిచ్చిండు. అవి పాదానికి ముల్లు నాటకుండా ఉండడానికే కదా. కాని నా బతుకుకు ఏ ముల్లు నాటకుండా నన్ను చదివించిండు. చదువు ద్వారానే మన జీవితం మారుతుందని చాలాసార్లు నాకు చెప్పెవారు. మా సార్ మీద అత్యంత గౌరవంతో 'ముల్లు పాఠం' అనే కవితలో మీరు ప్రశ్నించిన వాక్యాన్ని రాసుకున్నాను. నా దండకడియాన్ని మా సార్‌కే అంకితం ఇచ్చిన. అంకితం వాక్యాలలో కూడా ఈ వాక్యాలే రాసుకున్న. నిజంగా మా రాజవర్ధన్ రెడ్డి సార్ లేకపోతే ఈ నాడు నేనులేను. ఈ దండకడియం లేదు.

***7. "ఒంటి మీద సొమ్ములు లేని మా అమ్మ / నా వాక్యాలకు మట్టి పూత" అని రాసుకున్నారుగా. ఈ వాక్యాలను గురించి కొంత వివరిస్తారా?***

జ. అమ్మ శ్రమనే నా అక్షరం. అమ్మ నాట్లేస్తూ, కూలికిపోతూ, ఏ చిన్న పని దొరికితే ఆ పనికి పోతూ నన్ను, చెల్లెలిని చదివించింది. నేను టి.టి.సి. చేసేటపుడు కమ్మలు కుదువబెట్టి రెండువేలు పంపించింది. ఎన్నడూ ఏ నగలు కోరుకోలేదు. మేము మంచిగా చదివితే చాలనుకుంది. ఊర్లో గోడలు పూయడానికి, సున్నాలు వేయడానికి ఎక్కువపోయేది. అందుకే అమ్మగురించి

"ఒంటి మీద సొమ్ములు లేని మా అమ్మ నా వాక్యానికి మట్టిపూత..." అని రాసుకున్న. మట్టిపూత అనే పదానికంటె ముందు వెండిపూత, బంగారు పూత అని రాసుకున్న గాని చాలా రోజులకు అవి నచ్చక మా అమ్మ పొక్కిలైన గోడల్లి పూస్తుంది కదా మట్టితో అని చాలా ఇష్టంగా 'మట్టిపూత' అని పెట్టుకున్న.

***8. మీరు చదువు ఆపేసిన సంధి సమయం గురించి చెపుతారా!***

జ. నాయిన అక్కపెళ్ళి చేసిన తర్వాత పట్నానికి వలసబోయిండు. చాపల కంపెనిలో అమ్మ, నాయిన పనిచేసేది. రెండేండ్ల తర్వాత మళ్ళీ ఊరుకొస్తే ఊర్లో ఇల్లులేదు. అప్పుడు నాయిన ఒక పటేల్ దగ్గర నన్ను జీతముంచిండు.

***9. పనిమనిషిగా ఉంటూ చదువుకున్న కల్వకుర్తి జీవితాన్ని మతోపంచుకుంటారా!***

జ. కల్వకుర్తిలో విమలమ్మ, మాణిక్యరెడ్డి గార్ల ఇంటి దగ్గర ఉండి చదువుకున్న. ఇంట్లో చిన్నచిన్న పనులకు ఆసరై చదువుకునేది. 'ఇలంతా గోపిదే' అనేంతగా సొంత ఇంట్లో ఉండినట్లే పెరిగిన. కల్వకుర్తి జీవితం కవిత్వంలోని తొలి అడుగులను నేర్పించింది.

***10. బాధల పాత్రబతుకును కొత్తగ ప్రేమించడం కవిత్వమే నేర్పిందంటారా!***

జ. పేదరికం వలన ఎన్నో ఇబ్బందులు పడ్డాను. మానసికంగా కుంగిపోయిన సందర్భాలు ఎన్నో. బాల్యమంతా కాళ్ళను ముందలేసుకొని ముండ్లను తీయడంతోనే గడిచిపోయింది. కవిత్వం రాస్తున్నపుడు మాత్రం 'ఇంత జీవితం ఉంది నాకు' ప్రతిదీ కవిత్వం చేయాలి అనుకున్న. నా జీవితాన్ని కొత్తగా ప్రేమించడం నేర్పింది కవిత్వం. అయితే ఎంత పేదరికం అయినా మా మేనత్తలు, పెద్దమ్మలు, పెదనాయనలు మమ్మల్ని చాలా ప్రేమగా చూసుకునే వారు. పేదరికంలోని ప్రేమలు చాలా గొప్పివి.

***12. 'లేని చోటు' అని మీ నాయనమ్మ గురించి రాసిన కవిత్వం కంటనీరు పెట్టిస్తుంది. ఎలారాయగలిగావు గోపాల్.***

జ. ఊర్లలో ఎంతోమంది ముసలివాళ్లను చూస్తున్నాను. కొడుకు, కోడలు సరిగ్గా చూడక ఎంతో గోస తీసి చనిపోతున్నారు. అన్నంలేక, మురికిలోపడి, అన్నదమ్ముల పంచాయితిలో అమ్మను సరిగ్గా చూడక అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు. ఊర్లో ఎవరైన చనిపోతే "ఎవరితో చేపించుకోకుండా మంచి చావు వచ్చింది" అంటుంటారు. అందుకే "నాయినమ్మ అప్పుడు నువ్వు / నచ్చిపోయింది మంచిదైందే.." అనే ఎత్తుగడతో కవితను నడిపిన. నిజానికి చనిపోవాలని ఎవరూ కోరుకోరు. కాని ఎందుకట్లా అనుకుంటున్నానో తర్వాత పాదాల్లో చెప్పాను. చివర్లో మాత్రం నా సొంత అనుభవంతో

ముగించాను. నేను పదవ తరగతిలో ఉన్నపుడు మా నాయనమ్మ సోమమ్మ చనిపోయింది. నాగార్జునసాగర్‌లో ఉండడం వలన చివరిచూపు కూడా చూడలేకపోయిన. ఉద్యోగం వచ్చిన దాకా బతికుంటే బాగాచూసుకునేటోడిని కదా అని బాధపడుతుంట. మొదట్లో అందరు నాయనమ్మలు పడుతున్న బాధను గురించి చెప్పి చివరులో మాత్రం మా నాయనమ్మ జ్ఞాపకంతో ముగించిన. తర్వాత కేవలం మా నాయనమ్మ జ్ఞాపకంతో ముగించిన. తర్వాత కేవలం మా నాయనమ్మ జీవితం మీద 'సోమి' అనే కవిత కూడా రాసిన.

***13. చక్కని వినయం గల నీ కవిత్వ పాదాలు ఒకేసారి 'ఉగాది పిలుపు'గా ఎందుకు తిరగబడ్డాయి....***

జ. కవిత్వం మేడల్లో ఉండి కాదు పొలాలలో ఉండి రాస్తే వాళ్ళ బాధలు తెలుస్తాయి అన్న కోణంలోంచి 'ఉగాది పిలుపు' కవిత రాసిన. రైతుల పాదయాత్రలు, బిక్కిశ్రీను లాంటి సామాన్యుల మీద దాడులు, అసిఫా లాంటి బాలికల మీద దాడులు చూసి నాదైన కోణంలో రాసిన.

***14. 'కన్నీటి దారపుకండె' కవితా నేపథ్యం వినాలని ఉంది గోపాల్!***

జ. హైదరాబాద్‌లో టి.టి.సి.చదువుకునేటప్పుడు డబ్బులకు చాలా ఇబ్బంది అయ్యింది. ఒక కర్రీస్ పాయింట్‌లో మల్కాజ్‌గిరిలో ఐదారు నెలలు పనిచేసిన. అక్కడికి రకరకాల మనుషులు వచ్చేటోళ్ళు. కొంతమంది తొందరగా కూరలు కట్టమని తొందర పెట్టెవాళ్ళు. కొందరు బ్యాచిలర్ రూంలలో ఉండేవాళ్ళు, కొందరు కూలీలు కర్రీస్ పాయింట్‌లో పనిచేస్తున్నపుడు నా అనుభవాలను 'కన్నీటి దారపుకండె' కవితలో చెప్పుకున్నాను. నేను పేదరికం నుంచి వచ్చిన వాడిని కాబట్టి కూలితల్లులను చూస్తుంటే చాలా బాధనిపించేది. ఆ కవితలో ఈ వాక్యాలు చాలా ఇష్టం నాకు... "మేస్త్రి చేతికింద గంపమోసి / అప్పుడే మెడ మీద ఇన్ని నీళ్ళు సల్లుకొని / సక్కగా ఇక్కడికే వస్తున్న / ఆ చెమట పూలచెట్టును చూడగానే రెండు గంటలె పప్పుచారు / నాకు తెలియకుండానే ఎక్కువ పడేది..."

***15. మీ కవిత్వానికి ఇంతటి లాలిత్యపదభూషణమైన శిల్పాన్ని ఎలా అద్దగలిగావు?***

జ. నాలోని వ్యక్తిత్వమే నా కవితలకు శిల్పాన్నిచ్చిందేమో అనుకుంటా. ఇది ఇలాగే ఉండాలని ఎన్నడూ అనుకోని రాసుకోలేదు. ఒకానొక మానసిక స్థితిలో ఉన్నప్పుడు రాసుకున్నవే నా కవితలన్ని.

***16. మీ కవిత్వంలో భాష గురించి కొన్ని మాటలు***

జ. మొదట్లో రాసిన కవితల్లో పుస్తకభాషనే వాడిన. తర్వాత నేను ఎట్ల మాట్లాడుతనో అట్లనే రాయాలనుకున్న. ఆ క్రమంలోనే తెలంగాణ గ్రామీణ భాష నా కవిత్వంలోకి వచ్చింది. మా ఊళ్లో మాట్లాడుకునే మాటలు, సామెతలు నా కవిత్వంలోకి తీసుకు






రావాలనుకున్న. ఆరివారం, దగ అల్లుకొని, సపారం.... మొదలైన పదాలను పాలమూరులో ఎక్కువగా వాడుతరు. వాటిని వాడడం వలనె నా కవిత్వానికి ఒక సజీవత వచ్చిచేరింది.

**17. గోపాల్ యింకా పొల్యూట్ కాలేదు ఏ రకంగా జూసినా గొప్ప....... వుంది" అని కె.శివారెడ్డి మీ పుస్తక ముందుమాటలో రాసారు. దీనిని ముందు ముందు కూడా కొనసాగిస్తారా....?**

జ. నేను నాలాగే ఉంటా. ఈ అవార్డులన్ని నా కవిత్వం పది మందికి చేరడానికి ఒక గుర్తింపు అనుకుంట. చిన్నపుడు తిండి లేనప్పుడు అన్నం బెట్టిన చేతుల ముందు ఏ అవార్డు సాటిరాదు. సాహిత్య రాజకీయాలతో నన్ను ఇబ్బంది పెడితే నేను ఏమి చేయలేనుకాని నేను నా జీవితమంతా ఆశారాజు సార్ కవితలా బతుకుత. హెల్దెర్‌నాగ్‌లా బతుకాలని కోరుకుంట.

***18. సాహిత్యంలో ఏవాదం వైపు మీ అడుగులు బలంగా పడబోతున్నాయి.***

జ. ఫలానా వాదమని నేను ఏ కవిత రాయలేదు. నా జీవితాన్ని, నా అస్తిత్వాన్ని రాస్తున్న క్రమంలో అస్తిత్వం, ప్రాంతీయత అనేవి నా కవిత్వంలోకి ఎక్కువగా కనబడ్డాయి. బహుజన జీవితంలోంచి వచ్చిన వాడిని కాబట్టి ఆ జీవితానికి సంబంధించిన కవిత్వం ఎక్కువగా రాశాను.

పల్లెలోని గ్రామీణ జీవితం మీదే ఎక్కువ రాశాను. రాజకీయాల కారణంగా ఎట్లా చీలిపోతుందో తర్వాత కవితల్లో రాశాను. పల్లెను వివిధ కోణాల్లోంచి ఇంకా రాయవలసింది ఎంతో ఉంది. అని చాలా సార్లు అనుకున్న.

***19. "గోపాల్ కవిత్వంలోనూ చైతన్యంలోనూ అంతస్సూత్రంగా ఉన్నది సజీవ సబాల్టర్న్ అస్తిత్వాల చైతన్యమే..." అని రాసిన నారాయణ యోగి వెంకటస్వామి గారి మాటలను మీరు ఎంతవరకు అంగీకరిస్తారు...***

జ. యాదవ జీవితంనుంచి, గ్రామీణ జీవితంనుంచి వచ్చిన

నేను ఆ జీతితాన్ని ప్రతిబింబించే కవిత్వం రాశాను. మొదట నేను రాసినపుడు 'సజీవ సబాల్టర్న్ అస్తిత్వాల' గురించి రాస్తున్నానన్న ఎరుకలేదు. రాసుకుంటూ పోయాను. నా కవిత్వాన్ని లోతుగా చదివిన నారాయణ స్వామి అన్న ఒక విమర్శకుడిగా నా కవిత్వంలోని అంతసూత్రాన్ని గొప్పగా ముందుమాటలో రాశాడు. తరువాత ఇదే విషయాన్ని సమర్ధిస్తూ సంగిశెట్టి శ్రీనివాస్ సార్ కూడా ఒక మంచి వ్యాసం రాసింద్రు.

***20. చివరగా మీ కుటుంబ నేపథ్యం గురించి కొన్ని మాటలు...***

జ. నాయిన జీవితమంతా గొర్లను కాసి, జీతాలుండి, కట్టెలు కొడుతూ బతికిండు. అమ్మ కూలితల్లి.

**20. ఇంతకు పూర్వము మీరు అందుకున్న అవార్డులు**

జ. పాలమూరు సాహితీ అవార్డు, కొత్తపల్లి నరేంద్రబాబు పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్తు అవార్డు, రొట్టమాకురేవు పురస్కారం, రంగినేని ఎల్లమ్మ పురస్కారం.

**21. మా మూసీ పత్రికతో మీకున్న అనుబంధం....**

జ. చాలా గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. నా 'నానీలు' మొదట మూసీలోనే అచ్చైనాయి. 2014లో అనుకుంటా మూసీ పత్రిక కోసం వానలో తడుస్తు నా స్టూడెంట్ రవితో కలిసి నా నానీలు అచ్చైన సంచికలను కమలాకరశర్మ సార్‌ని అడిగి తీసుకున్నాను. అలాగే దంకడియంలోని గల్లగురిగి కవిత, తర్వాత రాసిన అన్నలాంటి చెల్లెలు కవిత, బ్యాచిలర్ రూం వంటి కవితలు మూసీలో రావడం చాలా సంతోషం.

# బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారోత్సవ విశేషాలు

ప్రఖ్యాత చరిత్రకారుడు, శాసన పరిశోధకుడు, పత్రికా నిర్వాహకుడు, సాహిత్యకారుడైన స్వర్గీయ శ్రీ బి.ఎన్.శాస్త్రి గారి ఎనబై తొమ్మిదవ జయంతిని పురస్కరించుకొని 'మూసీ సాహిత్య ధార' (నిరంతర పరిశోధనా స్రవంతి) ఆధ్వర్యంలో ఆయన జయంత్యుత్స వాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రతీ ఏడాది లాగానే ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని అందజేసే "శ్రీ బి.ఎన్.శాస్త్రి విశిష్ట పురస్కారం" ను ఈ సంవత్సరం డా.కూరెళ్ళ విఠలాచార్య గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి డా. శ్రీ రంగాచార్య గారు (పూర్వ ప్రాచార్యులు) అధ్యక్షత వహించగా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ.టి.కిషన్‌రావు గారు ముఖ్య అతిథిగా, డా.ఎం.ఎ శ్రీనివాసన్ (చరిత్ర అధ్యాపకులు), డా.పి.భాస్కర యోగి (తెలుగు అధ్యాపకులు) ప్రత్యేక ప్రసంగకర్తలుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాహితీ విమర్శకులు, రచయిత ఆచార్య ఎస్.వి రామారావు, విఖ్యాత శాసన పరిశోధకులు శ్రీ కందకుర్తి యాదవరావు గార్లు ఆత్మీయ సత్కారాన్ని అందుకున్నారు.

ఈకార్యక్రమంలో ముందుగా అతిథులందరూ శాస్త్రి గారికి ఘనంగా అంజలి సమర్పించినారు. సభాధ్యక్షత వహించిన శ్రీరంగాచార్యగారు మాట్లాడుతూ శాస్త్రిగారి నిలువెత్తు వ్యక్తిత్వాన్ని స్మరించుకున్నారు. మూసీ ప్రారంభదశనుండి నేటివరకు తనకు పత్రికతోను, శాస్త్రిగారితోను ఉన్న పరిచయాన్ని పేర్కొంటూ ఈ సంవత్సరం 25 సంవత్సరాల మూసీని ఇంకా ముందుకు తీసుకువెళ్ళాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఈ సంవత్సరకాలంలో మూసీ పత్రికద్వారా సెమినార్లు, విశేష కార్యశాలలు, పుస్తకప్రచురణలు జరుగుతున్న నేపథ్యంలో అందరూ సహకరించాలని సభాముఖంగా కోరడం జరిగింది.

25 సంవత్సరాల మూసీపత్రిక ప్రస్థానాన్ని, పత్రిక ఎదుర్కొన్న కష్టనష్టాలు, సాధించిన విజయాలు, చేయవలసిన ప్రణాళికలను గూర్చి పత్రిక సంపాదకులు శ్రీ సాగి కమలాకరశర్మగారు సవివరంగా తెలియజేశారు. పత్రిక నిర్వహణలో అందరి ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలను ఆకాంక్షించి 25 సంవత్సరంలోకి అడుగుపెట్టిన మూసీ ఇంకా అనేక ఉత్తమ గ్రంథాలు, కార్యక్రమాలు నిర్వహిస్తుందని హామీ ఇచ్చారు.

శ్రీరంగాచార్యగారి ఆధ్వర్యంలో డా. కూరెళ్ల విఠలాచార్య గారిని సత్కరించి ఆయనకు శ్రీ బి.ఎన్. శాస్త్రి విశిష్ట పురస్కారాన్ని అందజేశారు. అనంతరం శ్రీ విఠలాచార్యగారు మాట్లాడుతూ బి.ఎన్. శాస్త్రి గారితో తనకున్న ఆత్మీయానుబంధాన్ని స్మరించుకున్నారు. అసాధారణ కృషి, పట్టుదలతో, నిరంతర శోధనా పటిమతో తెలంగాణ చరిత్రను లోకానికి పరిచయం చేసి ఎన్నో శాసనాలను శాస్త్రిగారు వెలికితీసి మనముందుంచారన్నారు. విష్ణుకుండిన సామ్రాజ్య ఉనికికి శాస్త్రిగారు అందించిన శాసనాంశాలు మరింత బలాన్ని అందించాయని కొనియాడారు. అంత విశిష్టమైన చరిత్రకారుని యాదిలో ఈ అవార్డు అందుకోవడం అంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యఅతిథి ప్రొ. టి. కిషన్ రావు గారు మాట్లాడుతూ బి.ఎన్.శాస్త్రి గారు చేసిన శాసన పరిశోధన, సాహితీసేవ అమూల్యమైనదని, ఎనలేని పరిశ్రమ చేసిన ఆయన కృషి నేటి పరిశోధకులకు మార్గదర్శనమని, ఆయన వలే పరిశోధకులు శోధనా మార్గంలో పయనించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శాస్త్రిగారి అనంతరం మూసీ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాసపత్రికను

నిర్వహిస్తూ ఆయన వారసత్వాన్ని ముందుకు కొనసాగిస్తూ, ఈనాటి పరిశోధకులకు మార్గదర్శనం చేస్తున్న డా. సాగి కమలాకర శర్మ గారిని మనసారా అభినందించారు.

ప్రత్యేక ప్రసంగాలను అందించిన వారిలో డా.ఎం.ఎ. శ్రీనివాసన్ ప్రసంగిస్తూ చరిత్ర మూలలను ఎలా కనుగొనాలో, ఎటువంటి పద్ధతులను పాటించాలో, అలనాటి భాషను ఏ విధంగా అర్థం చేసుకోవాలో సవివరంగా తెలియజేశారు. చరిత్ర రచన ద్వారా, శాసన శోధన ద్వారా శాస్త్రిగారు సరికొత్త విషయాలు లోకానికి అందించారన్నారు.

డా. భాస్కరయోగి గారు మాట్లాడుతూ నేటి తెలంగాణ చరిత్రకు మూలాధారమైన చారిత్రక అంశాలు,శాసనాలు వెలుగులోకి తెచ్చి శాస్త్రిగారు తెలంగాణ సమాజానికి మహోపకారం చేశారన్నారు. తుమ్మలగూడెం నాటి విష్ణుకుండిన రాజధాని అని నేడు మనం చెప్పుకుంటున్నామంటే అది ఆయన కృషేనని అన్నారు. అలుపెరుగని దీక్షతో ఎంతో శ్రమకోర్చి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ వంటి జిల్లాల సర్వస్వాలను వెలువరించడం అంటే మాటలు కాదన్నారు. నేడు ఆ సర్వస్వాలు జిల్లాల చరిత్ర తెలుసుకోవడానికి రాష్ట్ర చరిత్రను లిఖితబద్ధం చేయడానికి ఆధారాలుగా ఉన్నాయని తెలిపారు. వారు కొనసాగించిన కృషిని డా. సాగి కమలాకర శర్మగారు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. యయాతి చరిత్రలో దేవయానికి తన ఇంటివారు అందించిన కట్నకానుకలను తెలిపే పద్యాన్ని చదివి శాస్త్రిగారు మాత్రం కమలాకర శర్మగారికి పుత్రికతో ఒక పత్రికను అందించారని చెప్పి శర్మగారు నిర్వహిస్తున్న కృషిని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆత్మీయ సత్కారం అందుకున్న ఆచార్య ఎస్.వి. రామారావు గారు తాను శ్రీ శాస్త్రిగారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విరామం లేని వారి పరిశోధన దృక్పథం నేటి విశ్వవిద్యాలయ శోధకులకు అవసరమన్నారు. శ్రీ కందకుర్తి యాదగిరిరావు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో తాను శాసన శోధకుడిగా నిలబడగలిగినానంటే శాస్త్రిగారు ఇచ్చిన ప్రోత్సాహమే కారణమని చెప్పారు. కందకుర్తిలో ఉంటూ తాను ఇందూరు చరిత్రకు శాసనాధారాలను, చారిత్రక సత్యాలను అందించగలగడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇందుకు స్ఫూర్తి కలిగించిన శాస్త్రిగారిని ఆత్మీయంగా స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమానికి వద్దాపురం క్రిష్ణ స్వాగతం చెప్పగా, డా. అట్టెం దత్తయ్య సత్కార వాక్కులు పలికారు. డా. మంత్రి శ్రీనివాస్ ముగింపు వాక్కులతో సభ విజయవంతంగా సంపూర్ణమైంది. ఇందులో ఎందరో సాహితీ ప్రముఖులు, పరిశోధక విద్యార్థులు, చరిత్రకారులు, శాస్త్రిగారి అభిమానులు, కుటుంబసభ్యులు, మూసీ పత్రిక పరివారం మొదలైన వారందరు పాల్గొన్నారు.



డా. కూరెళ్ళవారికి బి.ఎన్‌శాస్త్రి విశిష్ట పురస్కార ప్రదానం



పురస్కారాన్ని అందిస్తున్న శ్రీరంగాచార్య, ఆచార్య కిషన్‌రావు, డా. కమలాకరశర్మగార్లు



డా. శ్రీరంగాచార్యగారికి సన్మానం



శ్రీ బి.ఎన్.శాస్త్రి జయంతి సందర్భంగా డా. కూరెళ్ళ విఠలాచారిగారికి "బి.ఎన్.శాస్త్రి విశిష్ట పురస్కారం" 10.12.2021నాడు సురభారతి హాల్‌లో జరిగిన కార్యక్రమానికి సంబంధించిన కొన్ని ఛాయాచిత్రములు.






# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/– (అసలు 500/–) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**


**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/–**

# రమణమహర్షి ప్రబోధసాహిత్యం – శాస్త్రీయ దృక్పథం

**పి. రామకృష్ణ,** పరిశోధక విద్యార్థి, ఉ.వి. ఫోన్ : 9290644775



**శాస్త్రీయ దృక్పథం -పరిచయం**

'విద్యార్థులు శాస్త్ర చర్చలలో పాల్గొనాలి'. 'యువత శాస్త్రీయ కోణంలో ఆలోచించాలి'. 'సంప్రదాయాలలో శాస్త్రీయత అవసరం'. 'వ్యవసాయానికి శాస్త్రీయత జోడించాలి'. 'ఏ విషయాన్నైనా శాస్త్ర ప్రమాణాలతో అధ్యయనం చేయాలి'. 'శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి సాధ్యం' – ఇలాంటి పదాలను మనం నిత్య జీవితంలో ఉపయోగిస్తుంటాం. ఇవే కాకుండా భూగోళశాస్త్రం, ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, వైద్యశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం, జీవశాస్త్రం ఇలా ప్రతి విషయాంశాన్ని నేడు శాస్త్రపరంగా అధ్యయనం చేస్తున్నాం. మరి శాస్త్రమంటే ఏమిటి? శాస్త్రానికుండే లక్షణాలేమిటి?

'శాస్త్రం' అనేది సంస్కృత పదం. సూత్రం, నియమాలు, నిబంధనల పత్రం, ప్రామాణిక గ్రంథం అని శాస్త్రానికి అర్థాలు చెప్పబడ్డాయి. దృక్పథం అంటే లోచూపు, ఆలోచనా విధానం.

'బోధించటానికి క్రమబద్ధీకరించిన విజ్ఞానమే శాస్త్రము'.

'ఒక సిద్ధాంతాన్ని వివరించే గ్రంథమే శాస్త్రము'.

అని శాస్త్రానికి నిర్వచనాలు. ప్రస్తుత కాలంలో ప్రతి అంశము ఒక విభాగమై ప్రత్యేక శాస్త్రంగా చెప్పబడుతుంది. కాని ప్రాచీన కాలంలో శాస్త్రమంటే వేద పరమైనదే. కాబట్టే 'శాసించేది శాస్త్రం' అని వేదపరంగా అర్థం చెప్పబడింది. వేదాలు ప్రభుసమ్మితాలని చెప్పబడ్డాయి. అంటే రాజు శాసించినట్లుగా వేదాలు కూడా మానవుల యొక్క కర్తవ్య నిర్దేశంలో శాసిస్తాయని చెప్పబడింది.

**"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ"** (17–28) అంటుంది భగవద్గీత. అంటే కర్తవ్య – అకర్తవ్య విషయ నిర్ధారణం చేయడానికి నీకు శాస్త్రం ఒక్కటే ప్రమాణం కాని స్వకల్పనలు (నీ యొక్క ఊహలు) కావు అని భావము. గీత చెప్పిన శాస్త్రము కూడా వేదోపనిషత్తులే తప్ప నేడు మనం రూపొందించుకున్న శాస్త్రాలు కావు.

'ప్రమాణము' అంటే కచ్చితమైనది. వాస్తవమైనది, చట్టబద్ధమైనది అన్న అర్థాలు చెప్పబడుతున్నాయి. ఏదైనా ఒక విషయంలో నిజ నిర్ధారణ చేయుటకు, సత్యాన్ని గ్రహించుటకు ఉపయోగకారి ఏదో అదే ప్రమాణము. దీనికే ప్రామాణికము అన్న పర్యాయపదము వాడుతారు. బంగారము సరియైనదా, నకిలీదా అని తెలుసుకోవడానికి గీటురాయిని ఉపయోగిస్తారు. ఇక్కడ బంగారం నిజ నిర్ధారణకు గీటురాయే ప్రమాణం. అట్లే ఏదైనా ఒక విషయం నిర్ధారించేటప్పుడు శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని అందులో చెప్పిన అంశాలతో సరిపోల్చి నిర్ధారించటం జరుగుతుంది.

పై నిర్వచనాలన్నీ పరిశీలించిన మీదట 'ఏదైనా ఒక విషయాన్ని తార్కిక దృష్టి (కార్యకారణ సంబంధం)తో విశ్లేషించి సహేతుకంగా నిరూపించబడిన సిద్ధాంతాన్ని శాస్త్రం అని చెప్పవచ్చు.

ఉదాహరణకు భూమికి గురుత్వాకర్షణ ఉన్నదని చెప్పినప్పుడు అది ఈ భూగోళం అంతటా నిరూపించబడినప్పుడు అది ఒక విశ్వసనీయమైన సిద్ధాంతమై శాస్త్రంగా చెప్పబడుతుంది.

పైన సూచించిన శాస్త్రాలే కాకుండా అణువు మొదలు బ్రహ్మాండం వరకు ఉన్న సమస్త వస్తు విషయాలన్నింటికి ప్రత్యేక విభాగాలుగా శాస్త్రాలు రూపొందించబడ్డాయి. విజ్ఞానవేత్తలు సృష్టిలో కనిపించే భౌతిక పరమైన విషయాలను నిత్యం శోధిస్తూ, నూతన సిద్ధాంతాలకు పురుడు పోస్తూనే ఉన్నారు. అయినప్పటికి ఈ అనంత విశ్వం మానవ మేధస్సుకు చిక్కకుండా ఒక చిక్కు ప్రశ్నగానే ఉంటుంది. దీన్ని ఛేదించే ప్రయత్నంలో మనిషి గ్రహాంతర యానం చేస్తున్నాడు కాని తన లోపలికి తాను ప్రయాణించలేక పోతున్నాడు. బాహ్యంగా ఎంత వెతికినా నీకు సృష్టితత్త్వం బోధపడదు. వెతకాల్సింది నీ అంతరంగం లోనే అంటున్నాయి వేదాంత శాస్త్రాలు. సృష్టికి నీవు భిన్నము కాదు.

**అందరికి అనుసరణీయము మహర్షి బోధ**

భారతీయ సనాతన ధర్మాన్ని విశదపరిచే హిందూమతము మొదలు ప్రతి మతానికి రెండు ప్రధానాంశములుంటాయి. మొదటిది మతంలో నిర్దేశించబడిన పూజా విధానం, ఆచారాలు, వ్యక్తి జీవన

విధానానికి సంబంధించిన నైతిక సూత్రాలు. ఇక రెండవది జ్ఞానోదయ మార్గాలు. కాని మతాన్ని పట్టించుకోకుండా, లౌకిక ధోరణి విపరీతంగా పెరిగిపోతున్న ఈ ఆధునిక ప్రపంచంలో మతానికి అతీతమైన ఆధ్యాత్మిక ఉపదేశాల అవసరం ఎంతైనా ఉంది. విజ్ఞాన శాస్త్రం యొక్క ప్రభావం అధికంగా ఉన్న ఈ రోజుల్లో మతం సాధారణంగా విధించే ఒక 'నమ్మక వ్యవస్థ'ను అంగీకరించటం నేడు జరగదు. ప్రజలు ప్రతి విషయంలో తర్క యుక్తము, హేతుబద్ధము అయిన సమాధానాలను ఆశిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రమణమహర్షి బోధనలు మతాల పరిధిని దాటి ఉంటాయి. అలాగని వారు మత సంబంధ ఆచారాలను, నమ్మకాలను జవదాటి నడుచుకోమని ఎప్పుడు చెప్పలేదు. కాని ఆధ్యాత్మిక సాధనకై నిజాయితీగా, తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పుడు ఆచారాలను పాటించక పోయినప్పటికి అది ఒక అడ్డంకి కాదని చెప్పేవారు.

ప్రతి మతంలోను దేవుడున్నాడన్న ఎరుక మొట్టమొదటి మెట్టు అయితే, శాస్త్రవేత్త మాత్రం గమ్యాన్ని చేరడానికి ప్రపంచాన్ని విశ్లేషించడంతో మొదలు పెడతాడు. కాని రమణులు మాత్రం ఈ అన్వేషణను వ్యక్తితో లేదా ''నీతో'' మొదలుపెట్టడం ఉత్తమ మార్గమంటారు. ప్రతి ఒక్కరికి 'నేను ఉన్నాను' అన్నది అనుభవ పూర్వక విషయమే. ఈ జ్ఞానం మౌలికమైనది. ఎందుకంటే "నీవు ఉన్నావు" అని తెలుసుకునేందుకు ఎవరి ధ్రువీకరణ అవసరం లేదు. కాని ప్రపంచం, దేవుని విషయంలో అలా కాదు. వాటి అనుభూతికి అసలు 'నీవు' అన్నది ప్రథమ నిబంధన అంటే మిగతా రెండు ఒక విధంగా చెప్పాలంటే పరాధీనమైన అనుభూతులు. అందుకే "వ్యక్తి యొక్క నిజమైన స్వభావం గ్రహించడం ద్వారా అన్నిటికీ మూలమైన యదార్థాన్ని తెలుసుకునే మార్గం ఏర్పడుతుంది అని రమణులు అంటారు.

వివిధ మతాలలో దేవున్ని గురించిన అంతులేని చర్చలు, వాదనలు, అలాగే సామూహిక ఆచారాలు, ప్రపంచంలో అగుపడే అసంపూర్ణతలకు సంబంధించిన విషయాలను మహర్షి చతురతతో దాటవేస్తారు.

"దేవుడి సంగతి అలా ఉంచి నీ గురించి మాట్లాడు"

"నీ గురించే నీకు తెలియనప్పుడు బ్రహ్మము గురించి ఎందుకు చింతిస్తావు" అంటారు.

మహర్షి బోధనలు నామ, రూపాలకు అతీతం. "నేనెవరు?" అని నీవు ప్రశ్నించుకో, నీ అసలైన చైతన్యాన్ని అన్వేషించు. శాశ్వతంగా ఎప్పుడూ నీవే అయిన ఆత్మగా స్థిరంగా ఉండు. ఏదో కావడం అని కాదు, స్థిరంగా ఉండడమే! అలాగే ఉండు" అని అంటారు. అతి సరళంగాను, సూటిగాను ఉన్న కారణంగా సాంకేతిక పరమైన సూక్ష్మ సూత్రాలేవి లేనందువల్ల ఏ మతపరమైన నమ్మకాలకూ వారి బోధనలు విరుద్ధం కావు. అలా నిష్కపటంగా నడుచుకొన్నవారికి తమ మతాన్ని మరింత బాగా అవగాహన చేసుకొన్న భావనా కలుగుతుంది.

ఆర్థర్ ఆస్బర్న్ 'శ్రీ రమణ మహర్షి అండ్ ద పాత్ ఆఫ్ సెల్ఫ్ నాలెడ్జ్'లో అన్నట్లు "ఏదో ఒక మతాన్ని స్థాపించడానికి గాని, అప్పటికే నెలకొన్న ఏదో మత విషయంలో మార్గదర్శకం చేయడానికి గాని రమణులు అవతరించలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని మతస్థులలో క్రొత్త మార్గాన్ని కోరిన వారికి దాన్ని నిర్దేశించడం కోసం వచ్చారు. ఈ మార్గంలో ఆచార విధులు, పూజా విధానాలు, మత పరమైన సభలు లాంటి బాహ్యంగా కనిపించే ఆర్భాటాలు ఏవి ఉండవు. వంటశాలలో, కార్యాలయాలలో, బయట పనిచేసే చోట, ఆశ్రమంలో ఎక్కడైనా అభ్యసించవచ్చు.

సృష్టిలో మానవుని ఉత్పత్తి జరిగిన నాటినుండే తన ఉనికిని గురించి, కనిపించే ఈ భౌతిక ప్రకృతిని గురించి అన్వేషణ చేస్తూనే ఉన్నాడు. కాని ఇప్పటి వరకు ఈ సృష్టి రహస్యం శాస్త్రవేత్తల మేధస్సుకు ఒక చేధించలేని పద్మవ్యూహంగానే ఉంది. అందుకు గల కారణం వారు యదార్థమైన తనను వదలి నశించే పదార్థాన్ని అన్వేషించడమే అంటున్నాయి ఆధ్యాత్మిక శాస్త్రాలు.

సరే ఇప్పటివరకు శాస్త్రవేత్తల ద్వారా జరిగిన పరిశోధనల ఫలితాలను గమనించినా పదార్థమనేది అణువుల సమ్మేళనం, ఆ అణువులను కూడా సూక్ష్మదర్శిని సహాయంతో విడదీస్తూ పోగా విభజించడానికి వీలులేని సూక్ష్మాతిసూక్ష్మమైన దాన్ని పరమాణువని నిర్ణయించారు. ఈ అణువనేది ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే వాటితో కూడి అత్యంత శక్తివంతంగా ఉంటుందని చెప్తూ, సృష్టిలోని అన్ని పదార్థాలకి, స్థావర జంగమాలైన వృక్షాలు మరియు ప్రాణులకు ఈ శక్తే మూలమంటున్నారు. కాని ఈ శక్తికి మూలమేదో చెప్పలేక పోతున్నారు. ఎందుకంటే ఆ శక్తి యొక్క మూలాన్ని భౌతిక ప్రపంచంలో కనుగొనలేము. దాని అన్వేషణ అంతరంగంలో జరగ వలసింది. ఆ అంతరంగానికి ఆధారం 'నువ్వే' అంటున్నారు మహర్షి.

'నువ్వు' ఈ సృష్టిలోని పదార్థాల గురించి తెలుసుకోవాలన్నా, 'నువ్వు' భగవంతుని గురించి తెలుసుకోవాలన్నా, 'నువ్వు ' నీ గురించే తెలుసుకోవాలన్నా లేదా మరొక విషయం కావొచ్చు, ఏ విషయాన్ని గురించి తెలుసుకోవాలన్నా 'నువ్వు' ఉన్నప్పుడే అది జరుగుతుంది. 'నేను' అనే వాడు లేకుండా ఏ పని కూడా జరగదు. మనం చేస్తున్న సమస్త క్రియలకు 'నేను' అన్న అహంకారమే మూలం. అందుకే మనం చేసే ప్రతి పనికి 'నేను' ను జోడిస్తూ ఉచ్చరిస్తాము. 'నేను' కనుగొన్నాను. 'నేను' తెలుసుకొన్నాను. 'నేను' చదివాను. 'నేను' చేశాను. 'నేను' చూశాను. అంటూ 'నేను' యొక్క ప్రాధాన్యతను చెప్పకనే చెప్తున్నాం. కనుక అన్నింటిని తెలుసుకునే మూలమైన 'నేను'

ను వదలి పెట్టడంవల్లనే ఈ గందరగోళమంతా. దాన్ని తెలుసుకున్నప్పుడే ఆ పద్మవ్యూహం అనేది ఛేధించబడుతుంది.

ఈ విషయం ఇంకొంచెం సులభంగా అర్థమయ్యేందుకు మహర్షి మనకు సుపరిచితమైన పరమానందయ్య శిష్యుల కథను ఉపమానంగా చెబుతున్నారు. పరమానందయ్య శిష్యులు పదిమంది కలిసి ఒక చోటుకు వెళ్తూ మార్గమధ్యలో ఒక నదిని దాటుతారు. అనంతరం నది దాటుతుండగా వారిలో ఎవరైనా నదిలో పడిపోయారో ఏమో అని లెక్కిస్తారు. లెక్కించిన ప్రతివాడు తనను విడిచి మిగిలిన తొమ్మిది మందిని లెక్కిస్తూ నదిలో ఒకడు కొట్టుకుపోయాడని దు:ఖిస్తూంటాడు. చివరికి వాళ్ల అజ్ఞానాన్ని గ్రహించిన బాటసారొకరు వాళ్ల దగ్గరికి వెళ్లి లెక్కించే వానితో నిన్ను నీవు లెక్కించుకోకపోవడం వల్లనే పొరపాటు జరుగుతుందని వారితో సరిగ్గా గణింపజేస్తాడు. మనం కూడా పై శిష్యుల మాదిరిగానే లెక్కించే తనను విడిచి మిగిలిన వారిని లెక్కించినట్లుగా అన్నింటిని గ్రహించే 'నేను'ను విడిచి సత్యానికై అంతటా అన్వేషిస్తున్నాము. బాటసారి ఏ విధంగా తప్పిపోయాడని అనుకుంటున్న వానివి "నీవే" అని తనను తనకు పరిచయం చేశాడో గురువు కూడా సత్యము 'నువ్వే'. అది నీలోనే ఉందని తెలియజేస్తాడు. బాటసారి చెప్పక ముందు కూడా వాడు పదవవాడే. కాకపోతే వాడు వాణ్ణి గుర్తించలేదు. అదేవిధంగా గురువు చెప్పకపోయినా సత్యమెప్పుడూ నీవే. అది నీవు గుర్తించపోవడం వల్లనే సత్యానికై అన్వేషిస్తున్నావు.

అందుకే మహర్షి "ఎఱిగెడు తనను ఎఱుగక యితరము నెఱుగుట యజ్ఞానమే గాని జ్ఞానమగునా? జ్ఞానమునకు ఇతరములకు ఆధారమైన తనను ఎఱిగినచో జ్ఞానాజ్ఞానములు నశించును" అని అంటారు. (ఉన్నది నలుబది-11).

నిన్ను నీవు తెలుసుకున్న స్థితిలో ఇక తెలుసుకోవటం, మరొక దానికై ప్రయత్నించడం ఉండదు. ఆ స్థితిలో ఏ సందేహాలకు తావు లేదు. కాబట్టే మహర్షి అది జ్ఞానాజ్ఞానములు నశించిన స్థితి అంటున్నారు. సృష్టికి, ఈశ్వరునికి, జీవునికి మూలమైనది ఒకే ఒక్క ఆత్మ. అంటే అన్నింటికి కారణమైన ఆత్మే నీలోను ఉంది. కాబట్టే ఉపనిషత్తులన్నీ 'తత్త్వమసి' అంటే 'అది నీవు' అంటున్నాయి. అది అంటే ఇక్కడ ఆత్మ అనే గ్రహించాలి.

భగవద్గీతలో కూడా "నేను" ఆబ్రహ్మస్తంబ పర్యంతం గల ప్రాణుల హృదయాలలో ప్రకాశిస్తున్నాను. నా నుండే స్మృతి, జ్ఞానం, వీటి విస్మృతి కూడా కలుగుతున్నాయి. వేద చతుష్టయం చేత తెలియబడేది నేనే. వేదాంత సంప్రదాయ ప్రవర్తకుడినైన జ్ఞానగురువును వేదాంత వేత్తను కూడా నేనే అని గ్రహించు. (15-15) అని చెప్పబడింది.

బ్రహ్మ మొదలు సమస్త ప్రాణులలో ఉన్నది ఒక్కటే ఆత్మ అని చెప్పబడుతుంది. కాబట్టి నిన్ను నీవు తెలుసుకుంటే సమస్తాన్ని తెలుసుకున్నట్టే. అంతేకాకుండా వేద, వేదాంతాల అధ్యయనం ద్వారా గ్రహించేది కూడా ఇట్టి విషయాన్నే అని పై శ్లోక భావం.

కఠోపనిషత్తులో కూడా సర్వప్రాణులలో దాగి ఉన్న యీ ఆత్మ తన్ను తాను ఎరుకపరచుకోలేదు. కేవలం బుద్ధి సూక్ష్మత గల సూక్ష్మ ద్రష్టులకు మాత్రమే వ్యక్తమౌతుంది. (1-3-12) అని చెప్పబడింది.

పాలలో వెన్న దాగి ఉన్నట్లుగా ప్రతి జీవిలో ఆత్మ దాగి ఉంది. వెన్నను తీయడానికి పాలను కాచి, తోడు పెట్టి, పెరుగుగా మార్చి, ఆ పెరుగును మధించి వెన్నను సేకరిస్తాం. అదేవిధంగా బుద్ధిని కవ్వంగా మార్చి విచారణ అనే మధింపుతో మనస్సును చిలకగా ఆత్మ అనే వెన్న బయటకు వస్తుంది. అయితే పాలు, పెరుగు అనేవి భౌతిక పదార్థాలు మనకు కనిపిస్తాయి కాబట్టి అందులో నుంచి వెన్నను తీయడం సులభమే. కాని ఇక్కడ మనం చెప్పుకునే బుద్ధి కాని, మనస్సు కాని, ఆత్మ కాని కంటికి కనిపించేవి కావు. కాబట్టే బుద్ధి సూక్ష్మత గల వారికి సూక్ష్మమును సైతం చూడగలిగిన వారికి మాత్రమే ఇది సాధ్యమని చెప్పబడుతుంది. సూక్ష్మమును చూడటమంటే క్షుణ్ణంగా విచారించడమే.

విచారణ ప్రక్రియను గురించి వివరిస్తూ మహర్షి **"వేటిని నేనని భ్రమిస్తున్నానో ఈ దేహము, ప్రాణము, ఇంద్రియాలు, బుద్ధి, తమస్సు నేను గాను. అవి అన్నీ జడములే. ఏక సద్రూపమే నేను"** అని అంటారు. (ఉపదేశసారము -22)

"రసము, రక్తము, మాంసము, మజ్జ, మేధ, అస్థి, శుక్రము అనే సప్త ధాతువులచే ఏర్పడిన ఈ స్థూల దేహము 'నేను' కాదు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను పంచ విషయములను గుర్తించగలిగే జ్ఞానేంద్రియాలు 'నేను' కాదు. వచన, గమన, దాన, మల విసర్జన, మూత్ర విసర్జన అనే ఐదు కార్యాలు చేసే కర్మేంద్రియాలు 'నేను' కాదు. ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యాన అనే వాయు పంచకాలు 'నేను' కాదు. జ్ఞానాజ్ఞానముల విచక్షణ చేయు బుద్ధిని 'నేను' కాను. సర్వ వ్యాపారములకు కారణమగుచున్న మనస్సు 'నేను' కాను. సర్వ వృత్తులను వదలి విషయ వాసనలతో మాత్రము కూడి ఉండే అజ్ఞానము నేను కాను. అంటూ చైతన్యరహితమైన వన్నింటినీ తీసి వేయగా ప్రత్యేకంగా నిలుచు ఎఱుకయే 'నేను' అంటారు మహర్షి. (నేనెవడను - పుట - 1)

ఈ విచారణ ప్రక్రియకే నేతి - నేతి విచారణ అన్న పేరు ఉంది. ఇది ఉపనిషత్తులు సూచించిన సత్యాన్ని తెలుసుకొనే విచారణ పద్ధతే ఈ నేతి - నేతి. 'నేతి' అనేది సంస్కృత పదం నా అంటే కాదు అని, ఇతి అంటే ఇది అని సంస్కృత అర్థం. న + ఇతి = నేతి 'ఇది కాదు' అన్న అర్థంలో. 'ఇది కాదు', 'ఇది కాదు' అంటూ అసత్యమైన వాటన్నింటిని తొలగించగా మిగిలింది ఏదో అదే సత్యమని చెప్పబడుతుంది.

దీన్ని గురించి సులభంగా అర్థమగుటకు మహర్షి రామాయణం నుంచి ఒక ఉపమానాన్ని చెప్పారు. అరణ్యవాస కాలంలో రాముడు జటాధారియై, నార వస్త్రములు ధరించి ఋషులతో కూడి ఉన్నప్పుడు అక్కడి ఋషి పత్నులు సీతను చేరి "నీ భర్త ఎవరు?" వీరా ! వీరా ! అని వారు ప్రశ్నించినప్పుడల్లా సీతాదేవి కాదు అని తలను అడ్డంగా ఊపుతుంది. అలా అందరిని కాదన్న తర్వాత చివరగా ఉన్నవాణ్ణి ఇతడేనా రాముడు అని ప్రశ్నించకుండానే వారు గ్రహిస్తారు.

అదేవిధంగా మనం కూడా నా దేహము, నా ప్రాణము, నా బుద్ధి, నా మనస్సు అంటూ చెప్పబడుతున్నవన్నీ నీవు కాదు అని గ్రహించాలి. ఇది నా పుస్తకం, ఇది నా వాహనం, ఇది నా ఇల్లు అని అన్నప్పుడు అవి మనకు చెందినవన్న భావనే కాని మనమే పుస్తకం, మనమే వాహనం, మనమే ఇల్లు అని కాదు కదా! అట్లే ఇది నా దేహం, ఇది నా ప్రాణం, ఇది నా బుద్ధి, ఇది నా మనస్సు అన్నప్పుడు కూడా ఇవన్నీ మనకు చెందినవనే గాని ఇవేవీ మనం కాదు. ఈ "నాది" అన్న భావన లేకుండా 'నేను' అన్న భావన కలిగి ఉన్నదేదో అదే సత్యము. ఆ సత్యాన్ని ఎరుగటే 'నిన్ను నీవు ఎరుగుట'.

ఈ 'నేను' ను తెలుసుకొనుటకు మనందరికి బాగా పరిచయమున్న నిద్రాస్థితిని గురించి తెలుపుతూ 'నేను' అనునట్టిది లేని నిద్రయందు గూడ నీ పరమ పూర్ణ సద్రూపాత్మ యుండుటచే, అదియే 'నే' నను పదమునకు సరియైన లక్ష్యార్థము" అంటారు మహర్షి (ఉపదేశసారము – 21).

గాఢ నిద్ర (సుషుప్తి) అనేది మనందరం రోజు అనుభవించే స్థితే. ఆ స్థితిలో కలలు గాని, దేహస్ఫురణగాని, నాది అన్న భావన గాని ఉండదు. భావనలన్నీ శూన్యమైన స్థితి అది. అలాంటి ప్రశాంత, నిశ్చల స్థితిలో కూడా ఆ నిశ్చలస్థితిని అనుభవించేవాడు ఒకడుండనే ఉన్నాడు. లేకున్న మనం నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు చాలా బాగా నిద్రించాను. ఎంతో ప్రశాంతంగా ఉంది అని ఎలా చెప్పగలుగుతున్నాము. దేహము, ఇంద్రియ వ్యాపారాలు పూర్తిగా అణిగిన స్థితిలో కూడా ఆనందాన్ని అనుభవించేవాడు ఎవడైతే ఉన్నాడో వాడే 'నేను' అని మనం గ్రహించాలి.

సత్యాన్ని గ్రహించడానికి మనకు నాలుగు సాధనా మార్గాలు చెప్పబడ్డాయి. అవి కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గాలుగా ప్రసిద్ధి. భగవద్గీతలో కూడా వీటి ప్రస్తావనే ఉంది. జ్ఞాన మార్గానికి మరొక పేరే విచారణ మార్గము. అయితే మిగతా మూడు మార్గాల కంటే ఈ జ్ఞాన మార్గానికే మహర్షి అధిక ప్రాధాన్యత ఇవ్వడం గురించి చెప్తూ "ఈ విచారణ పద్ధతి మిగతా మార్గాలకంటే సూటియైన మార్గము. మిగతా మార్గాలలో కర్త అలాగే ఉండి క్రియలనాచరిస్తుంటాడు. కాని ఈ జ్ఞాన మార్గములో అన్నింటికి మూలమైన కర్త (అహం)ను విచారించడం ద్వారా వాడు నశించి సత్యం బోధపడుతుంది" అంటారు. (ఉపదేశసారము–17).

కర్మ, భక్తి, యోగ మార్గాలన్నీ ఆచరించేవాడు అంటే ఆ మార్గాలను సాధన చేసేవాడు ఒకడున్నప్పుడే జరుగుతాయి. అంటే కర్త అలాగే ఉంటూ అభ్యాసం చేస్తూ ఉంటాడు. కాని ఈ విచారణ పద్ధతిలో ఈ అభ్యాసం చేసేవాడు ఎవడు? ఈ కర్మ, భక్తి, యోగ సాధనలు ఎవరికి? ఈ భగవంతున్ని అన్వేషించేది ఎవరు? అని విచారిస్తూ అన్వేషించే వాణ్ణే అన్వేషించడం వలన అన్వేషించే వాడు (అహం) నశించి సత్యం సాక్షాత్కారమౌతుంది.

అంతే కాకుండా మనము మిగతా ఏ మార్గాన్ని ఎంచుకున్నా అది చివరికి నిన్ను జ్ఞాన మార్గానికే చేరుస్తుందంటారు మహర్షి. మిగతా అన్ని మార్గాలలో దొంగ (కర్త) పట్టుబడకుండా చాటుగా ఉండి క్రియలనాచరిస్తుంటాడు. కాని ఈ విచారణ మార్గంలో సూటిగా దొంగనే పట్టుకోవడం జరుగు తుంది. కనుక ఈ విచారణ మార్గము మిగతా మార్గాలన్నింటి కంటే శ్రేష్ఠమైనదని మహర్షి సూచిస్తున్నారు.

ఏకాగ్రత సిద్ధించేటందుకే మిగతా సాధనా మార్గాలు. కర్తృత్వ భావన పోవడానికే కర్మమార్గము. భగవంతుడు నీవే అని తెలుసుకోవడానికే భక్తి మార్గము. అభ్యాసి తన్ను తాను మరచి పోయి బ్రహ్మంలో లీనమగుటకే ధ్యాన సాధన. ఇలా అన్ని మార్గాలు కూడా నిన్ను చివరికి జ్ఞాన మార్గానికే చేరుస్తాయి అంటారు మహర్షి.

ఈ విచారణ పద్ధతిలో అంతిమంగా జరిగేదేమంటే చైతన్య రహితమైన దేహము, ఇంద్రియాలు, ప్రాణము, మనస్సు, బుద్ధి త్యజించి వీటిన్నింటి మూలమైన 'నేను'(అహం)ను విచారించగా అసలు ఈ నేను అనేదే లేదని తెలుస్తుంది. అంటే 'అహం' నశిస్తుంది. అప్పుడు 'నేను' అనే జీవాహంకారము కొంచెం కూడా లేని ఆ నిశ్చలస్థితిలో అఖండ పరిపూర్ణమైన పరమాత్మ స్వయంగా 'నేను' 'నేను' అంటూ స్ఫురిస్తుంది. ఈ నేను అహంభావ రహితమైన, విశ్వ వ్యాప్తమైన 'నేను'. దీనికే ఆత్మ, చైతన్యం, బ్రహ్మం, సత్ అన్న పేర్లున్నాయి. ఇదే అంతిమ సత్యంగా చెప్పబడుతుంది.

(ఉపదేశసారం – 19,20)

దేన్ని తెలుసుకుంటే సమస్తం తెలుస్తుందో అదే ఈ 'నేను'ను తెలుసుకున్న స్థితి. దీన్నే మహర్షి జ్ఞానాజ్ఞానములు లేని స్థితి అన్నారు. ఎందుకంటే జ్ఞానమైనా, అజ్ఞానమైనా తెలుసుకునేవాడు. తెలుసుకోలేని వాడు అంటూ ఒకడున్నప్పుడే సాధ్యమౌతుంది. ఈ విచారణ పద్ధతిలో ఈ జ్ఞానాజ్ఞానములు ఎవరికో అన్వేషించి ఈ రెండింటికి మూలమైన వాడెవడో వాణ్ణి నశింపజేయటం జరుగుతుంది. ఇక ఆ స్థితిలో గ్రహించేవాడు, గ్రహించబడేది అన్న భేదము లేదు. ఉన్నదంతా ఒక్క ఆత్మ తప్ప వేరేదీ లేదు. ఇదే అద్వైతము. ఈ స్థితిని గురించి బృహదారణ్యకంలో యాజ్ఞవల్క్యుడు, మైత్రేయికి సత్యాన్ని బోధిస్తూ ఎక్కడైతే ద్వైతం కనిపిస్తుందో అప్పుడు ఒక వ్యక్తి వేరొకదాన్ని చూడటం, వేరొకదాన్ని వినటం, వేరొకదాన్ని వాసన చూడటం, వేరొకదాన్ని మాట్లాడటం, వేరొకదాన్ని తెలుసుకోవటం జరుగుతుంది ఎప్పుడైతే

సర్వమూ బ్రహ్మవేత్తయైన ఆత్మగా అయిపోతుందో అప్పుడు దేనిద్వారా దేన్ని చూడటం? దేనిద్వారా దేన్ని వినటం? దేనిద్వారా దేన్ని వాసన చూడటం? దేనిద్వారా దేన్ని మాట్లాడటం? దేనిద్వారా దేన్ని ఆలోచించటం? దేనిద్వారా దేన్ని తెలుసుకోవటం? అని అంటాడు.

ఈ జ్ఞాన మార్గముగా చెప్పబడుతున్న విచారణ పద్ధతి గురించి వేదాంతాలు మొదలు అనేక ఆధ్యాత్మిక గ్రంథాలలో చెప్పబడినట్లు ప్రమాణాలు కనిపిస్తున్నాయి.

"మనస్సుతో సహా పంచ జ్ఞానేంద్రియాలు నిశ్చలంగా ఉండడం, బుద్ధి కూడా నిష్క్రియంగా ఉండడం - సంభవించిన స్థితిని 'పరమ గతి' గా వారు (జ్ఞానులు) పేర్కొంటారు ". (కఠోపనిషత్. 2-3-10)

"అర్జునా! ద్రవ్య సాధ్యమైన యజ్ఞం కంటే జ్ఞాన రూపమైన యజ్ఞం శ్రేయస్కరం. సమస్త కర్మలు ఫలసమేతంగా ఆత్మ జ్ఞానంలో అంతర్గతమౌతాయి అని చెప్పబడింది". (భగవద్గీత. 4-33).

"నేనెవరు? ఈ సంసార మెవరికి కలిగింది? అని బుద్ధిమంతుడు ఎట్టి ఆపదల యందును ఆటంకము లేక ప్రయత్నముతో బుద్ధి చేత విచారణ చేయవలెను". (జ్ఞానవాశిష్ఠం - ముముక్షు వ్యవహార ప్రకరణము - ఆత్మ విచార ప్రశంస).

"జ్ఞాన యోగమునందు పూజ, నమస్కారము, జపము, ధ్యానము ఏవియును లేవు. ఆత్మను అనగా తన స్వరూపమును తాను, తెలిసికొనుట తప్ప వేరేమియు తెలిసికోవలసినది లేదు".


(శ్రీదేవికాలోత్తరం - జ్ఞాన ప్రకరణము)

"ఆత్మ లాభము కన్న మించిన లాభము ఎక్కడను లేదు. కావున ఆత్మనే ఉపాసింపవలయును, ఉపాసించుటకు ఆత్మ వేరుగా ఎక్కడనో లేదు. నీ యందే "నేను, నేను" అని తోచుచున్న స్ఫురణయే ఉపాసింపదగిన ఆత్మ; అదే పరమాత్మ.

(శ్రీసర్వ జ్ఞానోత్తర - ఆత్మ సాక్షాత్కార ప్రకరణము)

ఈ విచారణ పద్ధతే పాశ్చాత్య తత్త్వశాస్త్రానికీ పునాదిగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రాచీన ఫిలడెల్ఫియా దేవాలయం నందు "నిన్ను గురించి నీవు తెలుసుకో " అని రాయబడి ఉంది. పాశ్చాత్య తత్త్వశాస్త్రానికి పితామహుడిగా చెప్పబడుతున్న థేల్స్ "మానవులకు మానవున్ని తెలుసుకోవడం అత్యంత క్లిష్టమైన పని" అని నిర్వచించాడు. పాశ్చాత్య తత్త్వానికి ఆద్యుడైన సోక్రటిస్ బోధనంతా ఈ "నేను" కేంద్రంగా చెప్పబడిందే.

ఈ విచారణ లేదా జ్ఞాన పద్ధతి ద్వారా సత్యాన్ని తెలుసుకోవచ్చు అని చెప్పడానికి రమణ మహర్షే నిదర్శనం. ఎలాంటి శాస్త్రాధ్యయనం గాని, గురూపదేశంగాని లేకుండానే మహర్షికి పదిహేడు సంవత్సరాల వయస్సులో ఈ విచారణ పద్ధతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం కలిగింది. కాబట్టి ఇది శాస్త్రీయ పద్ధతని చెప్పటానికి ఇదే ప్రమాణం.




చివరగా 'పాల్ బ్రంటన్' అనే బ్రిటీష్ పాత్రికేయుడు తన 'రహస్య భారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ' అన్న గ్రంథంలో మహర్షి గురించి చెప్పిన మాటలు గమనించదగ్గవి. "ఆయన స్వీయ వ్యక్తిత్వమూ, దృక్పథమూ, ఆయన కార్యాచరణ పద్ధతీ గమనిస్తే, అవన్నీ ఆధునిక శాస్త్ర సమ్మతంగానే ఉంటాయి. అసాధారణ శక్తులని గానీ, మతాచారాలలో అంధ విశ్వాసాలనిగానీ ఆయన సమర్థించరు. ఆయన ఆశ్రమంలోని వాతావరణంలో ఉండే పవిత్రతా, తనని తాను ప్రశ్నించుకునే ఆయన సిద్ధాంతమూ దూరంగా ఉన్న అరుణాచల దేవాలయంలో ప్రతిధ్వనిస్తున్నట్లుంటాయి. ఆయన పెదాల మీద దైవం అనే మాట వినబడుటయే అరుదు. అందరికీ ఆయన సూచించే మార్గం ఒక్కటే 'స్వీయ ఆంతరంగిక అన్వేషణ'. (పుట . 299).

**ఆధార గ్రంథాలు**


1. శ్రీ రమణలీల - కృష్ణ భిక్షు
2. శ్రీ రమణ భాషణములు - రామ చంద్ర కౌండిన్య
3. శ్రీ రమణాశ్రమ లేఖలు - సూరి నాగమ్మ
4. రమణ మహర్షి బోధనలు - ఆర్థర్ అస్బర్న్
5. భగవాన్ రమణ మహర్షి - చిక్కాల కృష్ణారావు
6. శ్రీ రమణగ్రంథమాల - రమణ మహర్షి (సంకలన గ్రంథం)
7. అనుదినము రమణులతో - దేవరాజ ముదలియార్
8. వేద శాస్త్రాల సంక్షిప్త పరిచయం -డా.రేమెళ్ళ అవధానులు
9. ఉపనిషత్ కల్ప తరువు - ఇంద్రగంటి శ్రీకాంత శర్మ
10. విద్యా - తాత్త్విక ఆధారాలు - రాష్ట్ర పరిశోధనా శిక్షణా మండలి
11. సోక్రటీస్ - బ్రహ్మర్షి పత్రీజీ
12. జ్ఞాన వాశిష్ఠము - వావిళ్ల రామస్వామి శాస్త్రులు
13. అపరోక్షానుభూతి - ఆది శంకరాచార్య
14. భగవద్గీత - స్వామి నిర్వికల్పానంద

# స్మృతి కవిత్వంలో శ్రీమతి భారతీ రాయన్న ప్రస్థానం

**సుంకరి గంగాధర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 94408 70652

శ్రీమతి భారతి రాయన్న రచించిన స్మృతి కవితాసంపుటి 'కనుల కొలను'. ఇది వెలువడిన తర్వాత పతిస్మృతికి ప్రతీకగా నిలిచింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో స్మృతి కవితలను కవులు అడపాదడపా వ్రాసినట్లుగా కనబడుతుంది. కానీ శ్రీమతి భారతి తన భర్తతోడి జ్ఞాపకాల దొంతరలను స్మృతికావ్యంగా మలచడం వారి ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం. తన లాంటి ఇతర స్త్రీల మనోనిబ్బరానికి మేలిమి నిచ్చెన (మార్గము, సోపానం). ఈ కవితా సంపుటిలో 125 కవితలు చోటు సంపాదించాయి.

ఇందులో కవయిత్రి, తన భర్త మరణంతో తన అస్తిత్వాన్ని భవిష్యత్తును ఎలా భావించింది? తనలాంటి వారికి ఆదర్శప్రాయమైన తీరు, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించిన విధం, ఆచార సంప్రదాయాలకు సంబంధించిన కవితలు వ్రాయడం జరిగింది. భర్త దివంగతుడైన తరువాత భార్య వ్రాసిన "పతి స్మృతి కావ్యాలు" నాకు తెలిసినంత వరకు లేవనే చెప్పుకోవచ్చు. అయితే కొద్దిపాటి గీతాలో, వచన కవితలో వెలువడ్డాయి. బసవరాజు సౌదామని, తురగా జానకీరాణి వంటి కవితలు ఇందుకు ప్రతీకలు. ఈ కనుల కొలను స్మృతికావ్యమే వచన కవిత్వంలో పతిస్మృతిగా వచ్చిన తొలి కవయిత్రి కవిత్వంగా భావిస్తున్నాను.

**"కనుల కొలను"** కవితా సంపుటికి "పతి స్మృతికి తొలి స్వర పత్రం" శీర్షికన ముందుమాటను ప్రముఖ తెలుగు కవి విమర్శకులు డా. నాళేశ్వరం శంకరం వ్రాసారు. కనుల కొలనులోని కవితలను భారతీ తన భర్త మరణానంతరము 2013వ సంవత్సరంలో వ్రాయడం జరిగింది. భూదేవి గర్భంలోకి సీతాదేవి వెళ్లినంత హృదయతాపంతో, శోకార్ణవంతో కనుల కొలను లోంచి కవిత్వమై, 'పతి స్మృతి' పది కాలాలు జీవించేటట్లు, తన విషాదస్మృతిని తెలపటం, వియోగానికి గురైన దంపతుల అనుభవాలను భర్తను కోల్పోయిన ప్రతి స్త్రీ అనుభవంలోకి తేవటం కొరకు తన శోకంలోని అమలినత్వం ప్రకటించి తనకు తాను స్వీయ ఓదార్పు పొందటం కొరకు ఈ రచనను వెలువరించారు. కనుల కొలను రచయిత్రికి గల సామాజిక బాధ్యతకు సజీవ సాక్ష్యంగా నిలబడుతుందన్నది నిర్వివాదాంశం.

భర్త మరణించిన దశలో వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ శ్రీమతి భారతి చుట్టూ జరిగిన సాంఘిక పరిణామాలు వారికి రచన వస్తువులను నిర్దేశించాయి. రచనా క్రమములో మొదట కనులకొలను తరువాత వెన్నెల పుష్పాలు వెలువరించారు. తెలుగులో వస్తున్న ప్రక్రియా పరమైన మార్పులు అర్థం చేసుకుంటూ ఒకానొక పరిపక్వమైన దశకు చేరుకున్నారు.

స్మృతి కవిత్వానికే ఒక అలంకారంగా నిలిచే మాట శుద్ధిచేయటం. భారతి భావుకురాలు. ఊహల్ని కవిత్వములో పుష్పింప చేయడం ఆమెకు చేతనైన విద్య అంటూ కనుల కొలను పీఠికలో డా. నాళేశ్వరం శంకరం కితాబు పలికినారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సినారె ఈ కవితా సంపుటిలో అన్ని కవితలలోని పంక్తులు ఉదాహరణ యోగ్యంగా ఉన్నాయని శ్రీమతి భారతి తన కవితాత్మను హృదయంగమంగా పొందుపరిచిందని, వారి రచనాశక్తికి హార్దికాభినందనలు అంటూ ప్రశంసించారు. సామల రమేష్‌బాబు అధ్యక్షులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య, విజయవాడ ఈ కవితల్లో కొన్ని మనల్ని సానుభూతితో ఆలోచింపజేస్తాయని, ఎక్కువ కవితలు వేదనను కలిగిస్తాయని, గుండె తడి ఉన్న ప్రతి చదువరిని కవయిత్రికి అభిమానులుగా చేస్తాయని, కనుల కొలనులో నిండుగా జాలువారిన తన సంతాపాన్ని పాఠకులు పంచుకునేట్లు శ్రీమతి భారతి రాయన్న వ్రాసినట్లు విశ్లేషించారు.

కవి వ్యాఖ్యాన ప్రపూర్ణ వి.పి. చందన్ రావు మీ కనుల కొలను లోని దుఃఖ చారికలను ఎవరు తుడవగలరు. మిమ్మల్ని మీరు ఓదార్చుకున్నట్లు మిమ్మల్ని ఇంకెవ్వరు ఓదార్చలేరని కవయిత్రికి గల ఆత్మవిశ్వాసాన్ని కొనియాడారు. కవి విమర్శకులు డి. శ్రీహరిరామం ఇది ఒక అశ్రు కావ్యం, కన్నీళ్లు అక్షరాలుగా మారి మనసులోతుల్ని కదిలించే కరుణ కావ్యమన్నారు. ఒక విధంగా భారతి 'కనుల కొలను' ద్వారా తన దుఃఖాన్ని తగ్గించుకుంటూ రాయన్న గారిని తన స్మృతులలో బ్రతికించుకుందంటూ కవయిత్రి స్నేహితురాలు పువ్వుల ప్రసన్న లక్ష్మి ఓదార్చారు.

**శ్రీమతి భారతి రాయన్న 'కనుల కొలను'లో ని కవితల పరిశీలన**

పతియే ప్రత్యక్ష దైవం అన్న భావనను సహజంగా కలిగిన భారతి గారు ప్రార్థన కవితలో తన ఊపిరి, ప్రాణం, చైతన్యం, కవిత్వం, మార్గం తన భర్తేనని ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. తన రచనా వ్యాసంగానికి ప్రేరణ అని, అలాంటి తోడును కోల్పోవడంతో అన్ని విషయాలలో తనను చూసుకొమ్మంటూ, తనను తాను జ్ఞాపకంగా మలచుకున్నాడంటూ బాధపడుతుంది. అయినప్పటికీ తన భర్త ఇచ్చిన ప్రేరణతో 'నీవు లేని ఈ లోకంలో నిన్నటి, నీ ఆలోచనలకు నేనో కార్యకర్తను' అంటూ బాధ్యతాయుతంగా, జవాబుదారీతనం కలిగిన జవరాలిగా అంకితభావంతో భర్త అడుగుజాడల్లో నడవడానికి, ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చడానికి తనకింకా ఆత్మవిశ్వాసం అందించాలని కన్నీటితో ప్రార్థిస్తుంది. బ్రతికున్న కాలంలో దారి దీపంగా విలసిల్లిన తన భర్త మరణించడంతో, ఇంటికి దీపమైన ఆ ఇల్లాలు ఎంతగానో విలపించింది.

'జవాబు లేని ప్రశ్న' లో పుణ్యం కొద్ది పురుషుడు, దానం కొద్ది బిడ్డలంటారు. స్త్రీలు పుణ్యకార్యాలు ఆచరించడం వల్ల మంచి భర్త దొరుకుతాడని, దానధర్మాలు చేయడం వల్ల మంచి సంతానం కలుగుతుందని నమ్ముతారు. తాను చేసిన పుణ్య దానాల వల్ల మంచి భర్తను, బిడ్డలను ప్రసాదించిన దేవుడు తన భర్తను తనకు దూరం చేయటాన్ని జీర్ణించుకోవటం లేదు. ఒక చేతితో ఇచ్చి రెండవ చేతితో తీసుకోవటం ఇవ్వటం ఎలా అవుతుందంటూ శోకపర్యంత మవుతుంది.

'స్మృతితో సుమంగళి' కవితలో హిందు సంప్రదాయములో భర్తను కోల్పోయిన స్త్రీలు పూలు ధరించడం, గాజులు వేసుకోవడం, బొట్టు పెట్టుకోవడం, తాళి ధరించడం, మెట్టెలు పెట్టుకోవడం అణాచారంగా స్థిరపడింది. ఆచారపు అవగాహన కలిగిన కవయిత్రి మొదట చర్చించిన విషయాలు, తనకు వర్తించినప్పటికీ, తాను నిత్య సుమంగళినని గడుసుగా జవాబిస్తుంది. అదెలాగంటే 'నీ స్మృతులతో నేనెప్పటికీ నిత్యసుమంగళినే' అంటుంది. భర్త మరణించినప్పటికీ, తన భర్తతో జీవించిన నాటి మధురస్మృతులు తనతోనే ఉన్నాయని, తన హృదయంలో తన భర్త కొలువై ఉన్నాడని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తుంది. ధర్మబద్ధమైన రీతిలో మనల్ని సమాధాన పరుస్తుంది. తనను తాను ఇంకెవ్వరూ ఓదార్చని తీరుగా ఓదార్చుకుంటుంది. ఈ విధంగా తాను నిత్యసుమంగళినని సాక్ష్యాలు చూపటం లోకజ్ఞతకు నిదర్శనం. ఎవరైనా జీవితంలోని దశలను అవి తెచ్చిపెట్టే ఫలితాలను ఆస్వాదించాలి. కుంగుబాటును సంతోషాతిశయాలను సమానంగా స్వీకరించాలి. సాధనతో ఒడిదుడుకులను వివేకముతో అధిగమిం చాలి. నూరేళ్ల జీవన సఫలాన్ని, దాని మాధుర్యాన్ని ఆస్వాదించాలి అనే అంతరార్థాన్ని తెలియజేస్తుంది.

'ఇంతకు దేవుడు' అన్న కవితలో కవయిత్రి అన్యోన్యమైన వారి జంటను నిర్దాక్షిణ్యంగా విడదీసి, వియోగానికి పరితపిస్తున్న తనను 'నేలరాలిన పక్షి ఆశయాల బాటలో పయనించాలని' భర్త ఆశలు, ఆశయాల సాధనకు కావాల్సిన శక్తియుక్తులను, భగవంతుడు తనకు అందించటం దిక్కు తోచని సమయంలో 'దిక్కు లేని వారికి దేవుడే దిక్కు' అన్న సామెతను తలపిస్తుంది. దైవం దర్శనమిచ్చి విధి రాతకు విలపించ వద్దని భుజం తట్టిన తీరు కనిపిస్తుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే "కనుల కొలను" కవితా సంపుటిని శ్రీమతి భారతి తన భర్త కొరకు నిర్మించిన నిలువెత్తు స్థూపం, వియోగ దుఃఖముతో చెక్కిన శిల్పం, నిండు మనసుతో అర్పించిన ఘనమైన నివాళి, అక్షర నీరాజనం, అక్షరాభిషేకం, చెదిరిన మనస్సును సమన్వయ పరుచుకుని రాసిచ్చిన వీలునామా.

## సాధన పంచకమ్


**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాऽऽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాऽऽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వగంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

### వివరణ

**6. ప్రతిదినం తత్పాదుకా సేవ్యతామ్ –**

ప్రతి నిత్యము గురుదేవుని పాదుకలను సేవించవలెను. అనగా తమ గురుదేవుని పాదపద్మములను ఆశ్రయించాలి. నిత్యం నమస్కరించాలి, ప్రార్థించాలి అని తాత్పర్యం. పాదాలకు నమస్కరించాలి అంటే మనిషి వంగాలి. వంగి నమస్కరించుట ద్వారా శిష్యుడు తన భక్తిని, విధేయతను, వినమ్రతను గురువుకు వ్యక్తం చేస్తున్నట్లు లెక్క. తలను పైకి లేపినవాడు అహంకారి. తలను క్రిందికి వంచినవాడు నిరహంకారి. ఆతడే భక్తుడు. శిష్యుడు కాగలడు. కనుక అణకువగా, విధేయంగా ఉన్నవాడే జ్ఞానదీపాన్ని అందుకోగలడు. కావున గురుదేవులకు భక్తితో నమస్కరించుట, నిరహంకారంతో సేవించుట, గురుభావాలకు, ఆదర్శాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకోవటమే గురుపాదుకలను సేవించుట అవుతుంది.



మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# పాలమూరు జిల్లా మౌఖిక సాహిత్యం - వస్తు రూప వైవిధ్యం

**మ్యాతరి ఆనంద్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 8184859060

**పరిచయం:** మహబూబునగర్ జిల్లాను పాలమూరు అని పిలుస్తారు. అలా పిలవడానికి జానపదులలో ఒక ఐతిహ్యం ఉంది. **'పాలమూరు పరిసర ప్రాంతాలలో ప్రజలు ఎక్కువగా పశుసంపద మీద ఆధారపడి బతుకుతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పాలు, పెరుగు లాంటి పాల సంబంధ వస్తువులు ఇక్కడ అమ్మేవారు. పాలు అమ్మే ఊరు కాస్తా ఉచ్చారణ సౌలభ్యాన్ని సంతరించుకొని పాలమూరుగా రూపాంతరం చెందింది'** అని చుట్టు ప్రక్కల ప్రజలు చెప్తారు.

**"మహబూబునగర జిల్లా ఆరవ నిజాం మీర్ మహబూబలీఖాన్ పేర వ్యవహారింపబడుచున్నది. ఇది పూర్వము పాలమూరు జిల్లాగా ప్రసిద్ధిగాంచి యుండెను. వృద్ధులు, గ్రామీణ ప్రాంత ప్రజలు నేటికిని మహబూబునగర జిల్లాను పాలమూరు మండలమని పిలుచుదురు"** (మహబూబు నగర జిల్లా సర్వస్వము, 1993, పుట: 5)

తెలంగాణ రాష్ట్రంలోని పాలమూరు అతి పెద్ద జిల్లా. ఇది 16 – 17 డిగ్రీల ఉత్తర అక్షాంశాలకు, 77–79 డిగ్రీల తూర్పు రేఖాంశాలకు మధ్య ఉంది. దీని విస్తీర్ణం 18,432 చదరపు కిలోమీటర్లు. ఈ జిల్లా పడమర కర్ణాటక రాష్ట్రం, ఉత్తరాన రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగరం, ఈశాన్యాన నల్గొండ జిల్లా, తూర్పున గుంటూరు జిల్లా, ఆగ్నేయాన ప్రకాశం జిల్లా, దక్షిణాన కర్నూలు జిల్లాలు సరిహద్దు ప్రాంతాలు.

ఒకొక్క దిశ, ఒక్కొక్క భాష ప్రత్యేకతతో జిల్లాను ప్రభావితం చేస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని కన్నడ భాష, ఈ జిల్లాలోని కోడంగల్, మక్తల్, గద్వాల్, దేవరకద్ర తాలుకాలను ప్రభావితం చేస్తున్నది.

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ తెలుగుతో దగ్గరి సంబంధం ఉంది. భౌగోళికంగా హైదరాబాద్ తెలంగాణలో ఒక భాగం అయినప్పటికీ, ఇక్కడి తెలుగు తెలంగాణ మాండలికం కన్నా భిన్నమైంది. ఈ ప్రాంతపు భాషపై ఉర్దూ ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఇది పాలమూరు జిల్లాలోని ఉత్తర భాగాన్ని ప్రభావితం చేస్తుంది. నల్గొండ జిల్లా తెలంగాణ మాండలికానికి సంబంధించినది. ఇది ఈశాన్య భాగాన్ని ప్రభావితం చేస్తుంది. కర్నూలు జిల్లా రాయలసీమ మాండలికానికి చెందినది. ఇది దక్షిణ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంది. భౌగోళికంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలు కూడా పాలమూరు జిల్లాకు సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆ ప్రాంతంలో నల్లమల్ల అటవీ ప్రాంతం ఉంది. కావునా జన సమూహాలు లేవు. అందువల్ల కోస్తా మాండలిక ప్రభావం అంతగా కనిపించదు. ఈ విధంగా పాలమూరు జిల్లా భాషపరంగా అనేక వైరుధ్యాలు కలిగి ఉంది.

**పరిశోధన ఆవశ్యకత :** ఇప్పటివరకు జానపద సాహిత్య పరిశోధన సేకరణ విశ్లేషణ అనే పద్ధతిలోనే కొనసాగింది. నిర్దిష్ట ప్రాంత ప్రత్యేకతల మీద పరిశోధనలు పరిమితంగానే వచ్చాయి. ముఖ్యంగా పాలమూరు జిల్లా మౌఖికసాహిత్యం మీద వచ్చిన పరిశోధనలు అన్ని సేకరణ పద్ధతిలోనే కొనసాగినవి. కనుక మొత్తం జానపద సాహిత్యంలో నిర్దిష్టతను, వైవిధ్యాన్ని వివరించలేని పరిమితిని దాటి పరిశోధన చేయాలనే లక్ష్యంతో ఈ పరిశోధనాంశాన్ని ఎన్నుకున్నాను.

**పరిశోధన పరిధి :** పాలమూరు జిల్లాలో విస్తృతమైన మౌఖిక సాహిత్యం ఉంది. ఇప్పటివరకు జానపద సాహిత్యం మీద పరిశోధనలు అధికంగా జరిగాయి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల జానపద సాహిత్యం కనుమరుగు అవుతుంది. ఈ అంశంపై పరిశోధన అవసరంగా భావించాను. నా పరిశోధనాంశంలో జానపద సాహిత్యం అని కాకుండా మౌఖిక సాహిత్యం అనే పదాన్ని ఉపయోగించడానికి కారణం ఉంది. చాలామంది విద్యావంతులు తమ సృజనాత్మకతతో జానపద సాహిత్య బాణిలో కొంత మార్పు సేసి సాహిత్యం సృష్టి చేస్తున్నారు. కాబట్టి ఈ సాహిత్యం అంతా జానపద బాణిలో ఉన్న అది మార్పుచెంది కొత్త దారి తొక్కుతుంది. కావున నేను కేవలం ఇంకా లిఖిత రూపంలోకి రాని సాహిత్యం మౌఖికంగా చాలా ఉంది. దానిని వెలికి తీయాలనే ఉద్దేశంతో ఈ మౌఖిక సాహిత్యం అనే పదాన్ని ఉపయోగించాను. ఈ అంశాన్ని స్థల, కాలాల పరిధి దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి పాలమూరు జిల్లాకే పరిమితం చేసుకున్నాను. అందులో భాగంగానే **పాలమూరు జిల్లా మౌఖిక సాహిత్యం – వస్తురూప వైవిధ్యం** అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నాను.

**పరిశోధన పద్ధతి :** ఈ పరిశోధనాంశం జానపద విభాగానికి సంబంధించినది కావున ఆ పరిశోధన పద్ధతిని అనుసరించి విషయ సేకరణ చేశాను. ఇందులో ప్రధానంగా రెండు పద్ధతులను పాటించాను.

ఒకటి గ్రంథ సేకరణ

రెండు క్షేత్ర పర్యటన

ఇందులో భాగంగా అనేక గ్రంథాలయాలు సందర్శించి వివిధ గ్రంథాలను పరిశీలించాను. అనేక ప్రాంతాలకు వెళ్ళి క్షేత్రస్థాయిలో మౌఖిక వ్యవహర్తల వద్ద వారి సాహిత్యాన్ని సేకరించాను. ఆ పద్ధతిలో సేకరించిన అంశాలలో వస్తు పరంగా వైవిధ్యం కలిగిన వాటిని ఈ పరిశోధనలో ప్రస్తావించాను. సేకరించిన సమాచారాన్ని బట్టి ఆరు విధాలుగా అధ్యాయ విభజన చేశాను. అవి.

**1. పాలమూరు జిల్లా మౌఖిక సాహిత్యం – పరిచయం :**

ఇందులో నేను పాలమూరు జిల్లా భౌగోళిక స్వరూపాన్ని పరిచయం చేశాను. తర్వాత పరిశోధనాంశం పరిమితికి లోబడి వస్తు రూప వైవిధ్యం చూపించాను. మౌఖిక సాహిత్యం రూపపరంగా మౌఖిక పాట నిర్మాణంలో లయ, అనుపల్లవి, వస్తువులాంటి అంశాల ప్రభావం చర్చించాను, వాటి నిర్మాణ విశేషాలు ఈ అధ్యాయంలో చర్చించాను.

**2. పాలమూరు జిల్లా మౌఖిక గేయ సాహిత్యం –వస్తు వైవిధ్యం**

ఈ అధ్యాయంలో జానపద సాహిత్యానికి గుండెకాయ వంటి గేయ సాహిత్యంలో వస్తు వైవిధ్యాన్ని చర్చించాను. అందులో పాలమూరు ప్రాంతంలో ఇంకా లిఖిత రూపంలోకి రాని పాటలను ఎక్కువ ప్రస్తావించాను. అందులో పాలమూరు జిల్లా ప్రత్యేకతను చాటే సాహిత్యానికి అధిక ప్రాధాన్యతనిచ్చి పరిశోధన చేశాను.

**ఉదా : తెల్లతెల్ల జీరున్నాది / అంచున మల్లె మొగ్గున్నాది**
**కొంగన కోడి పుంజమ్మో / కోయిలకొండ బీమమ్మ**
**కొండలోక్క దానవే / కోయిలకొండ బీమమ్మ**
**ఖిలలోక్క దానవే / కోయిలకోండ బీమమ్మ**
**ఎంత మాయ దానవే / కోయిలకోండ బీమమ్మ**
**మహిమ తెలియనీయవే / కోయిలకొండ బీమమ్మ** (మాణిక్యమ్మ, 50, కొత్తపల్లి, మద్దూర్ మండలం

ఈ పాట పాలమూరు జిల్లా కోయిలకొండ మండలంలో ఉన్న బీబీఫాతిమ పీర్లపండుగ సందర్భంగా ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు పాడుకుంటారు. ఈ పాట కోయిలకొండ పీర్ల పండుకు ప్రశస్తి ఎంతవరకు వ్యాపించి ఉంటుందో అంతవరకు ఉంటుంది. ఇది ఎక్కువగా పాలమూరు ప్రజల నాలుకమీద నాట్యం చేస్తుంది. పాటలో నిర్మాణపరంగా అవసరమైన చోట ఆద్యక్షర ప్రాసను ఉపయోగించారు.

కొండలొక్క దానవే, ఖిలలొక్క దానవే లాంటి పదాలు పాటలో ప్రాస నియమాన్ని చూపిస్తాయి. ఈ పదాలే పాటకు లయాత్మకతను తీసుకువస్తాయి.

ఈ పాటలలో కథావస్తువు తెలియాలి అంటే ఆ కోట గురించి ప్రజల నమ్మకం తెలియాలి. అప్పుడే పాట అంతరంగం అర్థం అవుతుంది. కొండలొక్క దానవే, మహిమ తెలియనీయవే లాంటి పదాలు ప్రజల నమ్మకాలను తెలుపుతాయి.

కోయిలకొండ పీర్ల పండుగ సందర్భంగా బీబీఫాతిమ పీర్లగుట్ట పై నుంచి కిందికి వచ్చిన తర్వాత ఏ ఒక్కరు కూడా పైకి వెళ్ళడానికి వీలు లేకుండా పోలీసులు ఆ ప్రాంతానికి కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తారు. ఒకవేళ ఎవరైనా వెళ్ళినవారు అక్కడే చనిపోతారని ప్రజల నమ్మకం. అందుకే అంత పెద్ద కోటలో ఒక్కదావే ఉంటున్నావు. నీకు మాత్రం ఏమి కాదు. నీ మహిమలు ఎవరికి తెలియవని పొగుడుతున్నారు.

**3. పాలమూరు జిల్లా మౌఖిక కథాసాహిత్యం –వస్తు వైవిధ్యం**

ఉదా: నాకు దొరికిన వాటిలో ప్రత్యేకంగా అనిపించిన కథ ఒకటి ఉంది. ఇది భాగవతంలో కుచేలోపాఖ్యానానికి సంబంధించింది. భాగవతంలో కుచేలుడు శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళితే అక్కడ కృష్ణుడు కుచేలున్ని హంసతూలికాతల్పంపై కూర్చోబెట్టి తగిన ఉపచారాలు చేశాడు.

మౌఖిక కథలో కృష్ణుడు కుచేలున్ని తూగుటుయ్యాలమీద కూర్చోబెట్టి, కాళ్ళు కడిగి నెత్తిమీద చల్లుకున్నాడు. లక్ష్మీదేవి విసన కర్ర తీసుకొని గాలి ఊపింది. తర్వాత వారు అన్నం తినేటప్పుడు గారెలు, బూరెలు, పోలెలు, గర్జకాయలు, పులిహోర, పప్పన్నం, కూర తెచ్చి మంచిగా వండిపెట్టాడు.

ఈ కథలో కథా వస్తువు పురాణ ఇతిహాసాలకు సంబంధించింది. అయినా కథలో స్థానిక అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. కథకు ఉపకరణాలు అన్నీ వారి చుట్టు ఉన్న సమాజంలో నుంచి వచ్చినవే. అభూత కల్పనక కంటే వారికి తెలిసిన ఊహలకు ప్రాధాన్యతను ఇస్తారు. ఈ మౌఖిక కథలన్నింటిలో పాలమూరు జిల్లాకు సంబంధించిన కథా వస్తువు కంటే చేప్పే కథన విధానంలో పూర్తిగా పాలమూరు జిల్లా ప్రత్యేకత కనిపిస్తుంది. చాలా కథలలో మౌఖిక కథా లక్షణాలు అన్ని ఉన్నాయి. కథా గమనానికి కావలసిన ఉపకరణాలు అన్ని పాలమూరు జిల్లా ప్రాంతాలకే పరిమితమైనవి. పైన చెప్పిన కథలో పండుగ సమయంలో చేసుకునే గారెలు, బూరెలు అన్ని ప్రాంతంలో చేసుకుంటారు. కానీ కథకురాలికి తెలిసిన ప్రపంచంలో పంచభక్ష్య పరమాన్నం అంటే కేవలం గారెలు, మూరెలు పోలెలు అని మాత్రమే. ఇలాంటి సందర్భంలోనే జిల్లా ప్రత్యేకత కనిపిస్తుంది.

**4. పాలమూరు జిల్లా మౌఖిక సామెతలు – వస్తు వైవిధ్యం**

ఈ అధ్యాయంలో సామెతల ప్రత్యేకతను వివరించాను. సామెతలకు సంబంధించి అనేక పుస్తకాలు లభిస్తున్నాయి. వాటిలో నేను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నప్పుడు నా దృష్టికి వచ్చిన వాటిని సేకరించి ఈ అధ్యాయంలో చర్చించాను. అందులో భాగంగానే సామెత లక్షణాలకు పాలమూరు జిల్లా సామెతలను అన్వయించాను. సామెతల వర్గీకరణ చేసే సమయంలో కూడ పాలమూరు జిల్లాలో వాడే సామెతలను ప్రస్తావించాను. సాహిత్యం అనేది సార్వజనీనమైనది కాబట్టి ఈ సామెతలను మిగతా ప్రాంతాలలో కూడ ఉపయోగించవచ్చు. కానీ వ్యక్తీకరణలో ఆయా ప్రాంతాల స్థానిక భాషల వైవిధ్యం కనిపిస్తుంది. నేను ప్రస్తావించిన సామెతలలో కూడా ఆ ప్రత్యేకత కనిపించింది.

కాశికి పోయిన కందూరుకు పోయిన ఒకటే

కందూరు పాలమూరు జిల్లాలోని అడ్డకల్ మండల పరిధిలో ఉంది. ఇక్కడ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం పరిసరాలలో

కల్పవృక్షాలు ఉన్నాయి. అవి కాశిలో కూడా ఉన్నాయి. కల్పవృక్షాల ప్రశస్తిని బట్టి అవి కాశికి పోయిన ఒకటే, కందూరుకు పోయిన ఒకటే అనే సామెతను ఉపయోగించారు. ఇలా ప్రాంతాల ప్రత్యేకత, వస్తు, వైవిధ్యం, రూప వైవిధ్యం కలిగిన సామెతలు అనేకం ఈ ప్రాంతంలో ఉపయోగిస్తారు.

**5. పాలమూరు జిల్లా పొడుపు కథలు –వస్తు వైవిధ్యం**

ఈ అధ్యాయంలో పాలమూరు జిల్లాకు సంబంధించిన పొడుపు కథలను చర్చించాను. ఈ పొడుపు కథలలో కూడ పాలమూరు ప్రాంతంలో క్షేత్ర పర్యటన సందర్భంగా లభించిన పొడుపు కథలను, అందులో వస్తుపరంగా, రూప పరంగా వైవిధ్యం కలిగిన వాటిని చర్చించాను.

## సిరివెన్నెల

విరియు వనములో రంగుల విరులు పాట
చలువకొండన కప్పిన తెలుపు పాట
పోరుబాటలో పొడిచిన పొద్దుపాట
విరుగబూసిన వెన్నెల వెలుగు పాట
సంధ్యభానుని కిరణాల చలువ పాట
తేటి ఝుంకార నాదాల తీపి పాట
కూయు కొమ్మపై కోయిల కూత పాట
పదును పెట్టిన కలమున పంట పాట
కొలను హంస గమనాల బలము పాట
పారు సెలయేటి గలగల సొరు పాట
పాట మెచ్చెను జగమంత పాడుకొనగ
తెలుగు పాటకు పూసెను తేనె జిలుగు
తీపి వెన్నెల సొనలద్దె తెలుగు తెరకు
తొడిగె కోహినూర్ వజ్రము దూసి తెచ్చి
సేవలన్నింటి కన్నను శ్రేష్టమనుచు
పాట కడుగులు వేసెను మాట కలిపి
మా తెలుగు సిరి వెన్నెల మల్లెమాల
శాశ్వతముగ పాటను నిల్పి జగతిలోన
మనసు దోచెను శ్రోతల ముదము తోడ
తరలె తారల కలియగ మరలి రాక
వెడలె పాటల రాశి మా వెన్నెల సిరి
నిత్య సాహిత్య చైతన్య నెగడియతడు

**డా. గుడేలి శీనయ్య**
కొల్లాపూర్, ఫోన్ : 9959954848

ఉదా: పాలమూరోనికి పది అంగులు (ఉల్లిగడ్డ) హన్వాడ మండలం.

ఈ పొడుపు కథ అన్ని ప్రాంతాలలో ఉండవచ్చు. కాని ఆయా ప్రాంతాల ప్రత్యేకతను బట్టి వారు స్థానికంగా ఉపయోగించే భాషలో చెప్పుకుంటారు. పాలమూరు జిల్లాలో అన్ని చోట్ల ఈ పొడుపు కథను అలాగే ఉపయోగించలేదు. కొన్ని చోట్ల వేరే విధంగా కూడ ఉపయోగించారు

చిన్న బుడ్డోదు ఇరవై అంగులు తొడిగే (ఉల్లిగడ్డ) కోస్గి మండలం

పై రెండు ప్రాంతాలలో ఒకే పొడుపు కథను వారికి నచ్చినట్లు చెప్పుకున్నారు. ఆ ఉల్లిగడ్డ పొరలు పొరలుగా ఉంటుందనేది వాస్తవం. ఆ పొరలను ఈ రెండు ప్రాంతాలలో అంగులతో పోల్చడం జరిగింది. ఈ విధంగా వస్తుపరంగా రూప పరంగా వైవిధ్యం కలిగిన పొడుపు కథలను ఈ అధ్యాయంలో ప్రస్తావించాను.

**6. పాలమూరు జిల్లా మౌఖిక భాషాంశాలు**

ఈ అధ్యాయంలో పాలమూరు జిల్లాలో క్షేత్ర పర్యటన సందర్భంగా మరియు సేకరించిన సాహిత్యంలోని భాషాంశాలు వాటి ప్రత్యేకతను చర్చించాను. వీటిలో పాలమూరు మాండలిక వైవిధ్యం వాటిపై ఇతర ప్రాంతాల ప్రభావం లాంటి అంశాలను ప్రస్తావించాను. ఆధునిక వ్యాకరణాంశాలకు పాలమూరు మాండలిక పదాలను అన్వయించాను. కొన్ని పాలమూరు జిల్లాలో వాడే మాండలిక పదాలను వివరించాను.

పాలమూరు జిల్లాలో భాష వైవిధ్యం చాలా ఉంది అనడానికి ఈ కింది పదాలు నిదర్శనం

తిన్నావా (పాలమూరు ప్రాంతం)

తిన్యావా (అలంపూరు ప్రాంతం)

వాళ్ళు (పాలమూరు ప్రాంతం)

వనియాండ్లు (అలంపూర్, గద్వాల ప్రాంతం)

ఇలా భాషపరంగా పాలమూరు జిల్లా అనేక ప్రాంతాల ప్రభావానికి లోనై బిన్నత్వంలో ఏకత్వంలా విలసిల్లుతుంది.

**ముగింపు :** ఈ పరిశోధన గ్రంథంలో సాధ్యమైనంత ఎక్కువగా క్షేత్ర పర్యటనలో లభించిన సాహిత్యాన్ని ఉపయోగించాను. ఆయా సందర్భాలలో అని చోట్ల వస్తురూప వైవిధ్యం కనిపించకపోవచ్చు. కొన్ని సార్లు వస్తు వైవిధ్యం కనిపిస్తే, కొన్నిసార్లు రూప వైవిధ్యం కనిపించింది. వీటన్నింటి కలయికగా ఈ పరిశోధన గ్రంథాన్ని సమర్పిస్తున్నాను. అందులో కొన్ని అంశాలు ఇతర ప్రాంతాలలో కూడా ఉపయోగించిన అవి పాలమూరులో కూడా ఉపయోగిస్తారు అనే విషయాన్ని ప్రస్తావించాను.

# ఉద్యమంలో పాట - మాట

**బందరబోయిన శ్రీనివాస్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఫోన్ : 94926 28554

చారిత్రాత్మకమైన తెలంగాణ ఉద్యమంలో పాట ఎంత ప్రభావాన్ని చూపిందో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ప్రక్రియల్లో ఉద్యమ నేపథ్యంలో సాహిత్యం కుప్పలు తెప్పలుగా వచ్చింది. అలా వచ్చిన ప్రక్రియలన్నింటిలో పాట చాలా ప్రత్యేకమైందని చెప్పవచ్చు. ఎందుకంటే అన్ని ప్రక్రియలకంటె పాట సామాన్య ప్రజలుసైతం సులభంగా అర్థంచేసుకునేలా, పలుకగలిగేలా ఉండడమే అనవచ్చు. పాటలో ఉద్యమానికి కావాల్సినవి ఉత్సాహాన్ని అందించగలిగే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది అంటే అతిశయోక్తి కాదు. పెద్దవారిని, చిన్నవారిని అందరినీ ఆకర్షించి తొందరగా కదిలించ గలిగే గుణం పాట సొంతం. అన్ని ప్రక్రియలకంటే పాట భిన్నమైంది. పాట ఎవరో ఒకరు పాడితే మిగతావారు దాన్ని అనుసరిస్తూ పాడుకోవచ్చు. పదిమందీ కలిసి హాయిగా పాడుకోవచ్చు. ఐక్యతను చాటుకోవచ్చు.

నీరు, నిధులు, నియామకాలు అనే మొదలైన అంశాల్లో తెలంగాణ ప్రజలకు జరుగుచున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి అనే ఉద్దేశ్యంతో ప్రధానంగా ఉద్యమం మొదలయ్యిందని చెప్పవచ్చు. వీటన్నిటిని మించి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని తెలంగాణ ప్రజలు సంఘటితమయ్యారు. ఆ నేపథ్యంలో రకరకాల ఎత్తుగడలతో, నూతన పంథాలో ఉద్యమం నడిచిందనవచ్చు. అందులో భాగంగా ప్రజల మనోభావాలను ఆవిష్కరించడానికి పాట ముఖ్య భూమికను పోషించిందని చెప్పుకోవచ్చు. అనేకరకాలైన ఉద్యమ భావోద్వేగాలను సందార్భానుసారంగా పాటల రూపంలో ప్రజలు ఎలా అల్లుకున్నారో చూడవచ్చు. గుండె గుండెలో పల్లవై పాట ఎలా ప్రజ్వరిల్లిందో, ఉద్యమ స్ఫూర్తిని, ఉద్యమ సెగను ఎలా రగిలించిందో చూడవచ్చు. రాగరంజితమై, చైతన్య ప్రవాహమై, బిగిసిన పిడికలై, ఉడికిన రక్తమై పాట ఎలా ఎగసిందో చూడవచ్చు. వాడవాడలా, ఊరూరా ఇంకా చెప్పాలంటే తెలంగాణ అంతట పాట ప్రతిధ్వనించిందని చెప్పవచ్చు. ఎంతోమంది కళాకారులు రాగమెత్తుకొని పదం పాడుతూ కాలి గజ్జలతో చిందేస్తే యావత్ భారతం మారుమోగిందంటే ఎంత మాత్రం సత్య దూరం కాదు అని చాటడానికి నిదర్శనంగా నిలిచిన కొన్ని పాటలను చూద్దాం. అన్ని జిల్లాల్లో ఉద్యమ పాటలు రాసిన కవులు ఎందరో ఉన్నారు. వారంతా స్మరణీయులే. అయినప్పటికీ, ఈ వ్యాసంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని కవులు రాసిన కొన్ని ఉద్యమ గేయాలను మనసారా స్మరించుకుందాం.

**"కమల దళాక్షిణి కరుణార్ద్రితవని**
**దయామృత వర్షిణి పాప నివారిణి**




**కాంతి ప్రదాయిని శాంతి నికేతిని**
**జయ జయహే తెలంగాణ జయహే"**

**'మువ్వ గజ్జెలు' పుట సంఖ్య 1.**

ఒక పాటలోని పై వరుసలను గమనిస్తే, అమ్మవారిని స్తుతిస్తున్నట్లుగా, ఒక దేవతామూర్తిని ఆరాధిస్తున్నట్లుగా, ఏదో ఒక దైవాంశతో జన్మించిన స్త్రీ మూర్తిని గొప్పగా కీర్తిస్తున్నారనిపిస్తుంది. కాని అటువంటి సుగుణాలన్నింటికీ ఆలవాలమైన తెలంగాణ తల్లిని మనసారా స్తుతించిన భావ ఝరి అది. ఎందుకు ఇంత గొప్పగా ఈ నేలతల్లిని స్తుతించారనిపిస్తుంది. దానికి ఒక్కటే సమాధానం. ఇక్కడి చెట్టు , పుట్ట మమకారపు సువాసనలు వెదజల్లుతాయి. ఇక్కడి ప్రజలు మంచితనానికి, శాంతీసామరస్యాలకు నెలవన్నట్లుగా ఉంటారు. అందుకే తనివితీరా ఒక దేవతను స్తుతించినట్లు తెలంగాణ తల్లిని స్తుతించారు పడాల రామారావు.

**"గర్జించిన సింగాలం తెలంగాణ బిడ్డలం**
**ఉరిమి ఉరిమి చూసేటి ఉగ్ర నారసింహులం"**

**'మువ్వ గజ్జెలు ' పుట సంఖ్య 71**






అంటారు మరో పాటలో పడాల రామారావు. అవసరమైన సమయంలో, సందర్భోచితంగా అన్యాయాన్ని ఎదురించడానికి తెలంగాణ ప్రజలు తిరగబడతారు, ఉగ్ర నారసింహులై ప్రతాపాన్ని చూపిస్తారనడానికి నిదర్శనమిది.

**ఉద్యమించిన తెలంగాణం ఉత్సహించిన తెలంగాణం**
**ఎల్ల లెరుగని దోపిడీలకు కొల్లగొట్టిన ప్రాణనిధులకు**
**రగిలిపోయిన తెలంగాణం రగులుతున్నది తెలంగాణం**
**ఇప్పుడిక ఒకటే నినాదం ఎదలనే కదిలించు వేదం**
**తెలంగాణం ! తెలంగాణం !**
**తెలంగాణం మాకు ప్రాణం ! ('ఆక్రీ ధక్కా' పుట సంఖ్య 24.)**

అంటూ తెలంగాణ ప్రజల ఆశ, శ్వాస స్వరాష్ట్రాన్ని సాధించు కోవడమే. తెలంగాణ దోపిడిని అడ్డుకొని, ఆత్మగౌరవాన్ని నిలుపుకోవడమే ధ్యేయంగా ఒకటే నినాదమై, ఎదలను కదిలించు వేదమై తెలంగాణ ప్రజల ఉద్యమావేశ గేయమై ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన కవి డా॥ అయాచితం నటేశ్వర శర్మ.

**"మన భాష యాసదనిరి – మన సంస్కృతి నీచమనిరి**
**మన సంపదలనుమాత్రం సంచులలో నింపుకొనిరి**
**కలిసి సాగుదాం అందరం – అలసి పోని పోరు చేస్తూ**
**తెలంగాణ వచ్చువరకు తెగించి పోట్లాడుదాం"**
**'ఆక్రీ ధక్కా' పుట సంఖ్య 24.**

అని పదమై కదం తొక్కిన కవి సిరిగాద శంకర్. తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగడుతూ, ఉద్యమ చైతన్యాన్ని అందించిన పాట ఇది.

**"నాలుగు కోట్ల తెలంగాణ – మాటొక్కటె బాటొక్కటె**
**అరవయేండ్ల ఆరాటం – తెలంగాణ పోరాటం**
**ప్రతి ఒక్కరి గొంతులోన – పోరు పాట పాడుతుంది"**
**'ఆక్రీ ధక్కా' పుట సంఖ్య 27**

నాలుగు కోట్ల ప్రజల మాట, బాట, పాట అంతేకాదు, అరవయేండ్ల ఆరాటం, పోరాటం తెలంగాణ ఉద్యమం అని పల్లవించిన కవి ఐండ్ల రాము. ప్రతి ఒక్కరి గొంతులో 'తెలంగాణ పోరు' పాట పాడుతుందంటాడు.

కొందరు ఉద్యమ చైతన్య పాటలు రాస్తే, మరికొందరు ఉద్యమా నికి స్ఫూర్తిగా నిలిచిన వారిని తలచు కొంటూ పాటలు రాసారు.

**"అన్యాయం ఎదురించే , కాళోజి కలం మాట**
**ఉద్యమాల దారిలో , సాగిపోయే హోరు పాట**
**గుండె పగిలితె , కడుపు మండితె కాళోజీ నీ మాట"**
**'పోరు వీరుల యాదిలో' పుట సంఖ్య 3.**

అని కాళోజి గారిని కలవరిస్తారు సిరిసిల్ల గఫూర్ శిక్షక్. మరో పాటలో ఇలా జయశంకరు సార్‌ని యాదిజేస్తరు.

**"ప్రొఫెసర్ జయశంకర జోహారులూ....2**
**అవమానపు జ్వాలల్లో నీ జ్ఞానం మెరిసిందీ**
**తెలంగాణ సిద్ధాంతం నీ గళమున మోగిందీ**
**వీరుల ఏకం చేసి నినాదమై లేచింది**
**మన భవితకు బాట వేసి మార్గమునె చూపింది ॥ ప్రొఫెసర్ ॥"**
**'పోరు వీరుల యాదిలో' పుట సంఖ్య 4**

"నాటి నిజాం రాజుల కాలం నుండి, ఆంధ్ర వలసపాలకుల దాకా ఇంకా ఎన్నాళ్ళు ఈ దోపిడి , ఇంకెన్నేండ్లు పరాయి పాలనలో నలుగుడు. ఇక వద్దు, అమ్మా! తెలంగాణ తల్లీ! నీ కోసం ఉద్యమిస్తాం నీకు నీకు విముక్తిని కలిగిస్తాం. అందుకోసం ఒక్కటవుతం. నీ కీర్తిని నిలవెడుతం అని తెలంగాణ తల్లికి మాట ఇచ్చిన పాట బందరబోయిన శ్రీనివాస్‌ది.

**"నాటి నుండి నేటి వరకు ఎన్నాళ్ళు ఈ బతుకు**
**పరాయి పాలన విముక్తి చేసి నిన్ను మురిపిస్తం**
**అందుకు మేమిక ఒకటవుతం**
**నీ కీర్తిని నిలబెడుతం**
**అదే కదా మా లక్ష్యం**
**నీ కన్నుల నిజ స్వప్నం**
**కనుకనె నే కలం పట్టి రాస్తాను కవిత**
**నీ లోగిట జయకేతన గీతాలాపనకై – 2"**
**'ఒకటే మాట తెలంగాణ' పుట సంఖ్య 77**

ఇలా ఎంతోమంది కవులు తెలంగాణ ఉద్యమ సమయంలో పాటలు అల్లినవారున్నారు. ఉద్యమంలో పాల్గొని ప్రత్యక్షంగా పాడినవారూ ఉన్నారు. ఆత్మగౌరవ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు వారి వారి పాటలను అంకితం చేసి ధన్యుల మయినమని పొంగిపోయిన వారున్నారంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

గ్రంథాంతరంగం
08

# అలంకార తత్త్వవిచారము


శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

పైలా పచ్చీసు వయస్సులో కురుగంటి సీతారామయ్య గారు (1889– 1959) మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల సంస్కృత బి.ఏ. (ఆనర్సు) విద్యార్థిగా 1915లో 'అలంకార తత్త్వ విచారము' అన్న 97 పేజీల విమర్శనాకృతిని వెలయించారు. ఆపుస్తకంలో ఆరున్నర పేజీల 'సంపాదకీయ భూమిక'తో పాటు 79 పేజీల అలంకారతత్త్వవివేచన వుంది. ఇందులో జక్కన కవి విరచితమైన 'విక్రమార్క చరిత్రము' గురించి 16 పుటల విమర్శనాత్మక వ్యాసాన్ని కూడా సారస్వత ప్రియులు చూడొచ్చు. కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వతత్త్వ విచారము' (1914) లో 'అలంకారములనావశ్యకములు' (పేజి: 26–27, 1973 ముద్రణ) అను శీర్షిక కింద రెడ్డిగారు చెప్పిన విషయాన్ని ఖండిస్తూ కురుగంటివారు తమ 'అలంకారతత్త్వవిచారము'ను రచించారు. మైసూరు మహారాజా కాలేజి ప్రిన్సిపాలుగా పనిచేస్తున్న రామలింగారెడ్డి గారి కొన్ని అభిప్రాయాల్ని తీవ్రంగా వ్యతిరేకించి 79 పేజీల పుస్తకాన్నే రాసిన యువకుడైన కురుగంటి సీతారామయ్య గారి ధైర్యసాహసాలు మెచ్చదగ్గవే. ఆరున్నర పేజీలు 'సంపాదకీయ భూమిక'ను రాసిన ఘనత కూడా కురుగంటివారికే చెల్లుతుందని విశ్వసించవచ్చు.

'సంపాదకీయ భూమిక' చివర్లో 'సంపాదకులు' అని వుంది కాని ఎవరి పేరూ పేర్కొనబడలేదు. ఈ పుస్తకాన్ని కురుగంటి సీతారామయ్య గారు తమ తల్లిగారికే అంకితమివ్వడం మూలానా 'సంపాదకీయ భూమిక' రాసినది కురుగంటి వారే అని నమ్మవచ్చు. ఈ సంపాదకీయంలోని భాష, వివేచనలు 'అలంకారతత్త్వవిచారము' కర్తయైన కురుగంటి వారివే అనడంలో సందేహం లేదు.

'ఆంధ్రకవితావిమర్శన గ్రంథమాలిక'లోని తొలిపువ్వు వింజమూరి రంగాచార్యులవారి 'పింగళి సూరనార్యుడు' (1914) గురించి ప్రసిద్ధ పరిశోధకులు డా. యస్. వి. రామారావు గారు 'తెలుగులో సాహిత్య విమర్శ' (1989, ద్వితీయ ముద్రణలో) సుమారు రెండుపేజీల్లో చర్చించారు. కాని కురుగంటి సీతారామయ్య గారి 'అలంకారతత్త్వవిచారము' ను సమీక్షించ లేకపోవడం దురదృష్టకరం. తెలుగు సాహిత్య విమర్శనా పథాన్ని ప్రశస్తం చేసిన కట్టమంచిలాంటి ప్రఖర, ప్రగల్భ శేముషీధురంధరునికి రొమ్ము ఎదురొడ్డి నిలిచిన యువ కిశోరమైన కురుగంటి సీతారామయ్య గారి 'అలంకారతత్త్వవిచారము' గురించి లోతుగా వివేచించిన విమర్శకులెవ్వరూ లేకపోవడం విచారకరం.

కురుగంటి సీతారామయ్య గారి 'అలంకారతత్త్వవిచారము' గురించి సమ కాలంలో ఎవరెవరు ప్రతిక్రియలు వెలువరించారో తెలియదు. కాని, కట్టమంచి రామలింగారెడ్డిగారు మాత్రం ఇలా అభిప్రాయం వెలిబుచ్చారట. 1956 నవంబరు 1న ఆంధ్రప్రభ దినపత్రికలో శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు 'కట్టమంచి వారి వైలక్షణ్యం' అన్న చక్కని వ్యాసం ప్రకటించారు. దీన్లోని కొన్ని పంక్తు లీ విధంగా వున్నాయి– "భారత రచన మీద ఎంత గౌరవమో అంత అసహ్యం తరువాతి ప్రబంధ రచనలో ఆయనకు, ఆ భావం 'కవిత్వ తత్త్వవిచారం' లో నిరర్గళంగా వెలువడింది. దాన్ని విమర్శిస్తే ఒక్కరు – అక్కిరాజు ఉమాకాంతంగారు అనుకుంటాను – "పొగడడం గాని తెగడడం గాని ఈ గ్రంథకర్త ఇంకా


ఆంధ్రకవితావిమర్శన గ్రంథమాలిక. 2.

49

అలంకారతత్త్వవిచారము.

గ్రంథకర్త

కురుగంటి సీతారామయ్య

1915

నేర్చుకోవలసిన విద్య" – (అర్థమిది మాటలు నావి) అని నిష్కర్షగా వ్రాసిరి. అది చదివి **"చాలా మంచి విమర్శనం వచ్చిందయ్యా. నీవూ చదువు"** అన్నారు నాతో రెడ్డి!

సత్యమో, అసత్యమో, తోచిన మాట నిస్సంకోచంగా తన వంటి వానిని గూర్చి చెప్పగల ధీరుడు తెలుగు వారిలో ఒక్కడున్నాడు గదా అనే ఆయన వీరతృప్తి! **"నీవు వట్టి ద్విజుడవై పోవద్దయ్యా! కొంతైనా వీర ధర్మాన్ని సంపాదించుకొని బతుకు"** అనేది నాకాయన చేసిన ఉపదేశాలలో ఒకటి. తన అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించిన వారిని ఆయన చూపినంత ఉదార హృదయంతో ఆదరించే వారరుదు. అంటే అది తప్పు వొప్పుకున్నట్టు గాదు. మరి ఇతరుని స్వతంత్రాన్ని, ధైర్యాన్ని మెచ్చుకోవడం." (రాళ్ళపల్లి సాహిత్య సంగీత వ్యాసాలు– కట్టమంచి వారి వైలక్షణ్యం – పేజి: 17. 2017. ఎమెస్కో బుక్స్)

కట్టమంచి వారి 'కవిత్వతత్త్వవిచారము'ను విమర్శించిన సాహసి కురుగంటి సీతారామయ్య గారే కాని అక్కిరాజు ఉమాకాంతం గారు కాదు. 1915లో కట్టమంచి – రాళ్ళపల్లివారల మధ్య జరిగిన సంభాషణను 41 ఏళ్ల తర్వాత జ్ఞప్తికి తెచ్చుకొన్నప్పుడు రెడ్డిగారిని విమర్శించిన వ్యక్తిగా అక్కిరాజు ఉమాకాంతంగారిని పేర్కొనడంలో పొరపడ్డం సహజమే. ఎందుకంటారా అక్కిరాజుగారు భావకవిత్వాన్ని 1926–28 కాలవ్యవధిలో తీవ్రంగా విమర్శించారే కాని 'కవిత్వతత్త్వ విచారము' ను కాదు. పైగా ఉమాకాంతం గారి 'నేటికాలపుకవిత్వం' వెలువడింది 1928లో కదా! అప్పుడు కట్టమంచి – రాళ్ళపల్లి వారల మధ్య ఈ సాహిత్య చర్చ జరిగేందుకు అవకాశం చాలా తక్కువ. 1928 లో కట్టమంచివారు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఉపాధ్యక్షులుగా బెజవాడలో, రాళ్లపల్లివారు మహారాజా కళాశాల తెలుగు పండితులుగా మైసూరులో వుండేవారు. అలంకారతత్త్వవిచారము' వెలువడ్డ (1915) కాలంలో గురుశిష్యులిద్దరూ మైసూరులోనే ఒకే కళాశాలలో వుద్యోగం చేస్తూ వుండేవారుగా. కట్టమంచి వారి 'కవిత్వతత్త్వవిచారము' ను విమర్శించిన ధీరుడు 'అలంకారతత్త్వవిచారము' ను రాసిన కురుగంటి సీతారామయ్య గారే అని నిశ్చయంగా చెప్పవచ్చు.

శ్రీ కురుగంటి సీతారామయ్య కట్టమంచి రామలింగారెడ్డి గారి పేరు చెప్పకుండా రాసిన వాక్యాలివి "ఉపమాద్యలంకారములు కొన్ని నిత్యమెల్లడల నుపయోగింపబడుచునే యున్నవి. అలంకారము లనావశ్యకములని చెప్పిన యొక యాంధ్ర విమర్శకుడు మిగిలిన వారి నుపేక్ష చేసినను కాళిదాసుని సాదృశ్యకల్పనలకు మాత్రము బహుమానము నొసగి యున్నాడు. సామాన్య సంభాషణముననే కొన్ని యలంకారములు స్వభావసిద్ధముగ నుపయోగింపబడుచుండ రస పోషణమున కయి వ్రాయబడు కావ్యములలో నుపయోగింపకూడదని పిచ్చివాడు గాని యనడు" (అలంకారతత్త్వవిచారము. పేజి: 51, 52) కురుగంటి వారి ఈ విమర్శకు కారణభూతమైన కట్టమంచి వారి ప్రకటనమిది "అలంకారముల నావశ్యకములు మన కావ్యము లలో నుపమాద్యర్థా లంకారములును, ననుప్రాసాది శబ్దాలంకారము లును దఱచుగ నుపయోగింపబడి యుండుట, యెల్లరకు దెలిసిన సంగతియ. అందు శబ్దాలంకారము లంతగా ముఖ్యములు గావనుట యందరు నొప్పుకొందురు. గాన వాని మాట ప్రస్తుతమటుండ నిత్తము. అలంకారములలో ప్రధానమైనవి యుపమోత్ ప్రేక్షాదులు. వీనికి మూలభూతమైన ధర్మ మేదనగా ప్రకృత వస్తువునకు మఱేదో యొక వస్తువునకు నామ, రూప, స్వభావాదులం బట్టి సామ్యము గల్పించెడు శక్తి పోలికలను స్థాపించుట సొగసైన కార్యమేయైనను కవితకు ఖండితముగా నుండవలసిన లక్షణము కాదు... కావున కథాంశము సాక్షాత్తుగా సమీపమున నడిచినట్లు భావనాశక్తి బలంబుచే స్ఫురించె నేని దూరపు సంబంధము గల బలాత్కృతాలంకారములకు దావుండదు. సాదృశ్యములలో గొన్ని సహజములును అనివార్యము లును. అవి తమంతటన, యే ప్రయాసమును లేక వచ్చిన యెడ గథా సందర్భముతో గలసి మెలసి యుండును...అయ్యవి ప్రయత్నము లేకయ వచ్చినంత సహజముగ నుండుట, కథలోని స్త్రీ పురుషులు మాటాడునపుడు పాత్రోచితములైన కొన్నింటి మాత్రముపయోగిం చుట, కవియే వర్ణించినపుడొకింత యెక్కువగ నలంకారములు వాడినను దోషము లేదు. కాని భావములు మహోజ్జ్వలములుగ రేగునపుడు ప్రకృతము నందే యవధానము నింపుట మంచిది. అట్టి తరుణముల నలంకారములు సాధారణముగ నసంబద్ధ ప్రలాపములు." (పేజి: 26–27 కవిత్వతత్త్వవిచారము ఐదవ ముద్రణ, 1973)

యువకులైన, కురుగంటి సీతారామయ్యగారు కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వతత్త్వవిచారము' లో 'అలంకారము లనావశ్యకములు' అనే శీర్షిక కింద చెప్పబడ్డ అభిప్రాయాల్ని శ్రద్ధగా చదివి, లోతుగా ఆలోచింప లేదనవచ్చును. అందుకే కాబోలు ఆయన కట్టమంచివారి మీద అంతగా విరుచుకుపడ్డారు. రెడ్డిగారు "అందు శబ్దాలంకారము లంతగా ముఖ్యములు గావనుట యందరు నొప్పు కొందురు." (పేజి:26. కవిత్వతత్త్వవిచారము) అన్న కట్టమంచి వారి అభిప్రాయం సమర్థనీయమైనా, 'అలంకారము లనావశ్యకములు' అన్న శీర్షిక సార్థకమైనదికాదు. అది అనవసరముగా అపార్థాలకూ, అనుచితమైన భేదాభిప్రాయాలకూ దారి తీసిందని చెప్పొచ్చు. కట్టమంచివారు శబ్దాలంకారాలు అంతగా ముఖ్యం కాదన్న మాటను అందరు వొప్పుకొంటారని అన్నారు. కాని శబ్దాలంకారాలు అనావశ్యకాలు అని అనలేదు. అలాగే అర్థాలంకారాలు కూడా అనవసరమైనవి అని ఎక్కడా అనలేదు. ఆయన అర్థవంతమైన, ఔచిత్య శోభితాలైన శబ్దాలంకారాలను ఎప్పుడూ కాదనలేదు. రెడ్డిగారు అర్థాలంకాలకు పెద్దపీట వేసి, శబ్దాలంకారాలకు గౌణస్థాన మిచ్చారు అంతే. కురుగంటి వారు శబ్దాలంకారాలు కొంత ముఖ్యమైనవన్న కట్టమంచి వారి అభిప్రాయంతో ఏకీభవిస్తూ అవి "కొంత ముఖ్యములే కాదు. కొన్ని శబ్దాలంకారములు మాత్రము కొన్ని సందర్భంబుల రసస్ఫూర్తి తప్పక చేయును. అవి లేకున్న వచ్చినంత రసము రానేరదు." (పేజి: 22 అలంకారతత్త్వ విచారము) అంటూ పోతన మహాకవి "కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ" పద్యంలోని లాటానుప్రాస సౌందర్యాన్ని విప్పిచెప్పారు. "కాని ఇట్టిచోట్ల శబ్దాలంకారములుపయోగించుట కూడదనుట సరియా?"(పేజి: 22) అని ప్రశ్నించారు. రెడ్డిగారు, కవిత సౌందర్యాన్ని పెంచే శబ్దాలంకారాల్ని ఎక్కడా అనావశ్యకాలని

అనలేదే? సీతారామయ్య గారు కట్టమంచి వారికి శబ్దాలంకారాల పట్ల దురభిప్రాయం లేదనీ, సదభిప్రాయమే వుందనీ గుర్తించడంలో పొరబడటం చింతించాల్సిన సంగతే మరి.

కురుగంటివారు అయ్యలరాజు రామభద్రకవి విరచితమైన 'రామాభ్యుదయము' లోని

**"గిరులం దరులన్ జరులన్**
**మరులన్ గురుతరుల మరలన్ మరలన్ నెమకున్**
**విరివిరి పొదలన్ రొదలన్**
**బొరిబొరిగను విను విముక్తి బొరలుం దొరలున్" (పేజి: 23)**

పద్యంలో ధ్వన్యనుకరణం రసోత్పత్తికి కారణమయిందన్నారు. పైగా ఇది సందర్భోచితంగా వుందన్నారు. కాదన్న వారెవ్వరు? ఇంతకీ కురుగంటివారు అయ్యలరాజు రామభద్రకవిగారి 'రామాభ్యు దయము' సంగతి ఎందుకు ప్రస్తావించారా అంటే మనం మళ్లీ కట్టమంచివారి 'కవిత్వతత్త్వవిచారము' కథ ఎత్తుకోవాల్సిందే. "అయ్యలరాజు రామ భద్రుడను కవి తన రామాభ్యుదయములో రామ వనవాస ఘట్టమున దశరథుడు 'నానార్థరత్నమాల'ను ఎదుట నుంచుకొని పుటలు ద్రిప్పుచు నేర్చినాడో' యనునట్లు దరిద్రము పట్టిన శ్లేషాలంకారములు పెట్టి

**సీ. "కానక కన్న సంతానంబు గావున**
**గానక కన్న సంతాన మయ్యె**
**నరయ గోత్ర నిధానమై తోచు గావున**
**నరయ గోత్ర నిధానమయ్యె నీడు**
**.........**
**తే. గటకటా! దాశరథి సముత్కట కరీంద్ర**
**కట కలిత దాన ధారార్ద్ర కటక మార్గ**
**గామి, యెట్లు చరించు నుత్కట కరీంద్ర**
**కటకలిత దాన ధారార్ద్ర కటక తటుల"**

ఇత్యాది రీతుల బ్రలాపించినట్లు వ్రాసియున్నాడు." (పేజి: 30-31. కవిత్వతత్త్వ విచారము) రామభద్రకవి ప్రయోగించిన శ్లేషాలంకారం కాని, రాయదుర్గం చేంతాడు లాంటి దీర్ఘ సమాసాలు కాని శోకరసాన్ని కలిగించలేకపోయామని రెడ్డిగారి అభిప్రాయం. పైగా కట్టమంచివారు కవిని ఇలా ఎత్తి పొడుస్తారు. **"శోక రసము వర్ణించునపుడును రామభద్రునకు శ్లేషలు, సాంస్కృతిక దీర్ఘ సమాసములును విడరాని చీడలాయెగా!"** (పేజి: 31) అయ్యలరాజు రామభద్రుడు ప్రయోగించిన శ్లేష, సుదీర్ఘ సమాసాలు రసపోషణకు ఉత్ప్రేరకాలు కాలేదన్న కట్టమంచి వారి మాటల్ని సహేతుకంగా, సోపపత్తికంగా కురుగంటివారు ఖండింపలేకపోయ్యారు. పైగా **"రామాభ్యుదయంబున శ్లేషాద్యలంకారములు మిక్కుటముగ నుండి యసహ్యము గలిగించుచున్నవని యాధునికాంధ్ర విమర్శకులు కొందఱభిప్రాయ పడినను, అందుననే రత్నములు కూడా నున్నవని చెప్ప సాహసించుచున్నాను."** (పేజి: 23 అలంకారతత్త్వవిచారము) సీతారామయ్య గారి ఈ మాటల్లో రామలింగారెడ్డి గారి అభిప్రాయానికి తగిన సమాధానం లేకపోవడం గమనించాల్సిన విషయం.



కురుగంటి సీతారామయ్య గారు

అలంకారాల ఆవశ్యకతను సమర్థిస్తూ **'అలంకారము లనావశ్యకములు'** అను శీర్షికను ఆధారంగా చేసుకొని కట్టమంచి వారిని పదేపదే ఆక్షేపించడం సరికాదు.

సీతారామయ్య గారి ఈ మాటలు వారి తొందరపాటును పాఠకులు మరిచిపోదామన్నా మరిచి పోనివ్వవు- **"ఆధునికాంధ్ర విమర్శకులలో నొక పిచ్చి యభిప్రాయము కలదు. అర్థాలంకారము లెచ్చటనైన నుపయోగింపవచ్చును గాని శబ్దాలంకారములు బొత్తుగ నుపయోగార్హ ములు కానే కావట. చూచిన నీయభిప్రాయమునకు చోటులేదు... వాస్తవమాలోచించిన రెండు తరగతులు నొకే విధముగ యావశ్యకములు. శబ్దాలంకార ముల దిట్టుట నాగరికత కొక లక్షణము గాబోలు! పాపమని యొనర్చిన దుష్కృతమేమి? అలంకార పదమున నవి కూడ చేరియుండ లేదా? అవి కూడ సందర్భోచితంబులుగ రసమునకు స్థానములు కాలేదా? అట్టి యభిప్రాయము కేవలము ప్రమాద జనితము. సందర్భోచితములు కాకపోయినను ప్రశ్నమున కవకాశము లేదు. అట్టి పిచ్చి యభిప్రాయ మును గలిగి యుండుట కాంగ్ల కవిత్వ పఠనమే కారణమైన దత్పఠనము సన్మార్గముల బ్రవర్తింప లేదని చెప్పవలసినదె."** (పేజి: 72-73. అలంకారతత్త్వవిచారము).

కట్టమంచివారి మాటల్ని సరిగ్గా అర్థము చేసుకోకుండ కురుగంటి వారు తొందరపడి మాట జారటం, రానురానూ పలుసార్లు ప్రస్తావించటం వారి సన్నబుద్ధిని తెలియ చేస్తుంది. రామలింగారెడ్డి గారు తమ నవీన ఆలోచనల్ని ఘాటైన మాటల్లో ప్రకటిస్తే, కురుగంటి వారు మరింత తీక్షణంగా దూకుడుగా, దురవగాహనతో మాట్లాడారు.

ఆవేశంలో, ఆగ్రహంలో కురుగంటి వారు కట్టమంచి వారికంటె 'అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న' అన్న సామెతను చరితార్థం చేస్తారు. ఇంతకీ కురుగంటి సీతారామయ్య గారి 'అలంకారతత్త్వ విచారము' నిర్వహించిన చారిత్రక భూమిక ఏమిటో మనం తప్పక తెలుసుకోవాలి. 20వ శతాబపు ప్రారంభపు రెండు, మూడు దశాబ్దాల కాలం తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనం మొగ్గ తొడుగుతున్న సమయం. ఆధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలు రూపుదిద్దుకొంటున్న దశలో ప్రెసిడెన్సీ కళాశాల విద్యార్థులు కొందరు తెలుగు సాహిత్య విమర్శను సంపన్నం చేయాలనే సదుద్దేశ్యంతో 'ఆంధ్రకవితా విమర్శన గ్రంథమాలిక' ను స్థాపించారు. వాళ్ళు ప్రాచీన సంస్కృత కావ్యశాస్త్ర సిద్ధాంతాల గొడుగు నీడలో ప్రధానంగానూ, పాశ్చాత్య కావ్యశాస్త్ర సంప్రదాయాల్ని అవగాహన చేసుకొని పాతకొత్తల మేలుకలయికగా ఆధునిక ఆంధ్ర సాహిత్య విమర్శనను రూపొందించాలని కంకణ బద్ధులయ్యారు.

'కవిత్వతత్త్వవిచారము' గ్రంథకర్త కట్టమంచి రామలింగారెడ్డి గారిని గురి చేసుకొని రాయబడ్డ 'అలంకారతత్త్వవిచారము'లోని 'సంపాదకీయ భూమిక' లోని ఈ వాక్యాలు నాటి నవ యువకుల సాహిత్య విమర్శనా రూపురేఖల్ని చాలావరకు ఇలా తెలియచేస్తాయి– "విమర్శన మతిస్తుతి గాని, యతి దూషణముగాని కానేరదు. దూషణ భూషణ తిరస్కారముల కందుచోటు లేదు. ఒక మహాకవి నాదర్శముగ దీసికొని మిగిలిన యందఱిని వానితో బోల్చ మొదలిడినపు డా దూషణాదులకు జోటుండును. కాని నిజమైన విమర్శన మదికాదు. కేవలాంగ్ల వ్మాయ విమర్శనా నియమములు మన యాంధ్ర వ్మాయమును విమర్శించుటలో పనికిరావు. కేవల పూర్వ విమర్శనా నియమములు ప్రస్తుత కాలమునకు దగవు. కావున రెండు విధముల నియమములను సమ్మేళనము చేసి సంప్రదాయములు చెడకుండ విమర్శనమును సాగింపవలయు. ఇపుడు ప్రచురింపబడుచున్న విమర్శనములు పూర్తిగ సంప్రదాయ నిరసనమును చేయుచున్నవి. అట్లు చేయగూడదు. సంప్రదాయ నిరసనము విమర్శనమును పెడత్రోవల కీడ్చుకొని పోవును. దానిచే భాషకు హాని కలుగును. కావున విమర్శనము సరియైన త్రోవల నడుపవలయు. ఆ త్రోవల జూపుటకై యీ గ్రంథమాలిక యేర్పరుప బడినది. ఒకవేళ నట్టి మార్గముల జూపలేక పోయిన పోవుదము గాక : కాని యాత్రోవను ప్రయత్నము లొనర్చిన వారమగుదుము. అది కూడా భాషాసేవయే యని నమ్ముచున్నాము. విమర్శనా నియమములు చర్చ వలన గాని స్థిరపడవు. ఆ చర్చను మొదలిడుటయే మా యుద్దేశము." (పేజి: V, Vi. అలంకారతత్త్వవిచారము).


కురుగంటి సీతారామయ్యగారు తమ 'అలంకారతత్త్వవిచారము' లో దండి, భామహుడు, వామనుడు, కుంతకుడు, ఆనందవర్ధనుడు, విశ్వనాథుడు, జగన్నాథ పండితరాయలు మొదలైన లాక్షణికులు 'కావ్యము'నకు ఇచ్చిన నిర్వచనాల్ని చర్చించారు. కవి సర్వతంత్ర స్వతంత్రుడని, నియమాలకు అతీతుడని సీతారామయ్య గారి అభిప్రాయం. కవి నేలవిడిచి సాము చేసినా, అతని కావ్యం సహృదయులకు గ్రాహ్యమవుతుందన్న విషయాన్ని ఆయన చర్చించలేదు. కవిత్వాన్ని విమర్శించేటప్పుడు విమర్శకుని కవిపట్ల 'సానుభూతి' తప్పనిసరిగా వుండాలన్న కురుగంటివారి అభిమతం మాత్రం శిరోధార్యం (పేజి: 3). విమర్శకుడు "....విమర్శనా ఖడ్గము చేబూని యిచ్చ వచ్చినట్టు లుపయోగించిన మన నియమముల ననుసరించి వ్రాయగల కవి ప్రపంచంబున గానరాడు." (పేజి: 3) అన్న మాటలుమాత్రం తలకెత్తుకో దగ్గవి కావు. ధ్వని, రసములకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. కురుగంటి సీతారామయ్య గారు భారతీయ కావ్యశాస్త్రాల్ని అనుసరించారే కాని వాటికే పూర్తిగా కట్టుబడలేదు. విమర్శకుని బరువు, బాధ్యతల్ని చర్చిస్తూ పాశ్చాత్య విమర్శకులైన కార్లైల్, మోల్టన్, సెయింట్స్ బరీల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొన్నారు. "కావున విమర్శకుడు 'కవిహృదయ' ప్రవేశ మొనర్చి యందలి యత్యుదాత్త భావముల బ్రపంచమునకు దెలియజేయు చుండుటకు నియమింపబడి యున్నాడు. ఇది మంచి, ఇది సెబ్బర, ఇది బాగుగ నుండలేదు, ఇది బాగుగ నున్నది, ఇచ్చోట కవి పొరపాటొనరించెను మొదలగు స్వాభిప్రాయ ప్రకటనము విమర్శక కృత్యము కాదు. విమర్శకున కభిప్రాయ మొసగుట కధికారము లేదని యాధునికాంగ్ల విమర్శకుల యభిప్రాయమై యున్నది." (పేజి: 11). కురుగంటి వారు విమర్శకుని కర్తవ్యానికి పరిమిత పరిధులున్నా యని విశ్వసించడం విచారణీయం. సీతారామయ్య గారు సంస్కృత కావ్యశాస్త్రాలు విధించిన లక్షణాల్ని తెలుగు కావ్యాలకు అన్వయించ డం బాగుంది. కాని పాశ్చాత్య లాక్షణికులు, విమర్శకులు పాటించిన కావ్యాస్వాద విధానాల్ని, కావ్య ప్రయోజనాల్ని పరిశీలించి, సముచితమైన వాటిని తెలుగు సాహిత్య విమర్శనలో అనుసరించడం తప్పేమీ కాదు గదా.

కురుగంటి వారు భారతీయ కావ్య సంప్రదాయాల్ని అనుసరించిన విమర్శకులే. కాని సందర్భానుసారంగా పాశ్చాత్య కావ్య సంప్రదాయాన్ని కూడా గౌరవించి తమ విమర్శను కొనసాగించారు.

సీతారామయ్యగారు కవిత్వ లక్షణాల గురించి (పేజి: 17) కవి స్వాతంత్ర్యం గురించి (పేజి: 10) విమర్శకుని లక్షణాలు, కర్తవ్యం గురించి (పేజి: 11) కావ్య పఠనోద్దేశ్యం గురించి (పేజి: 50) పాశ్చాత్య విమర్శకులు అభిప్రాయాలతో ఏకీభవించారు. సాహిత్యాభివృద్ధికి విమర్శ అవసరమని విశ్వసించారు (పేజి: 38).

కావ్యంలో అలంకారాలు ఆవశ్యకమే అన్న అంశంపై 79 పేజీల పుస్తకాన్నే రాసిన ప్రతిభాశాలి కురుగంటి సీతారామయ్య గారు. పైలా పచ్చీసు వయస్సులో తెలుగు కావ్య సంప్రదాయం, పాశ్చాత్య సాహిత్య సంప్రదాయాల మధ్య డోలాయమాన స్థితిలో చిక్కుకొన్న కుశాగ్రబుద్ధి. ఒకవైపు ఆంగ్ల సాహిత్య అధ్యయనాన్ని పొగడుతూ, మరో వైపు ఆంగ్ల భాషా కోవిదులైన తెలుగు విమర్శకుల్ని అహేతుకంగా తెగుడుతూ తమ 'అలంకారతత్త్వవిచారము' రచించారు. పాశ్చాత్య సాహిత్య విమర్శ 1914 –20 కాలావధిలో తెలుగు సాహిత్య విమర్శ పురోగమనానికి దోహదం చేసిన మాట వాస్తవం. కాని కురుగంటి వారు సంకుచిత దృష్టితో ''సామాన్యముగ జ్ఞానవృద్ధి ననుసరించి స్వభాషాభిమానము వర్ధిల్లును. అదేమి పాపమొ యాంధ్ర భారతి దురదృష్ట వశమున మన యాంధ్ర విమర్శకుల కాంగ్ల భాషా విమర్శనా పాండిత్యముచే స్వభాషపై నొక విధమైన యసహ్యత గలుగుచున్న దని చెప్పవచ్చును. అది మంచి లక్షణం కాదు. స్వభాషాసేవ స్వదేశ భక్తికి ముఖ్యాంగము. భాషను నిరసించు వాడు దేశబహిష్కారమున కర్హుడు" (పేజి: 77) ఇలాంటి పరుషోక్తులు పలకడం సమర్థనీయమే కాదు. కానేకాదు.

కురుగంటి సీతారామయ్యగారి 'అలంకారతత్త్వవిచారము' (1915) అప్పుడప్పుడే తలఎత్తుతున్న తెలుగు సాహిత్య విమర్శకు తార్కాణం గ్రంథకర్త లోతైన అధ్యయనం, చూపైన పరిశీలన, స్పష్టమైన రచనాశైలి ప్రశంసనీయాలు. నేటి మన విమర్శకులు ఈ అమూల్య విమర్శ గ్రంథాన్ని చదివి, కొన్ని పాఠాలైన నేర్చుకొని ముందుకు నడవాల్సి వుంటుంది.





# తలపులు

నీ తలపుల వలలో ఇరుక్కున్న పక్షిని
రెక్కలు రెపరెపలాడించినా ఎగరలేని స్థితి
గతం గంగిరెద్దు తలలా ఊగుతుంది
మనసు ముంద విన్యాసాలు చేస్తోంది
ఎంత వద్దని దులుపేసుకున్నా
తగిలిన దెబ్బల బర్రలు మానవు
యాదులు ఎతల్లె బోసుకుంటూనే ఉంటాయి

సుఖాలు ముసుగు తన్ని సుఖనిద్ర పోవచ్చు
వడి పెట్టి పిండిన కష్టాలు
కళ్ళ కల్లంలో ఆరబోసుకుంటాయి
తలపుల దుస్తులు ఎన్నిసార్లు తొడుక్కున్నా
చిరిగిన బట్టలు కావు

మన కలయిక చెట్టు నల్లుకున్న తీగ కాదు
ఒక క్షేత్రంలో రెండు చెట్లు కలిసి విస్తరించడం
కనిపించని వేర్లు భూమిలో పెనవేసుకుంటాయి
బయట వేర్వేరు రూపాలం
కొమ్మ విరిచినట్లు, మంద నరికినట్లు
ఎవరికి గాయమైనా కన్నీళ్లు ఇద్దరివి
చెదిరిపోయిన కలల బాధ ఇద్దరిదే

ఎవరు ఎవరికి దూరమైనా
తలపుల వల ఉచ్చు బిగిసుకుంటోంది
సహించలేని వేదన పురుగై తొలుస్తుంది
ఎదురుచూపులు ఎసరులా మరుగుతాయి



**కొమురవెల్లి అంజయ్య**
సిద్ధిపేట, ఫోన్ : 9848005676

# వరంగల్ జిల్లా - గ్రామ నామాలు

**కోర్గు సత్యనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9177664447

కాకతీయుల రాజధానిగా, ఏకశిలా నగరంగా, ఓరుగల్లుగా ప్రసిద్ధి కెక్కిన నేటి ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 1100 పైగా గ్రామాలున్నాయి. చారిత్రకంగా, సాంస్కృతికంగా ఎంతో వైభవోపేతమైన జిల్లా ఇది. వేరు వేరు రాజన్యుల ఏలుబడిలో ఎన్నో దేవాలయాలు నిర్మింపబడినాయి. ఎందరో గొప్ప కవులు ఇక్కడ జన్మించారు. ఎన్నో చెరువులు, సముద్రాల పేర్లతో నిర్మింపబడినాయి. ఎంతో జానపద, గిరిజన కళాసంపద కూడా ఇక్కడ నిక్షిప్తమైంది. ఈ జిల్లాలోని గ్రామనామాల్లో ఆ యా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి ప్రతిబింబిస్తుంది. కొన్ని గ్రామ నామాల మార్పులను ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

**మట్టెవాడ** మట్టెవాడ పూర్వం కాకతీయుల రాజధానికి ముఖ్యమైన అంగళ్లస్థానము. మటియ (సంత) – అంటే క్రయ విక్రయాదులకు తేబడిన సరుకులు.

అట్టి సరుకులుండే చోటు మటియవాడు. అదే నేటికీ మట్టెవాడగా పిలువబడుచున్నది. ఇది వ్యాపార స్థలం. స్థానిక వ్యాపారులు అచట శ్రీ వీరభద్రేశ్వర దేవుని ప్రతిష్ఠించి, ఆలయం కట్టించి, దాని నిర్వహణార్థం, మటియలో వ్యాపారం చేసేందుకై వచ్చి పోయే సరుకులపై కొంత చందాలు నిర్ణయించారు. దీనికి గణపతి దేవుని అనుమతి పొందారు. (వరంగల్ జిల్లా సర్వస్వము – డా॥ గుంజి వెంకటరత్న పుట : 161)

**హనుమకొండ (రాష్ట్రకూటుల) :** జైనారామం గల కొండయగుటచే ఈ నగరాన్ని ఆరామకొండ లేక అర్మకొండయని పిలిచేవారు. బయ్యారం శాసనంలోని కథనం ప్రకారం కాకతి మొదటి బేతరాజు అనుమడు, కొండడు అనే నాయకులను జయించి అనుమకొండకు రాజైనట్లు తెల్పుతుంది. ఆరామకొండ – అర్మకొండగా – అమ్మకొండ – అన్మకొండ – అనుమకొండ – హనుమకొండగా మారొచ్చు గాని కాకతీయులు శైవులయినప్పటి నుండి దీన్ని అన్మకొండ అని పిలుచుట ప్రారంభమైనట్లు తెలుస్తుంది. దర్గాశాసనంతో దీన్ని అన్మకొండ అని పేర్కొన్నారు. కాని అర్మకుణ్ణయని కూడా కొన్ని శాసనాలలో కన్పిస్తున్నది. చివరకు అన్మకొండ అను పేరు స్థిరపడింది.

**కొండపర్తి :** పొలమెయరట్టోడి అనే స్థానికాధికారి మంచికాళు కొడుకైన కొణ్ణపకు చెరి సమానముగ పాలికి సేద్యము చేయునట్లు ఏర్పాటు చేసిన భూమి యిది అట్లని తాంబూల స్వీకారము చేయబడును.

కూన్తుకున్తుల అంటే బిడ్డబిడ్డ తరమున వరువదివడ్డి అంటే వ్యవసాయ పర్వదినమునాడు చెల్లించు పన్ను చెల్లించి సేద్యము (ఏటేటా) ఆరంభం చేయువారు.

భూమిలో సేద్యమునకు దిగునపుడు ముందుగ భూస్వామికి కొంత చెల్లించవలెను. పంట వచ్చిన తర్వాత అదికొంత చెల్లించవలెను. పూర్వం యిట్టి విధానం నిర్ణయము చేసుకొనునపుడు కూడ అందుకు సంబంధించిన వారు తాంబూల గ్రహణము చేసి తామా నిర్ణయము నకు కట్టుబడి యుందుమని అంగీకరించుట ఇది ఆయా పక్షముల వారెవ్వరు తప్పకూడదని కట్టడి (విజ్ఞాన సర్వస్వం – పుట. 167)

**మాటొడు :** మాటొడు గ్రామాన్ని పూర్వం మాటూరు అని వ్యవహరించేవారు. ఈ ప్రాంతంలో అంతకు పూర్వమే వందల ఎకరాల విస్తీర్ణంలో త్రవ్వించిన మైలసముద్రమనే పేరుగల చెరువుంది. చెరువు కింద ప్రవహించే నీరు ఒక చోట నిలువ ఉండే మడుగులాంటి దాన్ని “మాటు” అనడం తెలంగాణ పల్లెలో ఉంది. ఇలా ఏర్పడిన మాటుకు సమీపంలో ఉన్న గ్రామం కాబట్టి ఈ ఊరికి మాటేడు, మాటూరు అని వ్యవహారంలోకి వచ్చి ఉండవచ్చు. ఇక్కడ దేవాలయ నిర్మాణానికి సమకూరిన ద్రవ్యంలో మిగిలిన దానిని చెరువులా మధ్యలో భూనిక్షిప్తంచేశారని స్థానికులు చెబుతున్నారు. అందుకే చెరువు మధ్యలో ఎత్తుగా ఉన్న ప్రదేశాన్ని నేటికి ‘ధనపుడ్డ’గా పిలుస్తున్నారు.

**డోర్నకల్ :** ప్రస్తుత గార్ల మండలం మర్రిగూడెం, బుద్ధారం గ్రామ పంచాయతీల శివారులోని వేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కాకతీయ చక్రవర్తుల పరిపాలనా కాలంలో బ్రహ్మోత్సవాలు మహావైభవంగా జరిగేవి. ఈ బ్రహ్మోత్సవాలకు మర్రిగూడెం బుద్ధారం గ్రామాలను కలుపుతూ మామిడి తోరణాలు కట్టేవారట. ఈ తోరణాలకు సరిపడా మామిడాకులను ఈ రెండు గ్రామాల మధ్యలో ఉన్న మామిడి తోటలో నుంచి తెచ్చేవారు. తోరణాలకు సరిపడా ఆకులు లభించే ప్రాంతం కాబట్టి ఈ ప్రదేశాన్ని ‘తోరణాకుల’ అనిపిలిచేవారు. కాలక్రమేణా అక్కడ ఉన్న ఆ గ్రామం పేరే తోరణాకులగా కానీ, లేదా ఆ ప్రదేశంలో కొత్తగా ఒక ఊరు వెలసి దానికి ‘తోరణాకుల’గా గానీ పేరొచ్చి ఉండొచ్చు. అది కాస్త తోరణాకుల – డోరణాకుల – దోరణకాలు – దొరణకల్లు అయి ఉ ంటుంది. ఈ పేరు ఇంగ్లీషు వ్యవహారంలో ‘ద’, ‘డ’గా మారి డోర్నకల్లుగా స్థిరపడి ఉండవచ్చు.

**బయ్యారం :** కాకతీయ చక్రవర్తులలో సుప్రసిద్ధుడయిన గణపతిదేవ చక్రవర్తి చెల్లెలు మైలాంబ. ఆమె తన తల్లి బయ్యాలదేవి

పేర నిర్మించిన గ్రామం ఈ బయ్యారం. 750 సం॥రాలకు పైగా చరిత్ర ఉన్న గ్రామం.

**గీసుకొండ :** అతి ప్రాచీన చరిత్ర కల్గిన గ్రామం. వరంగల్‌కి 10 కి.మీ. దూరంలో ఉంది. గ్రీకులు ఇక్కడ స్థావరాలు ఏర్పాటు చేసి వర్తక వాణిజ్యాలు సాగించారని ఇక్కడ దొరకని గాంధార శిల్ప కళను పోలినట్టి బొమ్మలు లభ్యంగా కావడాన్ని బట్టి తెలుస్తుంది. గ్రీకు దేశస్థుల స్థావరమే నేటి గీసుకొండగా మారింది.

గ్రీకుకొండ – గ్రీసుకొండ – గీసుకొండ.

**అన్నారం షరీఫ్ :** పర్వతగిరి మండలంలో గలదు అన్నవరం కాలక్రమంలో అన్నారంగా మారింది. ఇక్కడ పూజలందుకుంటున్న యాకూబ్ ప్రావలీ గురించి కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. ఈయన మదీనాలో వ్యాపారవేత్త. ఇతని చెల్లెలు మహబూబి, సోదరులు హజరత్ గుంపాప్రవలి, హజరత్ భోలేప్రావలి యాకూబ్ పాప్రవలి సహజంగా దయార్ద్ర హృదయం గలవాడు. ఆధ్యాత్మిక చింతన కూడా అధికం. వ్యాపారంలో సంపాదించిన ధనాన్ని పేదలకు సహాయం చేసేవాడు. కొంతకాలం తర్వాత అప్పుల పాలైనాడు. మదీనా నుండి సోదరితో కలిసి భారతదేశం పారిపోయివచ్చాడు. అయినా అప్పులిచ్చిన వాళ్ళు వెంటాడుతుండడంతో యాకూబ్ పాప్రవలి అన్నారం ప్రాంతం చేరి అక్కడి చెరువు తూములో దాక్కున్నాడు. అక్కడే పాప్రవలి జీవసమాధి అయిందు. అప్పటి నుండి ఆ ప్రాంతంలో యాకూబ్ పాప్రవలి దర్గా వెలసింది. సోదరి, సోదరులు కూడా అక్కడే జీవసమాధి అయినారు. వారి సమాదులు కూడా అక్కడే ఉన్నాయి.

హిందూ, ముస్లింలు కలిసి పాల్గొనే పవిత్రక్షేత్రం అన్నారం షరీఫ్. ఇక్కడి మొక్కుబడుల్లో కందూరు ముఖ్యమైంది.

**కుందారం :** గణపతిదేవుని చెల్లులు. కాకతీయుల ఆడపడుచు కుందమాంబ పేరుతో వెలిసిన ఈ గ్రామం అసలు పేరు వేములతోట. కుందమాంబకి వివాహ సమయంలో పసుపు కుంకుమల కింద ఇచ్చిన గ్రామం కుందారం.

**కొడవటంచ :** రేగొండ మండలం గిరిజనులైన చెంచులు కొడవటి అంచులతో అడవిని నరికి నిర్మించుకున్న గ్రామం కాబట్టి దీనికి కొడవటంచ అని పేరు తర్వాత కాలంలో ఇది కోటంచగా మారింది.

ఉగ్రనరసింహుని రౌద్రం తగ్గించేందుకు లక్ష్మీదేవి చెంచులక్ష్మిగా అవతరించడం తెలిసిందే. ఇదే కథ ఇక్కడ ఆలయానికి మూలంగా ప్రచారంలో ఉంది. చెంచులక్ష్మి చెంచుల ఆడపడుచు చెంచులక్ష్మి సమేతుడైన నరసింహుడుగా ఇక్కడ వెలిశారు.

**కొమ్మాల :** కొమ్మాల కొండనే పాండువుల గుట్ట, పాండవులబోదు అని పిలుస్తారు. (పర్కాల వద్ద మరో పాండవుగల గుట్ట ఉన్నది). పాండవులు పూర్వం ఇక్కడ తపస్సు చేశారట. పాండవులు స్వామి వారికి తోమాల పూజ గావించి ధన్యులైనారట. ఆ కారణంగా తోమాల అనంతర కాలంలో కోమాల, కోమ్మాలగా మారి గ్రామమైయింది. కొమ్మాల జాతర వరంగల్ జిల్లాలోనే ప్రశస్తమైన జాతర.

**ధర్మారావు పేట :** ఖానాపూర్ మండలం నిజాముల కాలంలో క్రీ॥శ॥ 1830 ప్రాంతంలో చెన్నారావుపేట దేశముఖ్ అయిన ధర్మారావు 1200 ఎకరాల భూస్వామి. నిజాముల కర్కశపాలనకు ఎదురొడ్డి పేదలకు అండగా నిల్వడంతో ధర్మారావు పట్ల సాటి దేశముఖ్‌లు ధ్వజమెత్తారు. కాళీభక్తుడు, పేదలపట్ల దయాదాక్షిణ్యాలు గల ధర్మారావు వారిని లెక్కచేయక పేదరైతులకు, రైతుకూలీలకు బాసటగా నిలిచాడు. తద్వారా నిజాంకు శత్రువైనాడు నిజాంకు వ్యతిరేకంగా పేద ప్రజల అండతో పోరాటం సాగించాడు. చివరకు ఆత్మకూరు దేశ్‌ముఖ్ సాయంతో నిజాం సైన్యం కాళీపూజలో ఉన్న ధర్మారావును చంపింది. పేదల పాలిట పెన్నిధి అయిన ధర్మారావు త్యాగానికి గుర్తుగా ధర్మారావు పేటగా ఆ ఊరు గుర్తింపు పొందింది.

**ఖిలాషాపూర్ :** రఘునాథపల్లి మండలం, సర్దార్ పాపన్న షాపూరు గ్రామంలో ఒక ఖిలా (కోట) నిర్మించాడు. అప్పటి నుండి ఈ గ్రామం ఖిలాషాపూర్‌గా చారిత్రక ప్రసిద్ధి పొందింది. క్రీ.శ. 1680–1710 ప్రాంతంలో పాపన్న అనే తెలుగువీరుడు విజృంభించి వరంగల్ పరిసర ప్రాంతాలనే గాక, ఏడు రోజులపాటు గోలకొండనే పాలించినట్లు కథలు ఉన్నాయి. షాపురం కేంద్రంగా పాలన జరగడంతో ఇక్కడ శత్రుదుర్భేద్యమైన ఖిలాను నిర్మించుకున్నాడు. అనాటి స్థల దుర్గాల్లో ఇది ప్రసిద్ధమైంది.

**గణపురం :** 'ఘనపురం' అని నేడు పిలువబడుతున్న ఈ గ్రామ ప్రాచీన నామం 'గణపురము'. గణపతి దేవ చక్రవర్తి కాలంలో, ఆయన పేర నిర్మించబడినది కనక గణపురము అనే పేరు వచ్చింది. ఇక్కడ అనేక ఆలయాలు కట్టించినట్లు ఏకామ్రనాథుని 'ప్రతాపచరిత్ర' లో కన్పిస్తుంది.

**జాఫర్‌గడ్ / వేల్పుగొండ :** పూర్వం వేల్పుగొండగా పిలువబడ్డ ప్రాంతం నేడు జఫర్‌గడ్‌గా ప్రసిద్ధి, వరంగల్‌కు 30–35 కి.మీ. దూరం. నిజాముల పాలనలో 'జాఫర్ ఉద్దౌలా' ఈ పాంపాలకుడుగా ఉన్నప్పుడు ఇక్కడ ఒక ఖిలా నిర్మించాడు. అప్పటి నుండి జాఫర్‌గడ్‌గా ప్రసిద్ధి.

ఈ విధంగా ఎన్నో ప్రాంతాలకు సంబంధించిన చరిత్ర ఈ జిల్లాకు ఉంది. ఈ విధంగా గ్రామనామాల ద్వారా పూర్వ చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**


**వరంగల్ జిల్లా సర్వస్వం గంజి వెంకటరత్నం)**

**తెలంగాణ చరిత్ర సుంకిరెడ్డి నారాయణ రెడ్డి**

**ఆంధ్రప్రదేశ్ సాహిత్య చరిత్ర – మాడపాటి హనుమంతరావు**

# ఆదర్శ మాతృమూర్తి – మదాలస

**వేల్పుల శ్రీలత,** అధ్యాపకులు, ఇందిరాప్రియదర్శిని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, ఫోన్ : 6300 912 801




భారతీయులపై పురాణ సాహిత్యం యొక్క ప్రభావం ఉన్నంతగా ఏ సాహిత్యం లేదనడంలో సందేహం లేదు. పురాణం అంటేనే ప్రాచీనమైనదని అర్థం. పురాణాలు 18. ఇవి వ్యాస రచితాలు. ఏ విషయాలు వేదాలలో సూచించబడినాయో ఆ విషయాలను పురాణాలు విస్తారంగా వివరించడం జరిగింది. పురాణాలు వేదాల ప్రామాణికతను ఎక్కువగా వివరించాయి. ఈ అష్టాదశ పురాణాలలో మార్కండేయ పురాణం ఒకటి. మార్కండేయ మహర్షి వ్రాయటం వలన దీనికి మార్కండేయ పురాణం అని చెప్పబడింది. ఈ మార్కండేయ పురాణంలో అనేక విషయాలు చెప్పబడినాయి. జైమిని ధర్మపక్షుల సంవాదం, బలరామ వృత్తాంతం, ఉప పాండవుల జనన మరణాల కారణాలు, మదాలస తన కుమారులకు ఆత్మ జ్ఞానాన్ని కల్గించుట మొదలైన అనేక అంశాలు దీనిలో ప్రస్తావించారు.

మార్కండేయ పురాణంలో అంతర్గతంగా ఉన్న చరిత్ర మాతృమూర్తి మదాలస చరిత్ర. ఈమె ఋతుధ్వజుని భార్య, గంధర్వ కాంత. తల్లిదండ్రులు హరిణీ విశ్వావసువులు. మదాలస పరమ సాధ్వి, సౌందర్య రాశి, భర్తయందు అమితానురాగం కలది. పుత్ర సంతానాన్ని పొందిన ఈమె తన బిడ్డలు మరలా గర్భనరకం అనుభవించకూడదని తలచింది. అందువల్ల మదాలస జ్ఞానమూర్తిగా, ఆదర్శ మాతృమూర్తిగా దర్శనమిస్తుంది. ఆమె ఎందరో తల్లులకు స్ఫూర్తి ప్రదాత, ఆదర్శమూర్తి.

ఈనాటికీ పిల్లలకు పేర్లు పెట్టే విషయంలో తల్లిదండ్రులు ఎంతో తాపత్రయాన్ని కనబరుస్తారు. అది అందరికీ తెలిసిందే. అదేవిధంగా కువలయాశ్వుడు తన కుమరునికి 'విక్రాంతుడు' అనే పేరు పెట్టాడు. అది విన్న మదాలస నవ్వుతుంది. బాలుణ్ణి ఊయల ఊపుతూ జోలపాడే నెపంతో నీవు ఎందుకు ఏడుస్తున్నావు కుమారా! ఈ దేహం శాశ్వతం కాదు, దీని మీద వ్యామోహం ఉండకూడదు.. దీనికి నీకు ఏ సంబంధం లేదు అంటూ తనకు వీలైనప్పుడల్లా కుమారునికి ఆత్మ ప్రబోధం చేస్తుంటుంది. తరువాత రెండవ కుమారునికి మదాలస జన్మనివ్వడం, అతనికి రాజు 'సుబాహుడు' అని పేరుపెట్టడం, అందుకు మదాలస నవ్వడం, వానికి ఆమె అనేక విధాలుగా చిన్ననాటి నుండే ఆటలాడించే నెపంతో ఆత్మజ్ఞానాన్ని కల్గించే అనేక అంశాలను బోధిస్తుంది. కొంత కాలానికి మూడవ కుమారునికి మదాలస జన్మనివ్వడం, వానికి రాజు 'అరి మర్ధనుడు' అని పేరు పెట్టడం, మదాలస నవ్వి మూడవ కుమారునికి కూడా అదేవిధంగా ఆత్మజ్ఞానాన్ని బోధించడం జరుగుతుంది. అనంతరం కొంతకాలానికి నాల్గవ కుమారునికి జన్మనిస్తుంది. కువలయాశ్వుడు నాల్గవ కుమారునికి సరియైన పేరును నిర్ణయించమని మదాలసను కోరుతాడు. ముగ్గురు పిల్లలకు పేర్లు పెట్టిన ప్రతిసారీ మదాలస నవ్వటం గమనించి ఈసారి పుత్రునికి పేరుపెట్టే అవకాశం మదాలసకే ఇచ్చాడు. అప్పుడు మదాలస నాల్గవ కుమారునికి 'అలర్కుడు' అని పేరు పెట్టింది. అలర్క శబ్దానికి 'వెలికుక్క' అనే అర్థం ఉంది. ఆ పేరు విని రాజు అసహ్య పడి ఈ పేరు పెట్టడంలో నీ ఉద్దేశ్యం ఏమిటని అడుగగా మదాలస అందుకు బదులుగా 'మహారాజా! వ్యవహారం కొరకు మాత్రమే పేర్లు. ఒక రకంగా చూస్తే మీరు పెట్టిన పేర్లు కూడా నిరర్థకాలే. అది చెపుతాను వినండి. మొదటి కుమారునికి 'విక్రాంతుడు' అని పేరు పెట్టారు. క్రాంతి అంటే ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి పోవునది. అదేవిధంగా విశేషంగా పోవువాడు అని అర్థం. మని ఆత్మకు విక్రాంతుడు అనే పేరు తగదు కదా! రెండవ కుమారునికి పేరు 'సుబాహువు' అని పేరు పెట్టారు. అది కూడా నిరర్థకమే. ఎందుకంటే నిరాకారునికి బాహువులు ఎక్కడ? పురుషునికి ఆకార వికారాలు లేవు. ఇక మూడవ కుమారునికి 'అరి మర్ధనుడు' అని నామకరణం చేశారు. అది కూడా నిరర్థకమే. ఎందుకంటే సర్వ శరీరాలలో ఉన్న ఆత్మ ఒకటే. అట్టి ఆత్మకు శత్రువులు ఎవరు? మిత్రులు ఎవరు? కనుక పేర్లు వ్యవహారం కోసం మాత్రమే. కనుక అన్నీ నిరర్థకాలే. ఇక 'అలర్కుడు' అన్న పేరు పెడితే మాత్రం వచ్చిన నష్టం ఏమున్నది. ఆత్మజ్ఞానం లేనివాడు వెర్రి పనులు చేస్తాడు కనుక వాని పేరు 'వెర్రి కుక్క' అని పిలిచినా నష్టం లేదు. కావున ఆత్మజ్ఞానం పొందని జన్మ నిరర్థకమని భావించి అలర్కునికి ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించే ప్రయత్నం చేయగా మహారాజు వారించి మిగిలిన ముగ్గురు కుమారుల లాగా ఇతనికి కూడా రాజ్యంపై విరక్తి కలిగితే ఇక వారసత్వం నిలువదు అని తెలుపుతాడు.

మదాలస భర్త మాటను అంగీకరించి తన నాల్గవ కుమారుడైన 'అలర్కుడి'కి ఆటపాటలను నేర్పుతూ ధర్మ మార్గాన్ని ఉపదేశిస్తుంటుంది. అలర్కుడు పెద్దవాడయ్యాడు. అలర్కుడు తల్లి వద్దకు వచ్చి తల్లీ! ఇహపర లోకాలు రెండింటి యందు హితాన్ని కలిగించే కర్మలను గూర్చి చెప్పమని, ప్రజాపాలనం చేసి కూడా ముక్తిని పొందే మార్గాలను చెప్పమని ప్రశ్నిస్తాడు. అప్పుడు "వత్సా! పట్టాభిషిక్తుడగు రాజుకు ప్రజారంజకంగా పాలనం చేయడమే ప్రథమ కర్తవ్యం.

వ్యసనాలు త్యజించాలి. రాజుకు తన పర భేదాలు లేకుండటం, రహస్యాలను కాపాడటం, శత్రువులను శిక్షించడం ప్రధాన కర్తవ్యం. రాజు ఎప్పుడూ కామవశుడు కాకూడదు. అరిషడ్వర్గాలను జయించాలి. చాలామంది ఈ అరిషడ్వర్గాలకు లోనై నశించినారు. పాండురాజు కామవశమున మరణించినాడు. పురూరవుడు భయము చేత నశించెను. వేనుడు మదము వలన ద్విజులచే చంపబడినాడు. అనాయుష్యుని పుత్రుడు గర్వం చేత నశించినాడు. ఈవిధంగా అరిషడ్వర్గాలకు లోబడినవారు అనేక రకాలుగా నశిస్తారు. మరుత్తు మహారాజు కామాదులను జయించి లోకాన్ని అవలీలగా జయించినాడు. కనుక ఈ ఆరు శత్రువులను దరిచేయనీయ రాదు. అంతేకాకుండా జంతువుల నుండి పక్షుల నుండి కూడా మనం గ్రహించవలసింది ఉంటుంది అని తెలియజేస్తూ కాకి నుండి అప్రమత్తంగా వుండడం నేర్చుకోవాలని, పాము స్వల్ప విషంతో ప్రాణాలు హరించునట్లు రాజు స్వల్ప సైన్యం చేతనైనా శత్రుసైన్యాన్ని నాశనం చేయాలి.

నెమలి పింఛాన్ని విస్తరింపజేసినట్లుగా రాజు తన సంపదలను విస్తరింపజేయాలి. కోడిలాగా సమయాన్ని పాటించాలి. గుడ్లగూబ లాగా నిశ్శబ్దంగా శత్రునాశనం చేయాలి. లోహం లాగా సమయానుసారంగా కాఠిన్యం ప్రదర్శించాలి. అంతేకాకుండా సూర్య చంద్రులు తామున్న ప్రదేశం నుండి తమ కిరణాలను వ్యాపింప జేయునట్లు రాజు తన అధికారాన్ని వ్యాపింపజేయాలి. రాజు తన ప్రజల నుండి పన్నులు వారికి బాధ కలుగని రీతిలో గ్రహించాలి. వాయువు సర్వ సంచారి అయినట్లుగా రాజు రాజ్యంలోని రహస్యాలను తెలుసుకోవాలి. చెడు మార్గంలో సంచరించే వారిని సన్మార్గానికి మరలించిన రాజు స్వర్గాన్ని పొందుతాడు. ప్రజలందరూ స్వధర్మ పాలన చేయునట్లుగా చూడడం రాజు యొక్క విధి అని రాజుకు ఉండాల్సిన లక్షణాలను మరియు పాలకులు పాటించాల్సిన ధర్మాలను తెలియజేసింది. అప్పుడు అలర్కుడు తల్లితో నాకు వర్ణ ధర్మాలు మరియు ఆశ్రమ ధర్మాలను తెలియజేయవలసింది కోరినాడు.

మదాలస పుత్రునితో కుమారా! క్షత్రియులకు దానం, అధ్యయనం, యజ్ఞం చేయడం అను ధర్మాలు ముఖ్యమైనవి. ప్రజలను రక్షించడం మరియు శస్త్ర విద్యను అభ్యసించడం అనేవి అతి ముఖ్యంగా చెప్పబడినది. ఇక వర్ణాశ్రమ ధర్మాలు 1. బ్రహ్మచర్య 2. గృహస్థ 3. వాన ప్రస్థ 4. సన్న్యాస ధర్మాలు. ఇవి పాటించవలసిన ధర్మాలు. బ్రాహ్మణులకు ఉపనయనం కానంతవరకు ఆశ్రమ ధర్మ పాలనం లేదు కాని ఉపనయనం అయినంతనే బ్రహ్మచర్యాశ్రమంలో ప్రవేశించును. అతడు గురు కులంలో ప్రవేశించుని గురు శుశ్రూష చేసి అధ్యయనాన్ని చేస్తారు. గురువు అనుగ్రహంతో విద్యలను సంపాదిస్తారు. బ్రహ్మచర్యం నుండి గృహస్థాశ్రమం ప్రవేశించే బ్రహ్మచారి తనకు అనుకూలవతి అయిన కన్యను వివాహమాడి గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటించాల్సి ఉంటుంది. గృహస్థాశ్రమంలో భక్తితో తల్లిదండ్రులను, దేవతలను, అతిథులను సేవించాలి. ఆశ్రితులను, దీనులను, పతితులను ఆదుకోవాలి. దేవతా గణాలకు, పితృగణాలకు, భృత్యులకు భుజింపచేసిన పిమ్మట మిగిలిన శేషమును గృహస్థు భుజించాలి. అతిథి సత్కారాన్ని గృహస్థు ఆచరించాలి.


గృహస్థు సంతానార్థియై భార్యా సంగమం చేయాలి. గృహస్థు జీవులందరి పోషణను చూడవలసి ఉంది. గృహస్థుని ఆశ్రయించుకొని ఇతర మానవులు, దేవతలు, భూతములు, క్రిమికీటకాదులు, పశు పక్ష్యాదులు ఆధారపడి ఉన్నాయి. మదాలస ఈ విధంగా గృహస్థ ధర్మాలను పుత్రునికి ఉపదేశిస్తూ వత్సా! పితృదేవతలకు ప్రీతి కలుగునట్లుగా తర్పణాలు చేయాలి. సమస్త విధి విధానాలతో వారికి సమర్పించాల్సినవి సమర్పించాలి. బ్రాహ్మణులకు, యోగులకు భోజనం పెట్టాలి. కుమారా! పితరులకు తృప్తి కలిగిస్తే ఆయుష్షు, సంతానం, ధనం, విద్య, సుఖం, మోక్షం లభిస్తాయి. కాబట్టి గృహస్థుడైన వాడు దేవతలను, పితరులను, అతిథులను, బంధువులను, సేవకులను, పశుపక్ష్యాదులను పూజించాలి. ఈ విధంగా మదాలస రాజధర్మాలు, గృహస్థాశ్రమ ధర్మాలను ఉపదేశించింది. అనంతరం అలర్కుడు తల్లితో ఏ సదాచారం పాటించడం వల్ల మానవుడు ఇహపరలోకాలందు సుఖాలను పొందగలడో ఉపదేశించమని కోరినాడు.

అప్పుడు మదాలస కుమారునితో వత్సా! సదాచారములు పాటించడం వల్ల ధర్మార్థ కామ మోక్షములను సాధించాలి. పురుషుడు తాను సంపాదించిన దానియందు నాల్గవ భావాన్ని పరలోకంలో దానధర్మాల కోసం వెచ్చించాలి. సగభాగాన్ని తన కుటుంబ పోషణ నిమిత్తం ఖర్చుచేయవలయును, మిగిలిన నాల్గవ భాగం దాచి ఉంచాలి. అంతేకాకుండా ప్రతిదినం సూర్యోదయం కంటే ముందుగానే బ్రహ్మముహూర్తంలో శయ్యపై నుండి లేవాలి. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సంధ్యావందనం చేయాలి. సంధ్యను ఉపాసించేవారు దూషించరాదు, అసత్యమాడరాదు, కర్కశంగా మాట్లాడరాదు. అంతేకాకుండా ఆరోగ్యానికి సంబంధించిన ఆహారాన్ని ఎన్నుకొని భుజించాలి. పాచి అన్నం, విరిగిన పాలతో చేసిన పదార్థాలు భుజించరాదు. నూనెతో కూడి ఎక్కువ కాలంగా ఉన్న అన్నాన్ని భుజింపరాదని తెలియజేసింది. ఇలా అన్ని కాలాలకు కూడా పనికివచ్చే ఎన్నో అంశాలను మదాలస తన కుమారునికి తెలియజేసింది. అనంతర కాలంలో మదాలస కుమారుని పట్టాభిషిక్తుని చేసి భర్తతో వానప్రస్థానికి వెళ్తూ అలర్కునికి ఒక ఉంగరం ఇచ్చి సుఖ భోగాలు శాశ్వతాలు కావని, నీకు అయిన వారి ద్వారా దుఃఖం కలిగినప్పుడు ఇందులో ఉన్న చీటిని తీసి చదవమని చెప్పి తన భర్త కువలయాశ్వునితో అడవులకు ప్రయాణమైంది.

అనంతర కాలంలో తన సోదరుడైన సుబాహు వల్ల రాజ్యాన్ని కోల్పోయి దుఃఖితుడై తల్లి చెప్పిన మాట జ్ఞాపకం వచ్చి అంగుళీకంలో ఉన్న శాసనాన్ని చదివి తన తల్లి మనసు గ్రహించి దుఃఖానికి మూలమైన కోరికలను, సుఖాలను విడనాడి సజ్జన సాంగత్యం వల్లనే తన దుఃఖం నశిస్తుందని తెలుసుకొని దత్తాత్రేయుని శరణు కోరుకున్నాడు.. అనంతరం ఆత్మజ్ఞానాన్ని పొందడం జరిగింది. ఈ విధంగా మదాలస తన కుమారులను గర్భనరకంలో ప్రవేశించకుండా వుండేందుకు ఎంతగానో తాపత్రయపడింది. అందువల్ల మదాలస ఆదర్శ మాతృమూర్తి. స్ఫూర్తి ప్రదాత. చివరి కుమారునికి ఉపదేశించిన ధర్మాలు సార్వకాలీనమైనవి, అన్ని వేళలా ఆమోదయోగ్యాలు.

ఈ విధంగా మదాలస అలర్కునికి కల్గిన అనేక సందేహాలకు సమాధానాలు చెప్పి మంచి రాజుగా, ప్రజలను కన్నబిడ్డలుగా చూసేందుకు ఉపయుక్తమైన ఎన్నో విషయాలను ఉపదేశించి మంచి రాజుగానే కాకుండా, అనంతరం రాజ్యాన్ని కూడా త్యజించగలిగే స్థాయికి వచ్చేందుకు అనుకూలంగా ఆమె చేసిన ఉపదేశం ఉపయోగ పడింది. కుమారుల ఉన్నతికి కారణమైంది. అందుకే ఆమె ఆదర్శ మాతృమూర్తి అనడంలో సందేహం లేదు. ఆమె స్ఫూర్తితో మరెందరో ఆదర్శమూర్తులు కావాలి.

## సత్సంగం



### జ్ఞాని దృష్టిలో ప్రపంచము

ఉన్నదల్లా ఆత్మే. ఇంకేదీ కాదు. అజ్ఞానం వల్ల అది మూడు విధాలుగా కనబడుతుంది.

1. తమ వంటిదాని వలనే 2. వేరు విధంగా 3. తమలో భాగంగా... ప్రపంచం తన ఆత్మవంటి వేరొక ఆత్మ కాదు. ఆత్మకి వేరు కాదు. ఆత్మలో భాగం కాదు.

జ్ఞానికి కలలు వస్తాయి. కాని అవి కలలేనని తెలుస్తుందతనికి. మెలకువగా ఉన్నప్పుడు కూడా అదీ ఒక కలేనని భావించినట్టే అదీను. కావాలంటే వాటిని ఒకటో కల, రెండో కల అని అనవచ్చు. జ్ఞాని నాలుగవ అవసర్థలో ఉంటాడు. అదే తురీయావస్థలో. అంటే పరమ సత్యంలో సంస్థితమవుతాడు. మెలకువ, స్వప్నం, సుషుప్తి అవసర్థలని ఏ స్పందనా, రాగమూ లేకుండా చూస్తూంటాడు. దానిపై కదిలే బొమ్మల లాగా. మెళకువ, కల, నిద్ర అవస్థలని అనుభవించేవారికి. ఈ మూడింటికీ ఆవల ఉన్న స్థితిని తురీయ అవస్థ అని అంటారు. ఇది మెళకువగా ఉండే నిద్ర. దానినే నాల్గవ అవస్థ అని కూడా అంటారు. కాని వాస్తవానికి, ఉండేది తురీయావస్థే. మిగిలిన మూడూ ఉన్నట్టే అనిపించినా అవి లేవు. అందువల్ల తురీయావస్థే తురీయాతీతమైన అవస్థ కూడా. (అంటే, నాల్గవ అవస్థకి అతీతమైనది.)

జ్ఞానికి మూడు అవస్థలూ అసత్యాలే. కాని, అజ్ఞానికి అది అర్థం కాదు. అతనికి మెళకువగా ఉన్న స్థితే ప్రమాణం కనుక. జ్ఞానికో, సత్యానికి ప్రమాణం సత్యమే. శుద్ధ చైతన్యం యొక్క ఈ సత్యం – శాశ్వతం. అందువల్ల మూడు అవస్థలలోనూ సమానంగా ఎప్పుడూ ఉంటుంది. ఆ సత్యంలో ఏకమైన వానికి మనస్సు లేదు. ఆ మూడు అవస్థలూ లేదు. అందువల్ల అతనికి అంతర్ముఖమవటం కాని, బహిర్వర్తనవటం గాని ఉ ఒడవు. అతను ఆత్మనే ఎప్పుడూ ఎరిగి ఉంటాడు కాబట్టి. అతను ఎప్పుడూ మెలకువగానే ఉన్నట్టే. అతనికి ప్రపంచం మళ్ళీ మళ్ళీ కనబడే కలవంటిదే. అతనెప్పుడూ గాఢనిద్రలో ఉన్నట్టే – దేహమంటూ ఉన్నదన్న ధ్యాసే ఉండదు..

దేహాత్మబుద్ధి జ్ఞానికీ, అజ్ఞానికీ ఉంటుంది. ఎటొచ్చీ అజ్ఞాని ఈ శరీరమే తాననుకుంటాడు. జ్ఞాని మాత్రం ఇదంతా ఆత్మే, బ్రహ్మమే అనుకుంటాడు. నొప్పి ఉంటే ఉండనీ, అది కూడా ఆత్మలో భాగమే. ఆత్మ పరిపూర్ణం.

దేహాత్మ బుద్ధిని దాటిన తరువాతే ఎవరైనా జ్ఞాని అవుతారు. ఆ బుద్ధి లేకపోతతే కర్తృత్వమూ లేదు, కర్తా లేదు. అందువల్ల జ్ఞానికి కర్మ లేదు. (అంటే, ఏ కార్యాలూ చేయడు). అదీ అతని అనుభవం. అది లేకపోతే జ్ఞాని కాడనమాట. కాని, అజ్ఞాని మాత్రం జ్ఞానికి ఒక శరీరానికి పరిమితం చేస్తాడు. జ్ఞాని అట్లా చేసుకోడు. రేడియో పాడుతుంది, మాట్లాడుతుంది. కాని తెరచి చూస్తే దానిలోపల ఎవ్వరూ కనబడరు. ఈ విధంగానే నా ఉనికి కేవలం అంతరిక్షం వంటిది. శరీరం రేడియో వలె మాట్లాడినా, పని చేసేవాడంటూ ఎవ్వరూ లోపల లేరు.

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 19

# కాలాంతకులు

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



**"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు–సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "కాలాంతకులు". శోభన్ బాబు, కైకాల సత్యనారాయణ, జయసుధలు ప్రధాన తారాగణంగా ఈ చిత్రం రూపొందించబడింది. కుటుంబ నేపథ్యంలో సాగే ఈ చిత్రం కె. విశ్వనాథ్ అన్ని చిత్రాల్లోకి పూర్తి వ్యాపారాత్మక శైలిలో నిర్మించబడింది. వ్యాపారాత్మక శైలి అని వాడడానికి కారణం చాలా చిత్రాల్లోని కథల్లో మాదిరి ఏ విధమైన వాణిజ్యాత్మక అంశాలు వుంటాయో, ఈ చిత్రంలో కూడా అలాంటి అంశాల మేళవింపే వుంటుంది.

**చిత్ర కథ :**

రఘు (శోభన్ బాబు), సత్యం (కైకాల సత్యనారాయణ) అన్నదమ్ములు, వారి చెల్లెలు సరోజ. ముగ్గురూ తల్లి పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగి వుంటారు. ఆప్యాయత, అనురాగాలతో సంతృప్తిగా కలిసి జీవించే దిగువ మధ్యతరగతి కుటుంబం వారిది. సత్యం ఆవేశపరుడైతే, రఘు తెలివైన వాడు. వాళ్ళిద్దరూ కూడా కనకారావు (రావుగోపాలరావు) కాఫీ ఎస్టేట్ లో పనిచేస్తూ వుంటారు. కనకారావు పూర్తి వ్యాపారాత్మక వ్యక్తిత్వం కలిగినవాడు. డబ్బే లక్ష్యంగా, స్వార్థమే తన వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణంగా జీవించే వాడు. తను లబ్ది పొందడం కోసం ఎలాంటి ఎత్తులకైనా, ఏ స్థాయి అఘాయిత్యాలకైనా తెగబడడమే కాక తెలివితేటలతో వాటి నుండి బయటపడే నేర్పు గల వ్యక్తి. కనకారావుకు నమ్మిన బంటు బుడుగ రావు (అల్లు రామలింగయ్య). బుడుగు రావు చిత్రంలో హాస్యాన్ని పండించడంతో పాటు కనకారావు చేసే ప్రతి పనికి సాక్ష్యంగా వుంటాడు.

ఆశాలత (జయసుధ) ఆనందరావు కూతురు. ఆశాలత విదేశం నుండి వస్తూ విమానాశ్రయం నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో ఆమె కారు లోయలో పడిపోతుంది. దాంతో కనకారావు ఆశాలత మరణించింది అనుకుంటాడు. కారణం ఆ కారు లోయలో పడేలా చేసిన వ్యక్తి కనకారావే కాబట్టి. ఎందుకంటే కనకారావు అనుభవిస్తున్న ఎస్టేటు, వ్యాపారాలు అన్నీ ఆశాలత తండ్రి ఆనందరావువి అయి వుండడం. ఆనందరావును కిడ్నాప్ చేసి దాచి అతడి ఆస్తులకు యజమానిగా చెలామణి అవుతూ వుంటాడు కనకారావు. స్వదేశం వచ్చిన తర్వాత ఆశాలత ఎక్కడ ఆనందరావును, అతడి ఆస్తులను గురించి అడుగుతుందో అని ఆమెను కారు ప్రమాదానికి గురి చేస్తాడు. కాని ఆశాలత ఆ ప్రమాదం నుండి బయటపడి కనకారావు ఆగడాలు తెల్సుకోవడంతో పాటు తండ్రిని కాపాడుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఆ పథకంలో భాగంగా రఘుతో పరిచయం పెంచుకుని అతడిని తన లక్ష్యాన్ని చేరుకోవడానికి సాధనంగా మార్చుకోవాలి అనుకుంటుంది. అదే క్రమంలో రఘుతో స్నేహం చేసి పల్లెటూరి పిల్లగా నడుచుకుంటుంది. కొంతకాలం తర్వాత రఘు, ఆశాలతల మధ్య గల చనువు ప్రేమగా మారుతుంది.

ఇక రఘు అన్న సత్యం ఆసుపత్రిలో నర్సుగా పనిచేసే కమలతో ప్రేమలో వుంటాడు. మరోవైపు రఘు, సత్యంల చెల్లెలు సరోజ తను చదువుకునే కాలేజీలో ఒక అబ్బాయిని ప్రేమిస్తూ వుంటుంది. ఆ విషయం ఆశాలత ద్వారా రఘు, సత్యం తెలుస్తుంది. ఆ అబ్బాయి కనకారావు కుమారుడు. కనకారావుతో అతడి కుమారుడు తన ప్రేమ గురించి చెప్పి ఆమెనే వివాహం చేసుకుంటానని తెగేసి చెప్తాడు. అతడి నిర్ణయాన్ని అంగీకరించకపోగా ఆస్తులున్న సంబంధాలను చూడడం మొదలుపెడతాడు కనకారావు. మరోవైపు రఘు, సత్యంల తల్లి పుణ్యక్షేత్రాల పేరుతో తరచూ తీర్థయాత్రలకు వెళ్తూ వుంటుంది. కాని ఆమె వెళ్ళేది జైలుశిక్ష అనుభవిస్తున్న తన భర్తను కలిసిరావడానికి. అలా వెళ్ళొస్తున్న సమయంలో ఆమెకు మీనాక్షి తారసపడ్తుంది. మీనాక్షి సత్యం ప్రేయసి అయిన కమల తల్లి. కమల తల్లి మీనాక్షి, రఘు తల్లి వదినా, మరదళ్ళు. ఆ సమయంలో మీనాక్షి, రఘు తల్లికి మధ్య జరిగిన సంభాషణలో మీనాక్షి తనకు జరిగిన అన్యాయం చెప్తుంది. కనకారావు తనను నమ్మించి వశపర్చుకొని మోసం చేయగా కృష్ణారావు కాపాడే ప్రయత్నం చేయబోయాడని ఆ సమయంలో కృష్ణారావును కనకారావు హత్య చేశాడని చెప్తుంది. కృష్ణారావు ఆనందరావు సోదరుడు. గతంలో ఆనందరావు విదేశాల్లో వుంటున్నప్పుడు అతడి ఎస్టేట్ వ్యవహారాలు చూసుకుంటూ వుంటాడు. అదే సమయంలో కనకారావు చేత మోసం కాబడిన తన చెల్లి మీనాక్షికి జరిగిన అన్యాయాన్ని నిలదీయడానికి

సోదరుడు చంద్రశేఖర్ రావు వెళ్తాడు. దాన్ని అదనుగా చేసుకొని కనకారావు కృష్ణారావు హత్యను చంద్రశేఖర్ రావే చేశాడని నెపం మోపి అతడు జైలు శిక్ష అనుభవించేలా చేస్తాడు. ఇక తరచూ పుణ్యక్షేత్రాల పేరుతో రఘు తల్లి వెళ్ళేది చంద్రశేఖర్ రావును కలవడానికే. చంద్రశేఖర్ రావు ఎవరో కాదు రఘు, సత్యంల తండ్రి. చంద్రశేఖర్ రావు గతంలో ఆనందరావు, కృష్ణారావుల వద్ద వారి ఎస్టేట్‌లో నమ్మకస్తుడైన ఉద్యోగిగా పనిచేస్తూ వుంటాడు. అతడి వ్యక్తిత్వం నచ్చి అతడికి వారి చెల్లి అయిన రఘు, సత్యంల తల్లిని ఇచ్చి వివాహం చేస్తారు. కాని చంద్రశేఖర్ రావు తన చెల్లి మీనాక్షి ని మోసం చేసిన కనకారావు ను నిలదీసే సమయంలో కనకారావు పన్నాగం వల్ల కృష్ణారావు హత్య పేరుతో జైలు శిక్షకు గురవుతాడు. మీనాక్షి ద్వారా రఘు, సత్యంలకు కనకారావు చేసిన అన్యాయాలు తెలుస్తాయి. అంతేకాక వారు ప్రేమించిన ఆశాలత, కమలలు తమ స్వంత మనుషులే అని తెలుసుకుంటారు. అంతేకాక కనకారావు తమ కుటుంబానికి చేసిన అన్యాయానికి అతడిపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంటారు.

కనకారావు ఇంట్లోకి రాజా రుద్రప్రతాప్ పేరుతో అత్యంత ధనవంతుడిగా రఘు వెళ్ళగా, పేరు మార్చుకుని ఆశాలత కనకారావు సహాయకుడు బుడగ రావును మోహంలోకి దించి ఆ ఇంట్లోకి వెళుతుంది. మరోవైపు కమల తల్లి మీనాక్షి కనకారావు ను నిలదీయడానికి వెళ్తుంది. ఆ సమయంలో తప్పని పరిస్థితిలో ఆశాలతను, ఆమె తాతను (తాతగా వేషం మార్చుకుని వచ్చిన సత్యం) ఇంట్లోకి ఆహ్వానించే పరిస్థితి కల్పించబడ్తుంది. వెళ్ళిన నాటి నుండే ఆశాలత తన తండ్రిని కనకారావు ఎక్కడ దాచాడో తెలుసుకునేందుకు బుడగ రావును మభ్య పెడుతూ వాడుకుంటుంది. మరోవైపు రఘు, సత్యం లు తన తండ్రిని విడిపించుకుని కనకారావు ను తప్పు ఒప్పుకునేలా చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. రుద్రప్రతాప్ డబ్బుకు ఆశపడి అతడికి సకల మర్యాదలు అందజేస్తూ ఎప్పుడెప్పుడు అతడిని ఆస్తి కాజేయాలా అని సమయం కోసం ఎదురుచూస్తుంటాడు కనకారావు. ఈ అత్యాశతో వుండగానే రుద్రప్రతాప్ (రఘు) తన చెల్లి ప్రేమించిన కనకారావు కుమారుడితో సరోజకు వివాహం జరిపిస్తాడు. కాని జిత్తులు వేయడంలో, అమలు చేయడంలో దిట్ట అయిన కనకారావు తక్కువ సమయంలోనే వారి పథకాన్ని పసిగడతాడు. బుడగ రావు ద్వారా తన తండ్రి ఆచూకీ కనుక్కున్న ఆశాలతను అతడి తండ్రిని కలవకముందే ఆమెను బందీ చేస్తాడు. మరోవైపు తన తండ్రిని నిర్దోషిగా ఋజువు చేయాలంటే కనకారావును తాను చేసిన తప్పులను తానే ఒప్పుకునేలా పరిస్థితులు కల్పించేందుకు రఘు వేసిన పథకాలన్నీ విఫలం అవుతూ వుంటాయి. అంతేకాక రఘు, సత్యం తల్లి, వారి అత్తగారైన మీనాక్షి ఇలా ఒకరి తర్వాత ఒకరు కనకారావు చెరలో బంధించబడతారు. కాని మీనాక్షి సాహసంతో అతడిని హత్య చేయబోతుంది. ఆ సమయంలో మీనాక్షిని ఎదుర్కొంటూ మాటల్లో ఆమెతో తాను చేసిన తప్పులను గురించి యాదృచ్ఛికంగా ప్రస్తావన తెస్తాడు. కాని అతడి దురదృష్టం కొద్దీ ఆ మాటలను రఘు రికార్డర్ లో రికార్డు చేస్తూ వుంటాడు. వాటన్నింటినీ రఘు న్యాయవాది ద్వారా కోర్టుకు తెలియజేస్తాడు. పతాక సన్నివేశంలో రఘు పన్నాగంలో చిక్కుకున్నానని తెలుసుకున్న కనకారావు తన గూండాలచేత వాళ్ళందరినీ చంపే ప్రయత్నం చేస్తాడు. రఘు, సత్యంల వీరోచిత పోరాటం ఫలితంగా వారి కుటుంబాన్ని కాపాడుకుంటారు. రఘు, సత్యంల తండ్రి పాకాల చంద్రశేఖర్ రావు నిర్దోషిగా విడుదల అవుతాడు. కనకారావు కటకటాల పాలవ్వడంతో చిత్రం సమాప్తం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

రఘు, సత్యం పాత్రల్లో శోభన్ బాబు, కైకాల సత్యనారాయణ మల్టీ స్టారర్ చిత్రంలో నటించారు అని చెప్పొచ్చు. ఆశాలత పాత్రలో జయసుధ తండ్రిని కాపాడుకునేందుకు ఒంటరిగా ప్రయత్నం మొదలెట్టడం స్త్రీ పురుష తారతమ్యం లేకుండా జీవితం ఇచ్చే సవాళ్ళకు ఎదురొడ్డి నిలబడాలనే సంకేతాన్ని ఇస్తుంది. రఘు, సత్యంల తల్లి పండరీ బాయి నటన అద్భుతం. రాంపూర్ జైలులో వున్న తన భర్తను చూడడానికై తన కుమారులతో పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నానని అబద్ధం చెప్పి వెళ్ళి భర్తను కలుస్తూ వుండే ఆమె తన భర్త చంద్రశేఖర్ రావు జైలులో వున్నప్పటికీ, అతడిపై ఎన్ని నిందలు వున్నప్పటికీ వాటన్నింటినీ లెక్కచెయ్యకుండా కొడుకులకు మీ తండ్రి సన్యాసం తీసుకున్నాడని అబద్దం చెప్తుంది. ఈ విషయం కుమారుల దృష్టిలో తన భర్త స్థాయి ఏ మాత్రం తగ్గకుండా వుండేందుకు ఆమె పడే తాపత్రయాన్ని తెలియజేస్తుంది. ఆమె దాంపత్య జీవితానికి ఇచ్చే విలువను కూడా తెలియపరుస్తుంది.


ఈ చిత్రంలో ప్రధానంగా మాట్లాడుకోవల్సిన పాత్ర కనకారావు (రావు గోపాలరావు). కనకారావు పాత్ర చిత్రంలోని అన్ని సమస్యలకూ, కథా గమనానికి మూల స్తంభంలా వుంటుంది. ఈ పాత్ర ద్వారా ఒక మనిషి విపరీతమైన స్వార్థ వైఖరి ఎలాంటి దారుణాలకు ఒడిగడుతుందో చెప్తుంది. ఫ్లాష్ బాక్ లో విదేశాల్లో వుంటున్న ఆనందరావు తన ఎస్టేట్ ను నిర్వహించే బాధ్యతను తన సోదరుడు కృష్ణారావుకు ఇచ్చి వుంటాడు. అతడి వద్ద చిన్న ఉద్యోగిగా వుంటాడు కనకారావు. ఆ సమయంలో అతడు మీనాక్షి అనే మహిళను లోబర్చుకుని తనను వదిలేస్తాడు. చంద్రశేఖర్ రావు చెల్లి అయిన మీనాక్షి అన్నకు చెప్పలేక బాధపడుతుంది. మరోవైపు ఆనందరావు, కృష్ణారావులు తమ దగ్గరే నమ్మకస్తుడైన ఉద్యోగిగా వున్న చంద్రశేఖర్ రావుకు తమ చెల్లి పండరీ బాయిని ఇచ్చి వివాహం చేస్తారు. కనకారావును మీనాక్షి తనకు చేసిన అన్యాయానికి గానూ నిలదీసే సమయంలో యజమాని అయిన కృష్ణారావు ఆమెకు అండగా నిలబడ్డాడు. మూడవ మనిషికి తాను చేసిన తప్పు

తెలిసిందనే ఆలోచనతో కనకారావు కృష్ణారావును హతమారుస్తాడు. అంతేకాక కృష్ణారావే ఆమెను మోసం చేశాడనే నెపం మోపుతాడు. అంతటితో ఆగక మీనాక్షి అన్న అయిన చంద్రశేఖర్ రావు తన చెల్లిని మోసం చేసినందుకుగానూ కృష్ణారావును హత్య చేశాడనేట్లుగా సన్నివేశాన్ని కల్పిస్తాడు. పర్యవసానంగా చంద్రశేఖర్ రావు జైలుకు వెళ్ళేందుకు కారణం అవుతాడు. దానివల్ల మీనాక్షి, కృష్ణారావు, చంద్రశేఖర్ రావుల నుండి తప్పించుకుంటాడు. తర్వాత కాలంలో విదేశాల్లో వున్న ఆనందరావు ఎస్టేట్‌కు యజమానిగా చెలామణి అవుతూ వుంటాడు. ఆనందరావు స్వదేశానికి తిరిగి వస్తున్న సమయంలో అతడిని కిడ్నాప్ చేసి దాచిపెట్టి అతడి ఆస్తులు అనుభవిస్తుంటాడు. ఒకరోజు తండ్రి ఆనందరావును కలవడానికి స్వదేశానికి వచ్చిన ఆశాలతను కూడా కారు ప్రమాదానికి గురి చేస్తాడు. ఇలా తన స్వార్థం కోసం కనకారావు ఒక దగ్గర తప్పు చెయ్యడం మొదలు పెట్టి పదేపదే తప్పులు చేస్తూ పెద్ద ధనవంతుడిగా ఎదుగుతాడు. కాని అతడి స్వార్థం చంద్రశేఖర్ రావును అతడి కుటుంబాన్ని, ఆనందరావును అతడి కుటుంబాన్ని సంవత్సరాల తరబడి కష్టాల్లోకి నెడుతుంది. ఇక కనకారావు పాత్రలో రావుగోపాలరావు నటించడం ఆయనకు కొట్టిన పిండి అని చెప్పొచ్చు.

ఇక ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిన మరొక పాత్ర బుడగరావు (అల్లు రామలింగయ్య). ఈ పాత్ర కనకారావుకు సహాయకుడి పాత్ర. కనకారావు ఎస్టేట్ వ్యవహారాలన్నీ బుడగ రావు కనుసన్నల్లో జరుగుతుంటాయి. పూర్తిగా హాస్యాన్ని పండించే పాత్ర ఇది. దర్శకుడు ఈ పాత్రను తీర్చిదిద్దిన విధానం ప్రేక్షకుడి పెదవుల వెంట చిరునవ్వును ఒలికిస్తుంది. అతడి ఆహార్యం, హావభావాలు గమ్మత్తుగా వుంటాయి. కేవలం ఒకే ఒక హాస్య పాత్ర ద్వారా చిత్రం ఆద్యంతం నవ్వులు కురిపించడంలో విశ్వనాథ్ గారిది అందె వేసిన చేయి అని చెప్పొచ్చు. కె. విశ్వనాథ్ చాలా చిత్రాల్లో ఆ పాత్ర ఎక్కువగా పోషించిన ఘనత అల్లు రామలింగయ్య గారికే చెందింది, చెల్లింది అని చెప్పొచ్చు.

చిత్రంలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యత ను ఇచ్చి చిత్రాన్ని నిర్మించడం కె. విశ్వనాథ్ గారి ప్రత్యేకత. చిత్రంలోని అన్ని పాత్రలు కథాగమనానికి కథానాయకులుగా వ్యవహరించేలా ఆయన కథాసంవిధానాన్ని సిద్ధం చేస్తారు. ఈ చిత్రంలో శోభన్ బాబు అటు రఘుగా, ఇటు కనకారావు ఇంట్లో రుద్రప్రతాప్ గా నటిస్తే, కైకాల అటు సత్యంగా, కనకారావు ఇంట్లో తాతగా నటించడం ప్రత్యేకం. జయసుధ ఆశాలత పాత్రలో అటు ఆధునిక పోకడ గల అమ్మాయిగా,తన తండ్రిని కాపాడుకునేందుకు రఘుతో స్నేహం చేసినప్పుడు పూర్తి పల్లెటూరి అమ్మాయిగా మంచి నటన కనబర్చారు.

ఈ సందర్భంలో శోభన్ బాబు గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోక తప్పదు. డెబ్బయ్యవ దశకంలో కె.విశ్వనాథ్ గారి దర్శకత్వంలో శోభన్ బాబు గారు చెల్లెలి కాపురం, కాలం మారింది,శారద, జీవన జ్యోతి, ప్రేమ బంధం, జీవిత నౌక, కాలాంతకులు ఇలా ఏడు చిత్రాల్లో నటించాడు. వాటిలో శారద, జీవన జ్యోతి, ప్రేమ బంధం, జీవిత నౌక వంటి చిత్రాలు ఎక్కువ మొత్తంలో కథానాయిక కేంద్రం గా కొనసాగుతాయి, అయినప్పటికీ హీరోగా తన ప్రాముఖ్యం కన్నా కథ అందులోని పాత్రకు విలువనిచ్చి నటించడం నాటి హీరోల దృక్పథాన్ని తెలియపరుస్తుంది.




ఈ చిత్రంలో ఏడు పాటలు కలవు. సంగీతం కె.వి.మహదేవన్ అందించారు. ఒక ప్రత్యేక గీతం (ఐటెమ్ సాంగ్) కూడా వుంటుంది. కె. విశ్వనాథ్ చిత్రంలో ప్రత్యేక గీతం వుండడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ఈ చిత్రాన్ని దర్శకుడు తన శైలికి భిన్నంగా వాణిజ్య అంశాలతో నిర్మించేందుకు ప్రయత్నం చేశాడని. దాని కారణంగా చిత్రం చాలా వరకు దర్శకుడి అన్ని చిత్రాల తో పోల్చుకుంటే కొంత వరకు గీతను దాటి విఫలం చెందినట్లుగా తోస్తుంది. చాలా వరకు సన్నివేశాలు ఎక్కువ కల్పితం గానూ, లాజిక్ లేని విధంగానూ అనిపిస్తాయి. చిత్రంలో సంభాషణలు బాగుంటాయి. ఏదేమైనా ఈ చిత్రం మనిషిలో స్వార్థం పాళ్ళు పెరిగితే పర్యవసనాలు ఎలా వుంటాయనేది చెప్తూనే విఫల ప్రయోగంగా మిగిలి వుండవచ్చు అన్పిస్తుంది.

**చిత్రం : కాలాంతకులు**

**తారాగణం : శోభన్ బాబు, జయసుధ, కైకాల సత్యనారాయణ, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, పండరీ బాయి తదితరులు**

**సంగీతం : కె.వి. మహదేవన్**

**నిర్మాత : డి.వి.ఎస్. రాజు**

**దర్శకత్వం : కె.విశ్వనాథ్**

# నాన్నే నా ఆదర్శం...

నాన్న
మనకు జన్మనివ్వకపోయినా
పుట్టే ముందు, పుట్టే సమయంలో
పుట్టిన తరువాత
ఎక్కువ జాగ్రత్తగా చూసుకుంటారు
మెల్లగా పెద్దవుతుంటే
వేలు పట్టుకొని నడిపిస్తారు.
కిందపడితే తిరిగి లేవడానికి తన చెయ్యందిస్తారు
మళ్ళీ నడిచేందుకు ధైర్యమిస్తారు..
అది చిన్నప్పుడైనా ... జీవితంలోనైనా ...
బాల్యంలో చిన్న తప్పులకు కోపగించినా
ఆ కోపమే పెద్దయ్యాక మనం
తప్పులు చేయకుండా ఉపయోగపడుతుంది
చేసిన తప్పులకు అప్పుడప్పుడూ శిక్షించినా
అదే మనల్ని సక్రమంలో, క్రమశిక్షణలో ఉంచుతుంది
మనల్ని ఎంత కొట్టినా, తిట్టినా
మనకుంటే ఎక్కువ వారే బాధ పడతారు
నాన్న, డాడీ, అప్పా, పాపా, పితా...
ఇలా ఏ భాషలో పిలిచినా..
నాన్న హృదయం స్పందిస్తుంది.
మనం నాన్నను ఎలాగ పిలిచినా
నాన్న ప్రేమ మాత్రం ఎన్నటికీ తరగదు
మనం ఒక ఉన్నతమైన స్థానంలో ఉంటే
వారి కంటే సంతోషించేవారు ఎవరూ ఉండరు.




**సాగి తేజశ్రీ**

బి.ఏ., ద్వితీయ, కోఠి మహిళా కళాశాల, హైదరాబాద్,
ఫోన్ : 8008 280 140

# ఎ నైట్ జర్నీ

నులక మంచంపై
చిక్కని ఆకాశపు నీడ కింద
ఎదురెదురుగా ముఖాలు!
అక్షింతలుగా మంచు రాలుతోంది!
ఇరువురు శ్వాసను మార్చుకుంటూ....
ఓ దృశ్యాన్ని గీస్తున్నారు!
దూరంగా వినిపించే
కీచురాళల సంగీత కచేరీలో...
గొంతులు శ్రుతి కలుపుకుంటూ...
చుట్టూ ఆవహించిన చలి
వేడి నిట్టూర్పులొదులుతోంది!
చల్లటి గాలిలో మనసులు
చెమటలు కక్కుతూ రాల్చిన చుక్కలు
పొగలు పొగలుగా ఆకాశంలోకి చేరిపోతోంది!
రంగులు మారుస్తున్న కుంచె
అందాన్ని రంగరించుకుంటోంది!
ఏ అద్భుత భంగిమను గీయడానికో...?
రంగులను కలబోసుకుంటోంది!
ఈ నడిరేయి తెలవారడానికి
ఇంకా సగం పొద్దు వాలాలిగా...?
దాహం తీరడానికి చెలమ పొంగుతోంది!
ఈ నిశిని తాగితే... తెలవారుతుంది!!




**కుంచెశ్రీ**

ఎద్దులపల్లి, ఫోన్ : 9908830477

# శతక సంప్రదాయంలో 'దార్లమాట శతకం'

**మమత వేపాడ,** సాహిత్య విద్యార్థిని, విశాఖపట్నం. ఫోన్ : 7981758590

ఆధునికతను సాహిత్య ప్రక్రియలు ఎలా జీర్ణించుకున్నాయో అదే విధంగా శతక ప్రక్రియ కూడా జీర్ణించుకుంది. దానికి మంచి ఉదాహరణ దార్లమాట శతకం. నేటి సమాజంలోని సాంఘిక అసమానతలకు నిలువుటద్దంలా, బింబ ప్రతిబింబాలుగా ఈ శతకం దర్శనమిస్తుంది. కొంతమంది అనుకుంటున్నట్టు పద్యాలు, శతకాలు, అవధానాలు ఒక ప్రత్యేక వర్గానికే సంబంధించినవి అనే మాట పాతబడుతుంది! అందువల్ల వీటిని తెలుగులో ఒక సాహిత్య ప్రక్రియగా గుర్తించినప్పుడు ఎటువంటి ఇతర చర్చలకు దారితీయవు. శతకాలు సర్వ సాధారణంగా ఆత్మాశ్రయమైనవి. ఈ మధ్య కాలంలో శతక సాహిత్యంపై ఆసక్తి చూపేవారు అరుదుగానే కనిపిస్తున్నారు. ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు గారు రాసిన 'దార్లమాట శతకం' పుస్తక ముఖచిత్రం చిరంజీవి చిన్నారి దార్ల శ్రీనివాసరావు బోసి నవ్వుతో తండ్రిగారి అక్షర కష్టాన్ని దోచుకున్న చిన్ని దొంగలా కనిపించాడు! ముఖచిత్రం బట్టి దార్లగారు తీసుకున్న వస్తువుల సున్నితత్వం అర్థం చేసుకోవచ్చు. పుస్తకానికి ముందు మాటలుగా ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారు, ఆచార్య విస్తాళి శంకరరావు గారు, ఆచార్య పిల్లలమర్రి రాములు గారు, కంది శంకరయ్య గారు రాసిన అక్షరాలు పూలబాటలు వేశాయి.! మిత్రవాత్సల్యం పేరుతో గోవిందుని గోవర్ధన్ గారు స్నేహ పరిమళాలను పద్యాలుగా వెదజల్లారు.




శతక సంప్రదాయం గురించి మాట్లాడే ముందు శతకానికి మూలమైన పద్యం గురించి చర్చిద్దాం! మౌఖిక రూపమైన జానపద సాహిత్యంలో ఎంతో సాహిత్య సంపద ఉన్నప్పటికీ అవేవీ అక్షరబద్ధం కాలేదు. లిఖితాధారాలనే మనం పరిగణనలోనికి తీసుకుంటాం కాబట్టి శాసనాధారంలో తొలి తెలుగు పద్యం క్రీ. శ 848 నాటిదైన పండరంగని అద్దంకి శాసనంలోని 'పట్టంబు గట్టిన ప్రథమంబు నేండు' అనే పద్యం. గ్రంథస్థమైన తొలి రచనగా నన్నయ రాసిన ఆంధ్రమహాభారతాన్ని చెప్పుకుంటున్నాం. ఈ కావ్యంలోనే 'రాజకులైక భూషణుడు' అనే పద్యమే తొలి గ్రంథస్థం అయిన పద్యం. తొలి శతక లక్షణాలు కూడా ఆంధ్రమహాభారతం, ఆది పర్వం, ఉదంకోబపాఖ్యానంలో నాగస్తుతి వర్ణనలో కనిపిస్తున్నాయి. దీనిలో 'మాకు ప్రసన్నుడయ్యెడున్' అనేది మకుటంగా పండితులు గుర్తించారు. సర్వలక్షణ సంపన్నమైన తొలి శతకం పాల్కురికి సోమనాథుని 'వృషాధిప శతకం'. పద్యం సంగీత సాహిత్యాల సమ్మేళనం. పద్య పఠనం నాటకంలోని పద్యంలాగా అతిరాగంతో ఉండకూడదు. అర్థవంతంగా ఆకర్షణీయంగా చదవటం అవసరం. ఈ విధానాన్ని భమిడిపాటి కామేశ్వరరావు ఒక ఉద్యమ దీక్షలో నడిపారు. శతకము సర్వజనులు మెచ్చిన శక్తివంతమైన, విశిష్టమైన సాహిత్య ప్రక్రియ. **'సంస్కృత, ప్రాకృత భాషలోని శతకమే తెలుగులో కొన్ని విశిష్ట లక్షణాలతో అవతరించింది. కాని కొందరు విమర్శకులు ఊహించినట్లు శతకము దేశికవితకు పూచిన పూవుకాదు'** అని డాక్టర్ కె. గోపాలకృష్ణారావు గారు 'ఆంధ్ర శతక సాహిత్య వికాసము' అనే పరిశోధనా గ్రంథంలో సప్రమాణముగా నిరూపించారు.!

శతకానికి అసలు ఏ లక్షణాలు ఉండాలి అంటే కొన్నింటిని ప్రధాన శతక లక్షణాలుగా చెప్పుకుంటున్నాం. అవేవి అంటే 1) సంఖ్యానియమం 2) మకుట నియమం 3) ఛందోనియమం 4) రసనియమం 5) ఆత్మాశ్రయత్వం 6) ముక్తకం. సాధారణంగా శతకంలో ఉండదగ్గ పద్యాల సంఖ్య 100 లేక, 108 కానీ సంఖ్యానియమాలను మార్చిన శతకాలు కూడా ఉన్నాయి. ఉదా. వేమన శతకం. పదాల్ని విరవడం, పాదానికి ముందు వెనుకల అక్షరాలను చేర్చి లేక మార్చి తొలగించి అర్థచమత్కారాన్ని సాధించడం, కఠిన పదాలకు కూడా సుతిమెత్తని అర్థాలు చెప్పడం, అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం, శ్లేషలు, నానార్థాలు స్ఫురింప జేయటం పద్యాశ్రయ భాషకే సాధ్యం. శిల్ప సౌష్టవంలో తెలుగు పద్యం విశ్వసాహితీ ప్రపంచంలోనే తలమానికం. పద్యానికి శ్రుతి ఉంటుంది. దానివలనే వినాలనే ఆసక్తి రేకెత్తుతుంది. పద్యం గాన యోగ్యమైనది కాబట్టి మరచిపోయే అవకాశం తక్కువ. దీనికి మనం

చిన్నతనంలో నేర్చుకున్న భర్తృహరి పద్యాలు, వేమన పద్యాలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఏకొద్దో గొప్పో తెలుగు సాహిత్యంపై ఆసక్తి ఉన్నవారు చిన్ననాటి పద్యాలను ఈనాటికి నెమరేసుకోవడం మనం చూస్తూనే ఉంటాం. 'గానం' నాదమాధుర్య సంబంధమైనది. 'నాదం' రసానుగుణమైన అక్షరాల కూర్పువల్ల ఏర్పడుతుంది.

'దార్లమాట శతకం' కూడా వేమన శతకంలా ప్రకీర్ణశతకం. ఏదో ఒక వస్తువుతో లేదా రసంతో కాక విభిన్నాంశాలను ఒకేచోట చేర్చి రచించబడే శతకాలే ప్రకీర్ణ శతకాలు. శతక లక్షణాలలో ఒకటయిన ముక్తకతను కూడా వీరి శతకంలో చూడవచ్చు. ఒక పద్యానికి మరో పద్యంతో అన్వయం లేకపోవడమే ముక్తకత. ప్రబంధాలు మొదలైన కావ్యాలలో ఒక పద్యానికి మరో పద్యంతో సంబంధం ఉంటుంది. కానీ శతకాల్లో ఏ పద్యానికి ఆ పద్యమే స్వతంత్రంగా ఉంటుంది. శతక సంప్రదాయంలో వస్తున్న కొన్ని నియమాలను పాటించారు. మరికొన్నింటిని పాటించలేదని చెప్పవచ్చు. అందుకు ఉదాహరణకి తొలి పద్యం '**శ్రీగణపతి దేవ! శివపార్వతీ పుత్ర!**' (పుట:29.ప.1) అనే పద్య పాదంతో వినాయకుని స్తుతితో ఆరంభం అయింది. **'మకుటనియమం, ఛందోనియమం పాటించారు. సంఖ్యానియమాన్ని, రసనియమాన్ని పాటించలేదు. మకుటం అంటే కిరీటం. దార్లగారు తీసుకున్న మకుటం 'దారి పూలతోట దార్లమాట'**. ఈ మకుటాన్ని చూసినపుడు 'నవయుగాల బాట నార్లమాట' మకుటంతో శతకం రాసిన నార్లవారి మాట శతకం స్ఫురించింది. అయితే నార్ల వారి శతకంలో ఆ దశాబ్దపు సమకాలీన అంశాలను తీసుకున్నా ఎడిటర్ ఎలా ఉండాలనే అంశం పై చాలా పద్యాలు రాశారు. కానీ దార్లగారు ఏ ఒక్క అంశానికో కట్టుబడకుండా ఈనాటి సమాజంలో ఉన్న సమస్త జాడ్యాలను ఎత్తి చూపారు. ఆ దశాబ్దంలో 'నార్లవారిమాట శతకం' సుపరిచితం అయితే ఈ దశాబ్దానికి 'దార్లవారి మాటశతకం' సాహిత్య లోకానికి సుపరిచితం అవ్వనుందనడంలో అతిశయోక్తిలేదు.

ముందు చెప్పుకున్న విధంగా 'దార్ల శతకం' ప్రకీర్ణ శతకం. ఈ శతకంలో తీసుకున్న వస్తువులో చాలా ప్రయోగాలు కనిపిస్తాయి. తెలుగు భాషపై పాలకుల నిర్లక్షం, మానవ సంబంధాలు, కార్పొరేట్ సంస్థల ఆగడాలు, పద్యం సొగసు, జాతి దూషణ, కులం, ఇంకుడు గుంత, బిగ్బాస్, ఇంటర్నెట్, తమిళ దర్శకుడు పా. రంజిత్ వంటి చాలా విషయాలపై కవి తన బాణాలను ఎక్కుపెట్టారు. ఈ వస్తు వైవిధ్యమే శతక పరంపరపై దార్లగారి ముద్రగా చెప్పుకోవచ్చు. శతకం ఆత్మాశ్రయత్వం కాబట్టి ఈ శతకంలో కవి ఆత్మను మనం పట్టుకునే ప్రయత్నం చేయవచ్చు. అలా పరిశీలించినపుడు ఒక పద్యంలో '**కలిమి లేమిలన్ని కష్టసుఖములట్లు**' (పుట: 36, ప.50) రక్త సంబంధీకులు మనతో కలిసి ఉంటే ఎంత ఆనందంగా ఉంటుందో తెలియజేస్తూనే, తల్లిదండ్రులను గూర్చి మనం కఠినంగా మాట్లాడినా లేదా వారు మన గురించి మాట్లాడినా విషం తాగినట్లు విలవిలలాడమా అంటారు కవి (పద్యాలు: 147, 161). చిన్నప్పటి నుండి అనేక ఆకలి దప్పులను, వ్యయ ప్రయాసలను ఓర్చుకుని పైస్థాయికి ఎదిగినపుడు తీరా నచ్చిన ఆహారాన్ని తినాలని, కొంచెం అయినా ప్రశాంత జీవితాన్ని గడపాలని ఆశించినపుడు అనారోగ్య సమస్యలతో కోరిక మీదే కోరిక మిగిలిపోయే పరిస్థితిని కవి మన కళ్ల ముందుంచుతారు. 'దార్లమాట శతకం' లో రాజకీయాల నుండి నేటి వాట్సాప్ వరకు, రోజూ వారీ పనులలో అజాగ్రత్తలను తీసుకోవల్సిన జాగ్రత్తలను, కవి ఎంతో సునిశితంగా గమనించి సున్నిత సూచన చేసారు. అవేమిటో చర్చిద్దాం.! **'త్రాగి కారు నడుప తప్పుయినపుడు'.** (పుట: 29. ప.3) ఆల్కహాల్ సేవించి వాహనాన్ని నడిపితే ప్రభుత్వం నేరమని ప్రజలకు శిక్ష విధిస్తుంది. అదే ప్రభుత్వం తాము అధికారంలోనకి రావడానికి ప్రజలను మభ్యపెట్టి డబ్బులను వెదజల్లుతారు. ఓటుకి నోటు ఇవ్వడం అనేది తప్పు కాదా? ప్రజలు తమ గొయ్యి తామే తవ్వుకునేలా చేసిన నేటి రాజకీయ నాయకులకు ప్రశ్న వేస్తున్నారు. మొదటిది తప్పైతే రెండవది అంతకంటే తప్పని కవి చెప్తున్నారు. 'నలిగి పోయె జనత నల్ల ధనము పేర (పుట: 32 ప .22) అనే పద్యంలో డిమోనిటేషన్ సమయంలో ప్రజలు ఏవిధంగా ఇబ్బందులకు గురయ్యారో పేదవారి దుస్థితిని వివరించారు. ఆ పరిస్థితిని మనమందరం గమనించి మరిచిపోయాం. కాని కవి మాత్రం అక్షర రూపంలో ఆ విషాద సంఘటనలను మళ్లీ మన ముందుంచారు. కవి ఒక్కడే ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా అక్షరబద్ధం చేస్తాడు. ఈ సంఘటనలను తరువాత తరాలకు అందిస్తారు. గోగులపాటి కూర్మనాథ కవి రాసిన 'సింహాద్రి నారసింహ శతకం'. ఇది వ్యాజస్తుతి శతకం అయినప్పటికీ ఈ గ్రంథంలో క్రీ.శ 1753లో సింహాచలక్షేత్రంపై పిండారీలు, మహ్మదీయుల దండయాత్రలో జరిగిన ధారుణ మారణకాండను నిరసిస్తూ రాసిన శతకం, ఆనాటి పరిస్థితులను తెలియజేస్తుంది. అదేవిధంగా రాయలకాలం నాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులు 'ఆముక్త మాల్యద', 'రాయవాచకం' తెలియజేస్తే, కాసె సర్వప్ప 'సిద్ధేశ్వర చరిత్ర' వలన కాకతీయుల కాల స్థితిగతులను తెలుసుకోగలుగుతున్నాం. ఇది కేవలం అక్షరబద్ధం అవటం వల్లనే ఆ యుగాలనాటి జీవన శైలిని మనం తెలుసుకోవటం సాధ్యం అయ్యింది. అందుకే ప్రముఖ కవి జాషువా అన్నట్లు 'సుకవి జీవించు ప్రజల నాలుకల యందు' అనే వాక్యానికి దార్లగారి ఈ శతకంతో సుసంపన్నం అయిందని చెప్పవచ్చు. మరొక పద్యంలో 'విజయ్ మాల్య', 'నీరవ్ మోడి' వంటివారు పట్టపగలే దోచేస్తున్నారు. అటువైపు వెళ్లకు అని సామాన్యున్ని హెచ్చరిస్తున్నారు కవి. (పుట:32, ప.23)

**'తినకముందు నొకటి తిన్నప్పుడొక్కటి**
**పొడుచుకొనవలయును జడుచు కొనకు**
**మనల జంపు సఖియె మధుమోహనాంగిరా'**
(పుట. 34, ప. 30).

ఈ పద్యంలో మధుమేహం వలన ఇన్సులిన్ ఇంజక్షన్ తినక ముందు చేసుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి తినేటప్పుడు సూదిమందు తీసుకోవాల్సిందే! ఒళ్ళంతా సూది మందుల ఆనవాళ్లవుతాయి.! తియ్యగా మనతో పాటు ప్రియురాలిలా ఉంటూనే నెమ్మది నెమ్మదిగా చావుకి దగ్గర చేస్తుంది. అందుకే కవి భయపడవద్దంటున్నారు. 'మధుమోహనాంగిరా' (శరీరమంతా వ్యాపిస్తుంది కాబట్టి) అంటూ చమత్కరిస్తున్నట్టు బయటకు కనిపిస్తున్నా కవి అంతరంగ మథనాన్ని గమనించవచ్చు. దార్లగారికి ప్రకృతి వనరులపై శ్రద్ధ ఉన్నట్లు మనకు కనిపిస్తుంది. వాటిని వృథా చేయడం ఇష్టపడని కవి హృదయాన్ని కింది పద్యంలో గమనించవచ్చు.

**'విప్పి యుంచకండి విచ్చల విడిగాను**
**పళ్ళు తోమునపుడు పట్టనట్టు**
**ఎల్లవేళలందు నల్లాను బిగియించు' (పుట: 35. ప.38 )**

ఈ పద్యం చదివినపుడు ప్రతీ ఒక్కరు ఆలోచనలో పడాల్సిందే. మనమెప్పుడైనా నీటిని వృథాగా వదిలేస్తున్నామా? అని మనకై మనమే ప్రశ్న వేసుకోవాలి. పళ్ళు తోమేటప్పుడు ఆ తతంగం అంతా పూర్తి అయ్యేవరకు కొలాయి ధారని చాలామంది వ్యర్థంగా వదిలేస్తారు. ఇలాంటివి హాస్టల్స్‌లో మరీ ఎక్కువగా ఉంటుంది. గవర్నమెంట్ వదిలే నీళ్ళు అయితే అసలు ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే ఆ నీటికి డబ్బులు చెల్లించం కదా! మరొక పద్యంలో **'నీటి విలువ తెలుపు నీకు రాయలసీమ'** (పుట: 35, ప.40) నీటి కరువు ప్రాంతాలని ఎక్కడో నైజీరియా వంటి దేశాల వరకు మనం వెల్లనవసరంలేదు. మన భారతదేశంలోనే ఇప్పుడు గుక్కెడు నీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకునే అభాగ్యులన్నారు. కొద్ది నీళ్ళే కోట్ల గొంతుకలను తడుపుతుందని, నీటి విలువ కరువు ప్రాంతయిన రాయలసీమ ప్రజలకు బాగా తెలుసునని కవి తన ఆవేదనను వ్యక్తం చేస్తారు. **'విత్తనమును బట్టి వికసించు బుద్ధులు'** (పుట.35 ప. 41) విత్తనాలు మొలకెత్తడానికి సాధనమైన నేల అంతా ఒక్కటైనా వాటిలో ఉన్న సామర్థ్య గుణాలను బట్టే మహావృక్షాలుగా ఎదుగుతాయి. కాని మనుషులు అంతా ఒక్కటైనప్పటికీ వారి మనస్సులోని అంతుచిక్కనిది (మనిషికి మనిషికీ మధ్య కుల, ధన అంతరాలు కావచ్చు) ఏదో ఉంటుందని ఆ మర్మాన్ని కనుక్కోవడం చాలా కష్టమని రెండింటి మధ్య తత్వాన్ని వివరిస్తున్నారు కవి. **'సంతకంబు పెట్టు సర్జరీకనుచుండు'** (పుట.34, ప.32) ఈనాడు కార్పొరేటు హాస్పటల్సు మనిషికున్న జబ్బుపేరు చెప్పి ఆ పేషెంటు తోనే కండిషన్స్‌కి సంతకాలు చేయించుకుంటున్నారు. జబ్బు తగ్గుతుందనే గ్యారంటీ కన్నా డబ్బుని లాక్కోవడమే ప్రధాన కర్తవ్యంగా ఉందని, రకకాల మోసాలు జరుగుతున్నాయని, ఇలాంటి కథలు అనేకమని అంటారు కవి. **'కలిమి లేములన్ని కష్టసుఖములట్లు'** (పుట.37. ప.50) ధనం ఉన్నా లేకున్నా కష్టసుఖాలలో రక్త సంబంధీకులైన తల్లిదండ్రులు సోదరులు మనకు అండగా ఉంటారని, వారే మనల్ని అక్కున చేర్చుకుంటారని, వారికి సమానమైనవారు మరెవరు ఉండరని మానవ రక్త సంబంధాలలో మాధుర్యాన్ని చెప్తున్నారు కవి. **'కదన రంగమేల కత్తి దూయుటయేల'** (పుట. 37, ప.51) ప్రాచీన పద్యమైన నేటి వచన కవితయైన అంతా సాహిత్యమే. నదులన్నీ సాగరంలో కలుస్తున్నట్లు, అన్ని ప్రక్రియలూ సాహిత్య వాఙ్మయం అనే సఖి కౌగిలిలోనే కలవాలి. అటువంటప్పుడు ఫలానావి రాయకూడదు, రాయాలి అనే ఆంక్షలు ఏమిటి? అంటూ సందిగ్ధంలో ఉన్న నేటి సాహిత్య వారసులకు జవాబులా ఉంది ఈ పద్యం.

**'భరతజాతినంత పరిమార్చు జాడ్యంబు'** (పుట. 51, ప. 137). పై పద్యం ఈ శతకానికి ఆత్మ వంటిదనిపిస్తుంది. కులమనే పెద్ద రొచ్చులోనే వేల సంవత్సరాల నుండి భారతీయులు జీవిస్తున్నారు. అది మనువు పేరుతో మనిషి నుండి మనిషిని దూరం చేసే పూడ్చలేని అగాథం. నేడు ఇండియన్స్ విదేశాలకు వెళ్లినా అక్కడికి ఈ కుల చిచ్చనే కొరివిని తోడు తీసుకుని పోతున్నారు! విద్యాధికులు ఎక్కువ అవుతున్న సమయంలో తగ్గాల్సింది పోయి పెరుగుతుంది. అందుకే కవి ఈ కులమనే వృక్షాన్ని కూకటి వేళ్ళతో కూల్చి, మసి చేసినప్పుడే జాతికి మేలు జరుగుతుందని అంటారు.

**'స్త్రీని దేవత యని చెప్పిరి నీతులు**
**బడికి గుడికి వలదు పడతి యనిన**
**ఆమె లేని సృష్టి కర్థంబు లేదురా' (పుట.52. ప.138)**

భారతదేశంలో స్త్రీని దేవతలా పూజిస్తామని ఆధ్యాత్మిక గ్రంథాల్లో, పురాణ కథల్లో కనిపిస్తున్నా ఆచరణలో మాత్రం భూతద్దం పెట్టి వెతికిన అది కనిపించదు. కామానికి చిన్న, పెద్ద అనే భేదమే లేదు. 'అసీఫా' విషయం మనకు తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిందేమ టంటే కులం, మతం పేర్లతో బలి అయ్యేది, అత్యాచారాలకు గురయ్యేది స్త్రీ మాత్రమే. ఆమె ఎక్కడికి వెళ్లినా ఆ చూపులు వెంటాడతుంటూనే ఉంటాయి. ఆమెను ఒక సెక్సు సింబల్ గానే చూస్తున్నారని కవి అంతర్భావం. స్త్రీ లేకపోతే సృష్టికే అర్థంలేదని చెప్పే ఆవేదనలో సమాజం పట్ల కవికి ఉన్న బాధ్యతను పై పద్యంలో గమనించవచ్చు.

**'పారవశ్యమైతి 'పారంజితా' నీకు**
**నీదు సాహసంబు నీదు రణము**
**తలచుకొందురయ్య దళితులందరు నిన్ను' (పుట.56. ప. 163)**

తమిళ చిత్ర దర్శకుడు 'పా. రంజిత్' దళితులపై తీసిన 'కాలా' (పుట: 56, ప. 162) సినిమా చాలా అద్భుతంగా నిర్మించారు. ఈ


సినిమా చాలా వరకు నిజజీవితాన్ని ప్రతిబింబింపజేసింది. కాల్పనికత లేకుండా సజీవ పాత్ర చిత్రణ చేసి సాహసమే చేసాడు. దళిత వర్గం నుండి దర్శకులుగా రాణించినవారులేరు? అసలు అవకాశం ఇచ్చేవారు ఎవరు? ఎంతో ధైర్యంగా నిచ్చెనమెట్ల కులవ్యవస్థను ఎదురిస్తూ తీసన సినిమా 'కాలా' అందువల్ల దళితులందరికీ ఆరాధ్యుడయ్యాడని కవి కొనియాడారు. **'అందనంత దూర మక్షరమున్నను'** (పుట.56. ప.164) ఇప్పటికీ దళితులకు చదువంటే అందని ద్రాక్షే. దానికి కారణం వెనుకబాటుతనం, ఆర్థిక స్థోమత లేకపోవడం. కాని ప్రస్తుత పరిస్థితులకంటే అధ్వానమైన పూర్వ భారతీయ సమాజ స్థితిలో సావిత్రిబాయి పూలే చదువుకోవడమే కాకుండా ఎంతోమందిని ఆ తోవలో నడిపారు. నేటి వేలమంది స్త్రీలకు ఆశాజ్యోతిలా మారారు. అందుకే ఆమె జీవితమే ఒక సత్యకథ అంటారు కవి.

**'పండితుండునైన పాలకులైనను'** (పుట.47.ప.133) ఎంతో సాహిత్య సంపద ఉన్న ప్రజల భాషైన తెలుగును అటు పండితులు, మనల్ని పాలించేవారు ఇద్దరూ పట్టించుకోవడం లేదని ఒక తెలుగు భాషామానిగా తెలుగు ఆచార్యునిగా ఆవేదనను కవి వ్యక్తం చేయడం మనం గమనించవచ్చు. **'సాధు శబ్దమైన సంస్కృతమైనను'** (పుట.48.ప.118) పద్యం అనేది ప్రౌఢమైన సంస్కృతంలో కాని, సాధు శబ్దాలతో కాని కూర్చిన అది ప్రజలకు అర్థమైన వారి భాషలో రాసినపునపుడు పద్యం చూడగానే ఆదరిస్తారు తప్పితే దాని నుండి దూరంకారు అంటారు కవి. **'శిలను చెక్కి శిల్పి శిల్పముగ మలుచు'** (పుట:38, ప.56). బండరాతిని శిల్పి చెక్కి శిల్పంగా మారుస్తాడు. అదేవిధంగా నిరంతరం సాహిత్యం చదవటం వలన కఠిన హృదయం కూడా కరిగి సహృదయత అనే రససిద్ధిని పొందుతుందని కవి చెపుతున్నారు.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**


**'వెతుకు వెతుకు వెతుకు బ్రతుకంతయు వెతుకు'** (పుట: 39, ప. 69) నీవు కోరుకునే జ్ఞానం అనే వెలుగును సాధించడానికి నిరంతరం దానిని తరుముతూ జీవితం అంతా వెతకాల్సిందేనని కవి పిలుపునిస్తున్నారు. ఆ జ్ఞాన వెలుగు ఎలా ఉండాలంటే యుగయుగాలు నీవు వేసిన త్రోవలో సమస్తజీవం నడవాలని అంత ఉన్నతమైనదిగా మనిషి ఆశయం ఉండాలని కవి మనకు బోధిస్తున్నారు. దార్ల వేంకటేశ్వరరావు గారు 165 ఆహ్లాదమైన ఆటవెలదులతో ఈ శతకంలో మనల్ని అలరించారు. వ్యాసం నిడివి రీత్యా అన్నింటినీ పరిచయం చేసే వీలులేదు కాబట్టి కొన్నింటినే పరిచయం చేయడం జరిగింది. పద్యం తెలుగువాడి నాడి. గాఢ మానసిక దశను చిత్రించడానికి, ఉత్తుంగ ఉద్వేగాలను అక్షర రూపమివ్వడానికి తెలుగు కవులు పద్యాన్నే భావవాహికంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు గారు కూడా పద్యాన్నే ఎన్నుకోవడం విశేషం. ఆయనలో ఉన్న సంస్కృతీ ప్రియత్వాన్ని చాటుకున్నారు. ఎంతో సామర్థ్యం ఉన్న తెలుగు పద్య పరంపరకు ఆధునిక జీవితాన్ని జోడిస్తూ విలువలను బోధిస్తూ పద్యాన్ని భావి తరాలకు అందించే ఆశయాన్ని దార్లగారిలో చూడవచ్చు. జీవశక్తి గల పద్యాన్ని విస్మరిస్తే అందమైన పద్య రచనా సంప్రదాయాన్ని కోల్పోతాం. ఈ విషయం తెలిసే ఏమో **'తిడితే తిట్టావ్ కాని పద్యంలో తిట్టు'** అని అభ్యర్థించే పద్య ప్రియులు కూడా వెనుక కాలంలో ఉన్నారు. అందుకే ఇంద్రగంటి శ్రీకాంతశర్మ **'మాఘ ఫాల్గుణ మాసాల్లో కొత్త తాటాకుల పెళ్లి పందిరిలాగా వేసవికాలపు వడపిందెలాగా కోనసీమ పనసపండులాగా ఒక ప్రత్యేక లక్షణం, సౌరభం కలది తెలుగు పద్యం'** అన్నారు. ఈ వాక్యాలకు దార్లగారి అనుభవాన్ని జోడించి అంతే ప్రియంగా మనకు ఈ శతకం ద్వారా అందించారేమో అనిపిస్తుంది. ఆయన జీవితంలోనే ఈ పద్య నేపథ్యం ఉన్నట్లు మనకు ఆయన ముందే చెప్పారు. పన్నెండో శతాబ్దంలో వచ్చిన శతక ప్రక్రియకి ఆధునిక వస్తువైవిధ్యం జతచేస్తే అది దార్లమాట శతకం అవుతుందని ఒక్కమాటలో చెప్పవచ్చు.!



# ఆచార్య వెలుదండ నిత్యానంద రావు సమగ్ర సాహిత్యం (సంపుట2)


# “అక్షరమాల” (వ్యక్తిత్వ సాహిత్య సౌరభాలు)

**శివప్రియ,** ఫోన్ : 99640 82076

నలభై సంవత్సరాలుగా నిరంతర గ్రంథపఠనంలో నిమగ్నమై, ముప్పై ఏళ్లుగా స్నాతకోత్తర విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ పరిశోధన విమర్శ క్షేత్రాల్లో నిత్యకృషీవలురుగా శ్రమిస్తున్నవారు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు గారు. పాండిత్యగరిమ, పరిశోధన పాటవం, పాఠప్రవచనాల సామర్థ్యం కారణంగా విరాజిల్లుతున్న నేటి విశ్వవిద్యాలయాల ఆచార్య పుంగవుల్లో సర్వప్రథమంగా స్ఫురించేది ఆచార్యవెలుదండ నిత్యానందరావు గారే.

ఆచార్య వెలుదండ గారి సమగ్ర సాహిత్యం సుమారు నాలుగు వేల పేజీలు ఏడు సంపుటాలుగా వెలువడుతుంది. మొదటి సంపుటం **“అనుభూతి– అన్వేషణ”.** 596 పేజీలతో హైదరాబాదులో నిత్యానందరావు గారి పుట్టినరోజు సందర్భంగా 9–8–21న శ్రేయోభిలాషుల, గురువుల, శిష్యుల ఆశీర్వాదాలతో, అభినందనలతో చక్కగా సాగింది. ఈ పుస్తకంలో 147 సమీక్షలు 82 పీఠికలు కూర్చబడ్డాయి. డా.నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండవ సంపుటం **“అక్షరమాల” (వ్యక్తిత్వ సాహిత్య సౌరభాలు)** నవంబర్ 2021 లో వెలుగు చూసింది. ఈ పుస్తకంలో 76 వ్యక్తుల, 48 సాహిత్య కృషీవలుర సాహిత్య రచనల గురించిన వ్యాసాలు ఉన్నాయి. ఈ సంపుటంలో నిజంగానే వ్యక్తిత్వ సాహిత్య సౌరభాలు గుబాళించాయి. నిత్యానందరావు పరిశోధన, అధ్యయనాలు ఆధునిక తెలుగు సాహిత్యంలోని ఏ ఒక్క ప్రక్రియకో, వాదానికో, పరిమితం కాకుండా విశాలత్వాన్ని సంతరించుకోవడం విశేషం. రావు గారి నిత్య అధ్యయన తత్పరత, ఆయనలో ఉన్న గ్రహణ పారీణతను వేళ్ళూరేలా చేయడం వర్తమాన సాహిత్య ప్రియులు అలవర్చుకోవల్సిన సుగుణం. ఈ పుస్తకంలోని వ్యాసాలు విశేష వ్యక్తుల జయంతి, వర్ధంతి, షష్టిపూర్తి, సప్తతి, పురస్కారాది ప్రత్యేక సందర్భాల్లో వెలువడ్డవి. ఇవి కొన్ని సందర్భాల్లో ఔపచారికమైన వ్యక్తి స్థూలపరిచయాలుగా తోచినా చాలా సందర్భాల్లో ఆ వ్యక్తి వ్యక్తిత్వాన్ని, రచనాగరిమనూ కృషి ఔన్నత్యాన్ని చాటేవే.

ఆచార్యులకే ఆచార్యుడైన డాక్టర్ బిరుదురాజు రామరాజు వ్యక్తిత్వంలోని విశిష్టతతోపాటు సాహిత్యకృషి సౌరభాన్ని కూడా స్పష్టంగా వివరించారు వెలుదండవారు. ప్రసిద్ద కవుల, విద్వాంసుల, నాయకుల గురించి రాయడం విశేషం ఏమీ కాదు. అప్రసిద్ధ, అజ్ఞాత వ్యక్తుల గొప్పతనాన్ని పది మందికి పరిచయం చేయడమే ముఖ్యం. డా.నిత్యానందరావు అలాంటి మంచి పనులు ఎన్నో చేశారు. ఉస్మానియా తెలుగుశాఖలో పనిచేసిన వి.వి.రాఘవయ్య, రెండవ విద్యార్థి ఈటూరిలక్ష్మణరావు, తొలి విద్యార్థిని ఇల్లిందల సుజాత మొదలైనవారి వివరాలను సేకరించి అందించడంలో నిత్యానంద రావు పడిన శ్రమ, ఆరాటం, ఓపిక, చూపిన శ్రద్ధాభక్తులు నేటి పరిశోధకవిద్యార్థులకు ఆదర్శం కావాలి. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని మహాకావ్యంగా మలిచిన మహానుభావుడు బండ్ల సుబ్రహ్మణ్యం గారు. ఏమాత్రం కీర్తిప్రతిష్ఠలకు నోచుకోని వారి “ఆంధ్ర మహాభ్యుదయం” మహాకావ్యం ఇంపు సొంపుల్ని విప్పి చెప్పిన వెలుదండ రసానుభవ శక్తి ప్రశంసనీయమేకదా!




సంస్కృతంలో మహాపండితులు గా పేరుగాంచిన పుల్లెల శ్రీరామ చంద్రుడు తెలుగులో 1964 ప్రాంతంలో రాసిన రాఘవశతకం, సుమతీ శతకాల గురించి మనం విన్నది తక్కువే. పుల్లెలవారు 36 ఏళ్ళ వయస్సులో తలపండిన అనుభవాన్ని గడించి, సమకాలిన సాంఘిక రాజకీయ వాతావరణ కాలుష్యానికి పరివేదన చెందుతూ రాసిన ఈ పద్యం జీవుని వేదనకు తార్కాణంగా నిలుస్తుంది–

**శీలమె లేదు, శాస్త్ర పరిశీలన మన్నది సున్న, యెవ్వియో**
**నాలుగు, మూడు మాటల ననారత మిట్టటు ద్రిప్పుచున్ వృథా**
**కాలము బుచ్చుచుండుటయె కాని, విశేషమిట్టి ధీ**
**శాలురమంచు పొంగు కువిచారులదే యిది రోజు రాఘవా (పేజీ.49)**

57 ఏళ్ల క్రితమే కువిచారులు అంతగా వ్యాప్తం అయ్యారంటే, మరి ఈ రోజుల్లో వాళ్ళు రక్తబీజాసురులై అన్నిచోట్లా ఎంత విధ్వంసం కావిస్తున్నారో

ఊహించవలసిందే. సాహితీవ్రతుల వ్యక్తిత్వాల్లోని విశిష్టతను, ప్రత్యేకతను పసిగట్టే సామర్థ్యం, ప్రకటించే ప్రతిభ డా.నిత్యానందరావు గారికి పుష్కలంగా ఉంది.

డా.నిత్యానందరావుగారు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారి ద్రౌపది నవల అనౌచిత్య, అసహ్య, అసాంప్రదాయిక వికృత కాముక భావజాలాల విన్యాసం అని బల్లగుద్ది చెప్పిన ధీశాలి ధైర్యశాలీను. (పేజీ.100-103). సరస్వతీ పుత్రులెవరైనా సరే మంచిపని, మామంచిపని చేస్తే డా.వెలుదండ కుల మత ప్రాంత దృక్పథభేదాలు పాటించకుండా ప్రశంసిస్తా రనడానికి ఆచార్య జయధీర్ తిరుమల రావు గారి "సమగ్ర తెలుగు వాఙ్మయ సూచిక" కూర్పరి, నేర్పరి పనితనాన్ని గుర్తించిన వైనం, విన్నాణం గమనార్హం.(పేజీలు110-113)

ఆచార్య నిత్యానందరావు పరిశోధనలో ప్రముఖమైనవి విషయ సేకరణ, గ్రథన విధానం, స్పష్టమైన నిర్ణయాలు. "తెలుగు శాఖ ఆచార్య సేవా స్మరణం" (పేజీ.259-267), "ప్రగతిపథంలో తెలుగుశాఖ (1983-2018)" (పేజీ 272-283) , సయ్యద్ రాస్ మసూద్ ఓ.యు. ప్రప్రథమ ప్రిన్సిపల్ (పేజీ.301-307), ఎం.ఎస్.దొరైస్వామి (పేజీ.604-616) లాంటి వ్యాసాలు వెలుదండ వారి విలక్షణ పరిశోధనకు కొండగుర్తులు. ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు వ్యక్తులలోని విలక్షణతను గుర్తిస్తారు కాని ఆ వ్యక్తులతో గాఢ పరిచయం పెంపొందించుకొన్నందువల్ల వాళ్ళ వ్యక్తిత్వం, రచనల్లోని దోషాల్ని పేర్కొనడానికి ఇష్టపడరు. "భిన్న ధ్రువాలు సంగమిస్తున్నవేళ" (ఆచార్య చేకూరి రామారావు, జీవిఎస్.పేజీ.28-31) ఈ వ్యాసంతోపాటు మరి కొన్ని ఇందుకు ఉదాహరణలు. మది మేరలు దాటి బుద్ధికి విరామమిచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు.

"వ్యక్తిత్వసౌరభం" విభాగంలోని 76 వ్యాసాలు వ్యక్తి కేంద్రంగా పరిభ్రమించి ఆయావ్యక్తుల గుణాల్నీ, వాళ్ళరచనావిశేషాల్నీ వెల్లడించినవే. కాని "సాహిత్యసౌరభం" విభాగంలోని 48 వ్యాసాల్లో కొన్ని ఆ వ్యక్తుల సాహిత్యపటిమకన్నా కాకుండా వ్యక్తిశేముషినే విశదపరచి రాసినవి. "చంద్రముఖి ఎం.ఎ" (పేజీ.346-347) "ఆనందమఠం అనువాదకులెవరు" (పేజీ.నెం.396-400) "ఉస్మానియా తెలుగు శాఖ తొలి దివ్యాంగ పట్టభద్రుడు" (పేజీ.563-567) , ఉస్మానియా మూడవ విద్యార్థి ఆచార్య కె గోపాలకృష్ణ రావు" మొదలైన వ్యాసాల్లో సాహిత్యసౌరభం కన్నా వ్యక్తిత్వ పరిమళమే ఎక్కువైంది. వ్యక్తిత్వ, సాహిత్యసౌరభాలని రెండు విభాగాలు చేయకుండా ఒకే విభాగంగా ఉంటే ఈ చర్చ రాకపోయేది.

తెలంగాణీయులైన ఆచార్య నిత్యానంద రావు గారు ప్రాంతీయాభిమానం కలవారే కానీ ఇతర ప్రాంతీయ సాహిత్యాలను చులకనగా చూసే హ్రస్వదృష్టికి దూరంగా ఉండే హృదయ సంపన్నులు. కరణం బాలసుబ్రహ్మణ్యంపిళ్ళె, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ, పుట్టపర్తినారాయణాచార్యులు, విశ్వనాథ, మధునాపంతుల, ఆంధ్రశేషగిరిరావు, ఆరుద్ర మొదలైనవారి సాహిత్యపరిమళాల్ని చక్కగా వ్యాపింపజేశారు. ఆంధ్రీకృతపురాణాలమధురిమను పంచి పెట్టిన "ఆంధ్ర వ్యాస" ఏలూరిపాటి అనంతరామయ్య గారి అనన్య సామాన్యప్రతిభను చాటిన సహృదయత డాక్టర్ నిత్యానందరావు గారిది.

ఆచార్య నిత్యానందరావు గారి వ్యాస శీర్షికలు విషయ ఔన్నత్యాన్ని ప్రస్ఫుటించేలా , వ్యక్తుల వ్యక్తిత్వం పరిమళించేలా, త్వరగా చదవాలనే ఉత్కంఠ రేపేలా ఉంటాయంటూ ఆయన వ్యాస నిర్మాణ కౌశలాన్ని ప్రస్తుతించిన ఆచార్య కోలవెన్ను మలయవాసిని గారి మాటలు అర్థవంతాలు.

ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండు సంపుటాలు వెలువడ్డాయి. మరో ఐదు క్రమక్రమంగా అంద నున్నాయి. వాటిని కూడా పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

**ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం.**
**రెండవ సంపుటం అక్షరమాల (వ్యక్తిత్వ సాహిత్య సౌరభాలు)**
**పేజీలు 666. వెల. 800.**
**ప్రతులకు. నవోదయ బుక్ హౌస్ కాచిగూడ. హైదరాబాదు. లేదా రచయిత సెల్ 9441 666881కు గూగుల్ పే చేసి తెప్పించుకోవచ్చు.**

## మూసీ పదవినోదం - 34

### సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వ | ల్లం | 2 క్రి | 4 పి | ట్ట | X | 15 గు | 11 రి |
| ల్లం | X | 5 ల | క | చ | X | 16 డి | క్క |
| 3 కి | 7 ర | క్రి | ర | లా | 13 డు | తూ | X |
| 6 తా | మ | ల | గు | X | 14 లి | పి | 19 కా |
| ళం | జా | లా | X | 11 నె | X | 18 కు | శ |
| X | 10 ను | డు | వు | ల | దే | వ | త |
| 8 జీ | రో | X | 12 క | రా | చీ | X | గ |
| 9 రా | జా | ధి | రా | జు | X | 20 పా | వు |

# శ్రమ జీవుల చెమట కావ్యం – 'ఆపతి'


**కె. వెంకటేశ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9573927504

ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామం తన రూపును మార్చుకుంది. గ్రామం రూపును మార్చుకోవడం అంటే గ్రామాన్ని అంటిపెట్టుకున్న వృత్తులు కనుమరుగు కావడమే. ఆ వృత్తులలో ఉన్న శ్రమ జీవన సంస్కృతి, విలువలు కోల్పోవడమే. పాలకవర్గం తమ స్వార్థ ప్రయోజనాల కోసం వ్యవస్థలో మార్పురాక ముందే పాశ్చాత్య జీవన పద్ధతులు ఇక్కడి ప్రజలపై రుద్ది వృత్తులను నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నారు. జీవం కోల్పోతున్న వృత్తులను, వాటి విలువను ఈ దేశంలో వృత్తులు నిర్వహిస్తున్న పాత్రను రచయిత 'అవని శ్రీ' వృత్తి జీవితాలపై 'ఆపతి' పేరుతో కవిత్వం తీసుకరావడం హర్షించదగ్గ విషయం. ప్రస్తుత తరుణంలో వృత్తులన్నీ ఆపదలో ఉన్నాయని తెలియజేసిన కవిత్వం.

'మా పల్లె మాదిగలు' అన్న కవితలో 'మేము మాదిగలం / ఈ దేశ మూలవాసులం' అంటూ చరిత్రను గుర్తు చేస్తాడు. 'చెప్పులు కుట్టే ఆ చేతులకు వేల దండాలు / ఈ భూవినంతటిని భుజాన మోసే రారాజైన / నా మాదిగ జాతి కుట్టించిన చెప్పులే మోసేది / ................ కురుమయ్య పేరిట కొలువైన ఉద్దాలను / కండ్ల కద్దుకొని కాపాడమని కోరే వర్తమానమిది' అంటూ చెప్పుల వైభవాన్ని వివరిస్తాడు. 'మేము మాదిగలం / మానవత్వంలో సాటిరాని మహారాజులం' అంటూ కీర్తించాడు. 'వడ్ల ఆచారి' అన్న కవితలో వృత్తి పనితనాన్ని తెలుపుతూ 'రైతుల పనిముట్లకు పరికరాలకు / పురుడు బోసేటి వడ్రంగిని / నా చేతి వేళ్ళు ఐదు కొయ్యల గొర్రు / నా మోచేతి మూల/ నా శరీరపు నాగలి / నా కుడి కాలి బొటనవేలు / విత్తనాల కొయ్య'. 'ఇనుమును ఇంద్రధనస్సులా ఒంపితేనే / నల్లరేగడి పచ్చటి పంటల్ని కనేది / డాకలిపై ధన ధనమని కొట్టితేనే / మా కడుపులో పేగుల మంటలు సల్లేరేది' అనే కవిత వడ్ల కమ్మరులు పడుతున్న కష్టాలు పరికరాల తయారీలో వారి కృషి నేటి తరానికి తెలియని పరికరాల పేర్లు చెబుతూ గుర్తు చేస్తున్నాడు. పారిశ్రామికీకరణ వలన వారి జీవితాలలో వచ్చిన పెను మార్పులు తెలియజేస్తూ 'యంత్రాల ధాటికి యలకలబడ్డ/ నా కుటుంబాన్ని యేటిలో ముంచేస్తాను / పడమటి గాలి పెను దెబ్బలకు / తట్టుకోలేక తట్టబట్టుకొని కూలిగా మారి / కుదేలైపోయిన బత్కుల మారింది' అంటూ నేడు వడ్ల కమ్మరుల పరిస్థితిని, బతుకు భారమై జీవించడం కష్టంగా మారిన పరిస్థితులను వివరించాడు.

'పొరకలు పట్టిన చేతులు' అన్న కవితలో 'పొరకలు పట్టిన చేతులు / నగరాలకు నగిషీలు అద్దే హస్తాలు / పాసిబట్టిన రోడ్లపై / పండు వెన్నెల పూయిస్తారు'. నగరం నిద్ర లేవకముందే నిద్రలేచి శుభ్రం చేసే సఫాయి కార్మికుల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ 'ఎంత కష్టం చేసి కసువుగొట్టిన / కాన్కెలిచ్చే ప్రభుత్వం కనుచూపుకైనా కనబడట్లేదు' అంటూ ఇంత శ్రమ చేస్తున్న ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్న విషయాన్ని తెలియజేస్తాడు.

'మూడు పోయిరాళ్ళు' అన్న కవితలో సంచార జీవితాలు గడిపే వారిని గూర్చి 'యాప కొమ్మ నీడనే ఆపూటకు / మాకు ఇల్లు ఇడుపు / పట్టెడ్డన్నం పెట్టిన చెయ్యే ఆయాలకు / కడుపు నింపిన కన్నతల్లి / ఏ ఊరెల్లిన మూడు పొయ్యిరాళ్లే / మా




కడుపు నింపే గుండెలు'. 'వన్నె తగ్గని గొలుసులు, ఊపిరి బుగ్గలు, / పిన్నీసులు, రిబ్బన్లు, అద్దాలు, బొట్టు పిల్లలు / కొత్త బట్టలు, తల సెంబులు / ఒక్కటేమిటి / సకల సామాన్ల జాతరను తలపిస్తది / ఆ బంగారు మూట విప్పి చూస్తే చాలు' అంటూ ఊరూరు తిరుగుతూ వంట సామాగ్రి అలంకరణ సామాగ్రి అమ్ముతూ జీవితం వెళ్లదీసే సంచార జీవితాల గురించి చెప్తాడు. సంచారం సకల గ్రంథాల సారాంశం / సంచార జీవి / కోటి పుస్తకాల జ్ఞాన సంపన్నుడు' అని కీర్తిస్తాడు.

'దర్జీ' అన్న కవితలో 'చిన్న డబ్బ ఇంట్లో / పాత కుర్చీపై కూసోని / బట్టల మిషనును తొక్కుతు / పలురకాల బట్టలు కుడుతూనే / అందాల రంగురంగుల ఇంద్రధనుస్సుకే / ఈర్ష్య కలిగిస్తుంటాడు'. దర్జీల బతుకుల గురించి చెబుతూ చిన్న ఇల్లు, ఇంట్లో కుట్టుమిషన్, రంగురంగుల బట్టలు కత్తిరించి కుట్టే నైపుణ్యం మనిషి ఒంటికి సరైన రీతిలో బట్టలు కుట్టే దర్జీకి ఈ మానవ జాతి రుణపడి ఉంది అని చెప్పవచ్చు.

'చేనేత మగ్గం' కవితలో 'మా నరాలనే దారాలుగా అల్లుకుని / రంగురంగుల బట్టలను నేస్తూ / ఏ రంగులు లేని జీవితాలను నెమరు వేస్తం' అంటూ చేనేత కార్మికుల బాధలను తెలియజేశాడు. 'లోకానికి బట్ట కప్పినవాడి పెయ్యంత బరి బత్తలయ్యింది / పట్టుచీరలు నేసిన చేతులకు / పట్టెడన్నం కరువైంది'. అన్న వాఖ్యలు నేటి దీన స్థితిని తెలియజేస్తున్నాయి.

'ఎరుకలి వాకిలి' అన్న కవితలో 'ఎరుకలి / ఈ పేరు వినగానే / ఎక్కడో ఊరౌతలి గుడిసె / గుడిసె అంచునే పందుల గూడు / వెలివేతకు గుర్రైన బత్కులే / యాదొస్తాయి'. ఊరి చివర ఉండే ఎరుకల వారి ఇండ్లు, ఇండ్ల పరివారంలోనే పందుల నివాసం గురించి చెబుతూ 'పంది పిల్లలు తన పరివారం' అంటూ పందుల పెంపకం తోనే జీవితం ఆధారపడి ఉందని తెలియజేస్తున్నాడు. 'రచ్చ కట్టకు ఊరిబొడ్రాయికి దూరపు సుట్టమే' అంటూ సామాజిక సమస్యను మన ముందుంచాడు రచయిత.

'కుమ్మరి చక్రం' అన్న కవితలో 'మట్టి మా కన్న తల్లి / చక్రం మా జీవన రథం / కుండ నాగరికతకు తొలి పదం' అని చారిత్రక పరిణామంలో కుండ ప్రాధాన్యతను గుర్తుకు తెచ్చాడు. 'మనిషి బొడ్డుడీనప్పుడు / మాయిముంతనైన / తలగోరు గొట్టి / సాగనంపే కాడ పిండకూడుకుండనైనా / దింపుడు కళ్లం కాడ దిగిన శవాన్ని చూసి / చితి చుట్టూ నాలుగు సుట్లు తిరిగి / దుఃఖపడలేక పగిలిపోయిన కుమ్మరి గుండెను' మనిషి పుట్టుక మొదలు చావు వరకు కుండకున్న ప్రాధాన్యత తెలియజేస్తాడు. 'రాజుల కాలమైన / రాకెట్ కాలమైన / కుండకున్న విలువ కుండదే' అంటూ కుండ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

'నేను మంగలి వాణ్ణి' అన్న కవితలో 'నేను మంగలి వాణ్ణి / సమస్త మానవాళికి మైలకడిగేటోనణ్ణి / కడు బీదరికంలో కొట్టుమిట్టాడుతున్న / జీవితంలో కత్తి మీదనో / బ్లేడు మీదనో పాణమెల్లదీస్తున్న వాణ్ణి'. వృత్తిని నమ్ముకొని మనిషికి సేవ చేస్తూ కాలం వెల్లదీస్తున్న మంగలి కుల వృత్తి ఆ వృత్తిపై ఆధారపడ్డ జీవితాల గురించి చెబుతూ 'కడుపులో ఆకలి కరాళ నృత్యం చేస్తుంటే / తలపై కత్తెర భరత నాట్యమాడుతుంటది. అంటూ వారి దీన స్థితిని తెలియజేస్తాడు. 'సెలూన్ల మాయతో / కార్పోరేట్ శక్తులన్నీ / మా మంగలి కత్తిని మాయం చేసింది' అంటూ ప్రస్తుత తరుణంలో హైటెక్ సెలూన్లు ప్రవేశించడంతో మంగలి కత్తికి పనిలేకుండా పోయింది.

'ఈతాకు సాటు బిడ్డలం' అన్న కవితలో 'మేము ఈడిగోళ్ళం / భుజంపై నిచ్చెన / సేతిలా కల్లులొట్టి / ఉలిగూటం పట్టుకొని / సెట్టు సెట్టు తిరుగుతూ / సెట్టు గుట్టల పాలైన గౌడన్నలం మేము' అంటూ కల్లుగీతలో ఉన్న కష్టాలు కల్లు గీసే విధానాన్ని వివరిస్తాడు. 'కల్లు తాగిన నాడు జనమంతా కలిసిండేది / నేడు బీరు మందుతో కుటుంబ వ్యవస్థలే నాశనమైనవి' అంటూ నేడు మద్యం ఇంటింటికీ చేరిన తరుణంలో మానవీయ విలువలు ఎలా దిగజారిపోయాయో చెపుతున్నాడు. 'వృత్తి రక్షణ కోసం ఉద్యమాలెన్నో చేస్తున్నాం / కల్లుగీసే కత్తి పైన పెత్తనం జేస్తే మాత్రం / గీసే కత్తులతోనే ముందుకు కదుల్తం'. వృత్తి పరిరక్షణలో భాగంగా పాలకులు, దళారులు పెత్తనం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తాడు.

'నా తండా తండ్లాట' అన్న కవితలో 'నా తండా తల్లులు / కడుపు కాలినప్పుడల్లా / కట్టెలమ్ముతుంటరు / ఇల్లు నడవనప్పుడు / పురిటి పండుగనాడే / కన్న బిడ్డల నమ్ముకుంటరు' తండాలలో గిరిజనులు పూటకెళ్ళక బిడ్డలనమ్ముకొని కాలం వెళ్లదీసే దయనీయ పరిస్థితిని తెలియజేస్తాడు. 'ఓట్ల నాడే / ఒక్క పొద్దుజూసి / తండా కంట్లో / మన్నుగొట్టే రాజకీయ ఉద్దండులే / రాజ్యమేలుతారు.' ఎలక్షన్స్ రాగానేఓట్ల కోసం వచ్చేటువంటి నాయకులు తరువాత కనీసం వారి బాగోగులు పట్టించుకోని వైనాన్ని తెలియజేస్తాడు.

'నేను గొర్ల కాపరిని' అన్న కవితలో 'నేను గొర్ల కాపరిని / బడికి దూరమై దొడ్డికి దగ్గరై / బత్కుయల్లదీస్తున్న గొర్రెల కాపరిని' 'మూడు జానలు లేకున్న / మున్నూటరవై గొర్లకు పెద్దదిక్కును / మా పల్లెకే పగటి చుక్కను. 'అంటూ గొల్ల కురుమ పిల్లలు కులవృత్తిని నమ్ముకొని బడికి దూరమై బ్రతుకుతున్న తీరును వివరించాడు. 'నా చూపులు వనమూలికలకు పునాదులు / సబ్బండ జాతులను సలి నుండి కాపాడి / వెచ్చటి ఉన్ని గొంగళ్ళనిచ్చిన జాతినాది.' అంటూ 'జీవనోపాధి కరువై / జీవగంజే కరువైంది నాకు'. చెట్టు పుట్టల వెంట తిరుగుతూ మందలు మేపే కాపరికి వైద్య విద్యలో అపారమైన ప్రవేశం ఉందని, గొర్రె ఉన్ని తోటి గొంగళ్ళు, జోరెలు తయారు చేసే నైపుణ్యం గొర్రెల కాపరి సొంతమని చెప్పవచ్చు. నేడు భూములను రియల్ ఎస్టేట్. సెజ్‌ల పేర తీసుకోవడం పచ్చిక దొరకక వృత్తిని నమ్ముకున్న వారు కష్టాలు పాలవుతున్నారు.

'గాస గాడు' అన్న కవితలో 'ఈ పాడు జీవితానికి / దొర దొడ్డే నా చిరునామా' అని గాసగాళ్ళ జీవితాన్ని కళ్ళ ముందుంచాడు. 'ఆపతి' అన్న కవితలో శ్రమను నమ్ముకున్న కులవృత్తులు ఆపదలో ఉన్నాయని 'ఆపతి/సబ్బండ జాతుల బతుకులకు సోపతి' 'ఆపతి/ సబ్బండ జాతుల గుండెకోత' అంటాడు.

'దప్పుపాట' అన్న కవితలో' దప్పు/ సబ్బండ జాతికి ఆయుధం' అంటూ 'పాటకు ప్రాణం పోసి / రాగాలకు ఉపిరినిచ్చి / కవిత్వానికి కాళ్ళు దువ్విన / దప్పు / ఒక వాద్యం కాదు / ఖచ్చితంగా ఒక వేదమే'. ప్రతి వాదానికి కూడా తోడు నిలిచిన దప్పు ఖచ్చితంగా ఒక వేదమే అంటాడు రచయిత. 'జోడెద్దుల కన్నీరు' అన్న కవితలో 'జోడెద్దులు / సేద్యానికి చెమట పద్యాలు / రైతులకు పెద్ద కొడుకులు'. రైతులకు జోడెద్దులతో ఉన్న బంధాన్ని విడదీయలేమని చెప్తాడు. 'గాజుల సాయబు' అన్న కవితలో నేడు వారికి ఉపాధి లేని వైనాన్ని వివరించాడు.

'అడవి మల్లెలు' అన్న కవితలలో 'మేము అడవిమల్లెలం / ఈ అడవి కొమ్మకు పూసిన / ఆదివాసులం.' అంటూ అడవిని నమ్ముకుని బతుకెల్లదీస్తున్న ఆదివాసుల జీవన విధానాన్ని పోరుబాటను కళ్ళ ముందుంచాడు. 'సిగ్గిన చీర పేదరికపు గుర్తులు / మాసిననెత్తి మాడినకడుపు / ఆకలి చూపులు అలసిన దేహం' అంటూ పల్లెల్లో పండ్లు అమ్ముకునే వారి దైన్యస్థితిని 'బత్కుగంప మోసుకుంటూ' అన్న కవితలో కళ్ళకు కట్టినట్టుగా చిత్రించాడు.

'బోయ వాల్మీకులు' అన్న కవితలో వారి వారసత్వాన్ని గుర్తుకు తెస్తాడు. 'సాకిరేవు' అన్న కవితలో చాకలి జీవితాల గురించి చెబుతూ 'మా చేతులు చదివేసిన పుస్తకాలు' 'సదువుకున్నోడికన్న సకలోడే మేలననీ / పల్లెనే మాకు చదువు పట్టానిచ్చింది'. అని చాకలి వారి ప్రతిభను తెలియజేస్తాడు.


'కాటికాపరి' కవితలో కాటి కాపరుల పరిస్థితిని, 'రాతి బొమ్మ' కవితలో శిల్పకారుని కళానైపుణ్యాన్ని, 'మట్టి పూలు' కవితలో కూలితల్లులు మట్టి పూల పరిమళాన్ని వెదజల్లాడు. 'మావి వడ్డెర బత్కులు / బండ బారి గుండె లేని యతలు'. అంటూ వడ్డెరుల కష్టాలను వివరిస్తాడు.

'వడ్డెర ఎతలు' కవితలో. 'మా మఖాలకు / ఎన్ని రంగులు పూసుకున్న / రంగు రుచి లేని జీవితాలు మావి' అంటూ 'వృత్తి కళాకారులు' కవితలో కళను నమ్ముకున్న వారి కళా హీనమైన జీవితాలను వివరించాడు. ప్రపంచీకరణ వల్ల ఎడ్లబండి ప్రదర్శన కే పరిమితమైన వైనాన్ని 'ఎడ్ల బండి' కవితలో, 'సేద్యానం' కవితలో ఈ భూమి మీద ఉన్న ప్రతి ఒక్కరికి బువ్వ పెట్టెందుకు చేసే మహాయజ్ఞం సేద్యం అని అంటాడు. 'నీటి పాటం నేర్పినోడ' కవితలో 'జీవనమే కరువై / జలంలోనే సమాధౌతున్నారు'. అనే వాక్యాలు గుండెలను పిండేస్తాయి. దాదాపు ముప్పయి కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ప్రతి కవిత మనసును తట్టి పల్లెల్లోకి పట్టుక పోతుంది. పల్లె ప్రజల జీవితాలను మన కళ్ళముందు ఉంచుతుంది. పల్లె ప్రజలు ప్రస్తుతం పడుతున్న కష్టాలు కడగండ్లు వారు ఎటువంటి ఆపదల లో ఉన్నారన్నది కళ్ళ ముందు ఉంచాడు రచయిత.

సమీక్ష

# అన్నవరం దేవేందర్ 'ఊరి దస్తూరి' పదసంపద

**ఎస్. మహేందర్,** తెలుగు సహాయ ఆచార్యులు, సిద్ధిపేట ఫోన్ : 9642865013




'ఊరి దస్తూరి' వ్యాసాల సంపుటి. అన్నవరం దేవేందర్ ఈ వ్యాసాలను తన జీవిత అనుభవసారాన్ని ఊరి చిత్రాన్ని ఈ వ్యాసాలలో కళ్లకు కట్టినట్లు చిత్రించాడు. నిజానికి ఇవి వ్యాసాలే కానీ కథల్లాగా పాఠకున్ని చదివిస్తుంది. ఊరి దస్తూరి చదువుతుంటే పాఠకునికి తన సొంతూరి దస్తూరి సమాంతరంగా మనసులో నడుస్తుంది.

ఊరు దస్తూరి మన తెలంగాణ దినపత్రికలో వచ్చిన కాలమ్స్ మరియు ఆదివారం అనుబంధం హరివిల్లులో వచ్చిన దాదాపు మూడు సంవత్సరాల వ్యాసాలను క్రోడీకరించి తీసుకు వచ్చిన పుస్తకం. ఇవి అన్ని రెండు లేదా మూడు పుటలు మాత్రమే ఉంటాయి. ఇందులో (162) నూట అరవై రెండు వ్యాసాలు ఉన్నాయి. ప్రతిదీ దేనికదే ప్రత్యేకం. ప్రతి శీర్షికలో తెలంగాణ అస్తిత్వం కనబడుతుంది. ఇంకా చెప్పాలంటే కరీంనగర్ జిల్లా సంస్కృతి చిత్రణ అద్దం పట్టినట్లు కనిపిస్తుంది.

ఊరి దస్తూరి రచయిత అన్నవరం దేవేందర్ గతంలో వీరు తొవ్వ, నడక, మంకమ్మ తోట, లేబర్ అడ్డా, బుడ్డ పరకలు, బొడ్డు మల్లె చెట్టు, పొద్దుపొడుపు, పొక్కిలి వాకిళ్ళ పులకరింత, బువ్వ కుండ, ఇంటి దీపం, వరి గొలుసులు లాంటి కవితా సంపుటులను తీసుకు వచ్చినారు. వీరు అభివ్యక్తీకరించే విధానం అది కవిత్వమైనా, వ్యాసమైనా, మరి ఏదైనా సరే పాఠకున్ని చదివించేవిధంగా ఉంటుంది. వారు చెప్పే శైలి పాఠకున్ని చదివించడమే కాకుండా ఆలోచింప జేస్తుంది కూడా.

ఊరు దస్తూరి వ్యాసాలు చదివి పదాలను ఒక దగ్గర పేర్చితే అదొక తెలంగాణ పదకోశం అవుతుంది. ఆయన రాసిన వ్యాసాల్లో పదాన్ని చెప్పడానికి వ్యాసంలో

ఇరికించినట్లు ఉండదు. సహజంగా ఒకదాని తర్వాత ఒకటి చెప్పుకుంటూ పోతుంటే ప్రవాహంలా పదాలు వాటంతట అవే కథలో ఇమిడినట్లు ఉంటాయి. తన జీవిత అనుభవసారంలో వచ్చిన వ్యాసాల్లో పల్లె వాతావరణం కనిపిస్తుంది. ఇది చాలా మంది ఆ తరంవాళ్ళు అనుభవించి ఉంటారు కానీ అనుభవాలను అనుభవించి ఆ తాలూకు జ్ఞాపకాలను భద్రపరుచుకుని ఇన్నేళ్ళకు ఉన్నదున్నట్లుగా అక్షరీకరించడం అనేది అద్భుతం.

ఊరు దస్తూరి వ్యాసాలు చదివితే దానికి సిద్ధాంత వ్యాసం రాసేంత పరిధి ఉన్నది. ఇందులో కొన్ని వ్యాసాలు మాత్రమే విశ్లేషించాలనుకుంటున్నాను.

ఊరు ఊరంతా ప్రేమలో "గౌరాంతం" "బమ", "కాంచి", "బోరేం", "నికురం", "తుర్తి", "అయితారం" మొదలగు పదాలు వచ్చినాయి. ఇప్పుడు ఆ పదాలు పుస్తకాలకే పరిమితమైనవి, వీటి వాడకం కూడా తక్కువైంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ పదాలు మరుగున పడినవి. గౌరాంతాన్ని సందర్భాన్ని బట్టి ఆత్మగౌరవం, లేదా గర్వం అనే అర్థాలతో వాడుతారు. బమ అంటే ఆత్మీయత. కాంచి అంటే సైకిల్ నేర్చుకునే మొదటి దశను కాంచి అంటారు. బోరేం ఎడ్ల బండిలో ధాన్యం తీసుకు రావడానికి వాడే పెద్దదైన గోనె సంచిని బోరేం అంటారు. నికురం అంటే స్థిరం, తుర్తి అంటే నిమ్మలం. ఆదివారాన్ని గ్రామీణులు అయితారంగా పిలుస్తారు.

పొదుగు నుండి పిండే పాల ధార వ్యాసంలో "ఇత్తడి సర్వ", "పాల శేపులు", "చెలక పిండి", "దిగుడు", "దాలి", "పిడుక కున్నెలు", "పాలగోకు", "కశ్కే", "పదారి గోడ", "పిడుకల కుచ్చె", "కుంపటి" మొదలగు పదాలు మరుగున పడిన పదాలు. ఇక్కడ ఇత్తడి సర్వకు బదులుగా స్టీల్‌సర్వను వాడుతు, కాలానుగుణంగా ప్లాస్టిక్ క్యాన్లు కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. పాల శేపులు అనగా పశువుల పొదుగు నుండి పాలు పితకడానికి అనువైన సమయం గా పిలుస్తున్నారు. చెలక పిండి అంటే నేటి రోజుల్లో పశువుల దాణ బస్తాలు. దిగుడు అంటే నేటి తరం షెల్ఫు. దాలిని పాలు వేడి చేయడానికి గోడకు తవ్విన కుంపటి లాంటిది. పిడుక కున్నెలను నేడు పిడుకలు అనే అర్థంలో వాడుతున్నాం. పాలు వేడి చేసిన తర్వాత పాత్ర అడుగు, చుట్టూ పేరుకున్న పాల పదార్థమే పాల గోకు. కస్కే అనగా ఆల్చిప్ప. నేడు మనం వాడే చెంచా లాంటిది. పదారి గోడ ఇంటి ముందు, లేదా పక్కన గాని అనుకున్న గోడనే పదారి గోడ అంటాం. పిడుకలను ఒక చోట వరుసగా పేర్చితే దానిని పిడుకల కుచ్చె అంటారు. కుంపటి అనగా మట్టి పాత్రలో ఉనక, పిడుకలతో అగ్గి నిప్పలను నిల్వ ఉంచేది.

అన్నీ తెచ్చుకునుడు, ఇచ్చుకునుడే వ్యాసంలో "కీస", "ఇసిరెలు", "పొనుక", "బల్ల పీట" మొదలైన పదాలు ఊర్లోనే పరిమితమై వ్యవసాయ సంబంధ ఇళ్లలోనే అప్పుడప్పుడు ఈ పదాలను వాడుతున్నారు. వ్యవసాయంలో యాంత్రికరణ వచ్చిన తర్వాత చాలా పదసంపద మరుగున పడింది. కొత్త పదాలు చేరాయి. ట్రాక్టర్లు వచ్చిన తర్వాత వాటి విడి పరికరాల తాలూకు పదాలను ఉపయోగిస్తున్నారు. డీజిల్, మోటర్, కల్టివేటర్ మొదలగు పదాలు ఉపయోగంలోకి వచ్చినాయి. ఇక్కడ కీస అనే పదానికి జేబు అని అర్థం. ఇసిరెలు అంటే పరికరాలు. పొనుక అంటే ఎడ్లబండిలో ధాన్యం, ఎరువు గాని తీసుకపోవడానికి ఉపయోగించే వస్తువు. బల్ల పీట అనగా నేడు దివాన్‌ను పోలి ఉండేది.


ఊరు మొగులు మీద సింగిడి వ్యాసంలో "మొగులు", "సింగిడి", "మొలక నూకలు", "పాలకాయ", "గైకత్తి" మొదలగు మరుగున పడిన పదాలను తన వ్యాసంలో ప్రస్తావించారు. మొగులు అంటే ఆకాశం, సింగిడి అంటే ఇంద్రధనస్సు, మొలక నూకలు మొలక వడ్లను వేపి, దంచి ఆహారంగా తీసుకుంటారు. పాలకాయ అంటే కొబ్బరికాయ, గైకత్తినే కమ్మకత్తి అని పిలుస్తారు. ఈ గైకత్తితో చెట్లకు పైనున్న కాయలను గానీ పల్లగాని తెంపడానికి కొడవలిలాగ ఉపయోగించే పరికరం. దాన్ని పొడవైన వెదురుబొంగుకు కట్టి కాయల్ని, పండ్లను కోస్తారు.

ఈ విధంగా ఊరి దస్తూరి వ్యాస సంపుటిలో ఒక్కొక్క వ్యాసాన్ని చర్చించుకుంటూపోతే ప్రతి వ్యాసం నిండా మరుగున పడిన తెలంగాణా పద సంపద కన్పిస్తుంది. ఇవి కేవలం 4 వ్యాసాలలో చర్చించినవే. ఇలాంటివి 162 వ్యాసాలు ఈ సంపుటిలో ఉన్నాయి. ప్రతి వ్యాసాన్ని లోతుగా విశ్లేషణ చేస్తే తెలంగాణా పద సంపదను భావితరాల కోసం భద్రపరచవచ్చు. ఇవి తెలంగాణా పద సంపద అనిపించినప్పటికీ, కరీంనగర్ జిల్లా మాండలిక పదాలు ఎక్కువగా కన్పిస్తాయి.


**వేదాన్త డిండిమా స్తత్వం ఏక ముద్ఘోష యన్తియత్**
**అస్తాం పురస్తాత్ తత్తేజే దక్షిణామూర్తి సంజ్ఞితమ్**

వేదాన్త భేరీ నినాదములు ఏ ఏక సూత్రత్వమును ఉద్ఘోషించు చున్నవో, దక్షిణామూర్తి సంజ్ఞకమగు ఆ తేజము నాకు సాక్షాత్కరించుగాక!







**కోకిల (పద్య కృతి)**
ఆచార్య మసన చెన్నప్ప
వెల : 100/-
**ప్రతులకు :** రచయిత, 9-76/2, ఉదయ్ నగర్ కాలనీ, బోడుప్పల్, హైదరాబాద్ - 92.
ఫోన్ : 98856 54381



**శ్రీమచ్ఛంకరాచార్య కృత భజగోవింద స్తోత్రమ్.** - కీ.శే. విద్వాన్ మాచిరాజు శివరామరాజు.. వ్యాఖ్యాత : డా. వీపూరి వేంకటేశ్వర్లు వెల : 100/-
**ప్రతులకు :** డా. వీపూరి వేంకటేశ్వర్లు, 40-807, పి.ఎస్.ఆర్. హోమ్స్, ఫ్లాట్ నెం. 5, నెహ్రూ నగర్, కర్నూలు - 518 004.
ఫోన్ : 9885585770




**చరిత్ర పరిశోధన వ్యాసావళి - 2**
కందకుర్తి యాదవరావ్
**ప్రతులకు :** కందకుర్తి ఆనంద్, 3-9-52, యమునా తరంగిణి, కోటగల్లి, నిజామాబాద్ - 503 001.
ఫోన్ : 99519 39737
ప్రచురణ : ఇతిహాస సంకలన సమితి (భారతీయ), ఇందూర్.




**కాళిదాస విరచిత మేఘ సందేశమ్**
స్వేచ్ఛాకవితానువాదం 'రఘువర్మ' (టి. లక్ష్మీనారాయణ) వెల : 70/-
**ప్రతులకు :** రచయిత, 3-1-264, పురానీపేట, జగిత్యాల - 505327
ఫోన్ : 92900 93933




**జోహార్లు (ఇందూరు ప్రాంత స్వాతంత్ర పోరాట యోధులు)**
పద్యం : గంట్యాల ప్రసాద్, గద్యం : కందకుర్తి ఆనంద్
వెల : 100/-
**ప్రతులకు :** గంట్యాల ప్రసాద్, 3-3-360, గాయత్రి నగర్, నిజామాబాద్ - 503 001.
ఫోన్ : 94403 56306
ప్రచురణ : ఇతిహాస సంకలన సమితి (భారతీయ), ఇందూర్.

## స్వకృతి

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

ఒమిక్రాన్ (omicron) విజృంభణ నేపథ్యంలో రచించిన కవిత

# మేం భారతీయులం – బతుకు వెలుగు ప్రేమికులం

*పరబ్రహ్మ* వికటాట్టహాసం నుండి
పుట్టిన నిశ్శబ్ద విస్తరణ శీలవా నీవు కరోనా ???
బహురూప ధ్వంస రచనకు ఒడిగడ్తున్నావు నీవు ?!
నేలనంతా స్మశానంగా
రూపొందించాలని శపథం పడుతున్నావు
విషజ్వరక్రిమి వ్యాప్తికి
గాలినంతా వడపోయాలని కక్ష కడ్తున్నావు
పరాభూతవైనప్పటికీ పరాజితను కానని–కాబోనని
పౌనఃపున్యంగా
దాగుడు మూతలాటల గమనికలతో బతకడం నేర్చుకొమ్మంటూ
మా ఉసురులకు సవాల్ విసురుతున్నావ్
***బతుకు రుచిని చంపిన పిశాచమా !***
చచ్చిన పామును మరి మరి పొడిచి చంపినట్లు
ఉన్న *కాసంత:* కాస్తంత బతుకు బట్టను కట్టనీయని కసి నీది
***వృత్పున్నత తో జీవనప్రతిభను గెలిచే – మలిచే***
***ధన్వంతరీయవైద్యులం మేం భరోసా జీవులం***
***ఆకుపసరు మందు నుండి అత్యాధునిక అంతర్జాతీయ***
***వైద్యం వరకూ మాకు తెలిసిన సంగతులే !!!***

***అల్లోపతి హోమియోపతి ఇవే కాకుండా మరెన్నో***
***మాకు తెలిసిన గొప్ప విశేష వైద్యశాఖలే !***
మేం భారతీయులం మేం వెలుగు ప్రేమికులం

*కొక్కొరొకో* కోడిపుంజులతో పాటు
పురివిప్పిఆడే నెమిళ్ళను వెంట
తిప్పుకునే జీవనోద్యాన విహార రసికులం
ఓ కరోనా తుమ్ క్యాకరేంగే
హమారా "ఊంగా ఊంగా" పసి పిల్లలసాంగ్
సదా చల్ రహేంగా
హమ్ భారత్ వాసిఃయో
మేం భారతీయులం *ప్రామినుకులు* మావే !
బహు భాషల తేనె చినుకులు మావే !
కుంభక–రేచక ప్రాణనియంత్రణల గరిమ మాదే !
తొలి మానవ తరాల జీవన సరిగమల పాట మాదే !
*నేల కాగితపు* మందమైన పొరలపై
*నాగలి కలం తో* బతుకు పచ్చని పాట రాసి
అందమైన బొమ్మలేసి బమ్మ దేవునికే
దిమ్మతిరిగేలా జీవన కృషి నేర్చిన వాళ్ళం!
*సరస్వతమ్మ తో* సంభాషిస్తూ
"అవును భారతీ !
"నీ పేరిటి బతుకు వెలుగు మనుషులు
ఎన్నెన్ని వ్యథలనైనా తట్టుకోగల వారు భారతీయులు
దార్శనికులు బతుకు కలల ప్రేమికులు"
అంటూ పలికిన మాటలు విని
మా తెలుగు కవి బాల గంగాధర తిలక్ కు మల్లే
*సరస్వతీ చతురాననులు* అందించిన
*అమృతం* తాగి వచ్చిన వాణ్ణి నేను
నా జాతి మీది ప్రేమతో–జీవితం మీది ప్రేమతో
భారతీయులందరి పక్షాన నిలిచి
ఓ కరోనా నిన్ను నేను హెచ్చరిస్తున్నాను తోక ముడుచుకొమ్మని!
వినకుంటే మేం భారతీయులం
నీ కంఠానికి – ఉరులం – ఉరుతరాయుధులం
మేము పతంజలి వారసులమని
విశ్వ ప్రతిసృష్టి కర్తయైన
***విశ్వాఽ ఽ మిత్ర*** సంతతి వాళ్ళమని **విశ్వ + అమిత్ర**
విశ్వముతో ***సృష్టి ప్రారంభ కాల ప్రప్రథమ స్పృహా హాస వసంత***
***సమయ బిందువు నుండి***
**పరిణామ కేళీకలాప జీవరేఖకు ప్రాణ సఖులమని**
బహిరంగ ప్రకటన చేస్తున్నాను.

మా గురించి మా *వేదం* గురించి మా సుసంజీవన సిద్ధ
*ఆయుర్వేదం* గురించి
మా *శిలా* ప్రాణప్రతిష్ఠాపన ఖ్యాతి గురించి
మా పురుషకారం గురించి మా పురుష సూక్తం గురించి
*మృత్యుంజయ మహా మంత్రం* గురించి
ఏమీ ఎఱుంగని పిచ్చిదానా *!*
మరణకృతిపతనాసక్త నక్తంచరీ ! దివారాత్ర విభజన సమయ
రాహిత్య వినీల విస్రస్త వికట కేశినీ !
వికట కటాక్షవీక్షణా ! నీవు విషసమయోద్భవు !
సమయ శిక్షాసూత్రావళితో మాస్కులతో
నీ భరతం పడతాం – నిన్ను మట్టు బెడతాం
*మా ఊపిరి* తెగువతో
ఎలుగెత్తి – వెలుగెత్తి చాటే బతుకు తెలివికి తెరలెత్తుతాం
మేం మరణ రహస్య విజయకేతనధారులం
*నచికేత* వారసులం మేం భారతీయులం
మేం బతుకు నాట్యంలో ప్రవీణులం
భరతమునినీ – సిద్ధేంద్ర యోగినీ స్మరిస్తాం – అర్చిస్తాం

మేం భారతీయులం మేము బ్రతికి తీరుతాం

కరోనా "ఓ" కరోనా
నీకు టాటా వీడుకోలు ! నీకు గుడ్ బై ఇంక సెలవు !!

**గురిజాల రామశేషయ్య**
**చరవాణి : 70326 79471**